అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 14-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 354 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



రైతులపై టియర్ గ్యాస్

జల ఫిరంగుల ప్రయోగం

అష్టదిగ్బంధంలో దేశ రాజధాని

- బారికేడ్లు, సిమెంట్ దిమ్మలతో పోలీసులు అడ్డుకునే యత్నం
- రోడ్లపై ఇనుప మేకులు..సరిహద్దులు మూసివేత
- భారీగా బలగాల మోహరింపు
- ఉద్రిక్తంగా 'ఢిల్లీ చలో'

న్యూఢిల్లీ : అన్నదాతల 'ఢిల్లీ చలో' కార్యక్రమం మంగళవారం ఉద్రిక్తతలకు దారితీసింది. పలు చోట్ల పోలీసుల కన్నుగప్పిన రైతులు బారికేడ్లను ఛేదించుకొని రాజధానిలో ప్రవేశించారు. మరోవైపు వారిని చెదరగొట్టేందుకు పోలీసులు నీటి ఫిరంగులు, భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ముఖ్యంగా హర్యానా-పంజాబ్ సరిహద్దులోనూ, రాజధానిలో ప్రవేశించే ప్రాంతాల్లోనూ యుద్ధ వాతావరణం కన్పించింది. అంబాలాలోని షంభూ సరిహద్దు వద్ద బారికేడ్లను తోసుకొని ఢిల్లీ వైపు దూసుకెళుతున్న యువకులపై పోలీసులు భాష్పవాయు గోళాలను విసిరారు. కొందరు రైతులను అడ్డుకొని నిర్బంధించారు. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో పోలీసులు, పారా మిలటరీ దళాలు పెద్ద ఎత్తున మోహరించాయి. అల్లర్లను అదుపు చేయడానికి వాహనాలను సిద్ధంగా ఉంచారు. భద్రతా వలయాన్ని ఛేదించుకొని పంజాబ్ నుంచి రాజధానికి వస్తున్న రైతులపై హర్యానాలోని జింద్ జిల్లాలో పోలీసులు జులుం ...12లో

తక్షణమే బలగాలను ఉపసంహరించుకోవాలి

- రైతులపై అణచివేతకు ఎస్కేఎం ఖండన
- ఫిబ్రవరి 16న దేశవ్యాప్త నిరసనకు పిలుపు ...11లో



రైతులపై డ్రోన్లతో బాష్పవాయుగోళాల ప్రయోగం



వెంట పడ్తాం.. వేటాడ్తాం..

తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే తిరగనివ్వరా

- నన్ను చంపితే మీరు ఉంటరా..
- నా కట్టె కాలేవరకు తెలంగాణ కోసం పోరాడుతా..
- మళ్లీ డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తాం..
- అసెంబ్లీ తీర్మానం సరే.. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- సంపూర్ణమైన నీటి వాటా వచ్చే వరకు కొట్లాడుతాం
- దమ్ముంటే మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయాలి
- అసెంబ్లీ అయ్యాక మేం కూడా సందర్శిస్తాం
- రాష్ట్రంలో దద్దమ్మల రాజ్యం
- ఇది రాజకీయ సభకాదు..ఉద్యమ సభ.. : మాజీ సీఎం కేసీఆర్



నవతెలంగాణ-మిర్యాలగూడ(నల్లగొండ)

కృష్ణా జలాల వాటా వచ్చే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వెంటపడి వేటాడ్తాం.. అది సాధించే వరకు నిద్రపోనియం.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే తిరుగనివ్వరా.. నా కట్టె కాలే వరకు తెలంగాణ కోసం పోరాడుతా.. అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కృష్ణాజలాల వాటా సాధన కోసం మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ వద్ద ...3లో

సుద్దపూస మాటలొద్దు

అవినీతి సొమ్ముకక్కిస్తాం

- నల్లగొండకు కాదు.. ముందు అసెంబ్లీకి రండి
- కేసీఆర్ కుట్రలను ప్రజలందరూ తిప్పికొట్టాలి
- తెలంగాణ ప్రజలు, కవులు, కళాకారులు ఆలోచించాలి
- బీఆర్ఎస్ అవినీతికి బీజేపీ కొమ్ము కాస్తోంది
- ఆ రెండు పార్టీలు చీకటి మిత్రులు
- మేడిగడ్డలో నిర్మాణ లోపంతోపాటు, నిర్వహణ లోపం ఉంది : సీఎం రేవంత్

మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీనుంచి
బి. బసవపున్నయ్య

" కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిని కక్కిస్తాం. రెవెన్యూ యాక్ట్ ప్రకారం నిధులను రికవరీ చేస్తాం. మాజీ ముఖ్యమంత్రి నల్లగొండకు పోవడం కాదు... ముందు అసెంబ్లీకొచ్చి ప్రజల తరపున సమస్యలపై మాట్లాడాలి. సుద్దపూస లాగా బయట కూర్చొని మాట్లాడొద్దు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మాజీ సీఎం కేసీఆర్‌కు చురకలు అంటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల, బ్యారేజీలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు, కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ అవినీతికి కొమ్ముకాస్తున్న బీజేపీని సైతం తిరస్కరించాలని ఆయన కోరారు. ప్రాజెక్టుల్లో ...3లో





పలుకే బంగారమాయెరా..

- లోక్‌సభలో పెదవి విప్పని 9 మంది ఎంపీలు
- వారిలో ఆరుగురు బీజేపీ వారే
- జాబితాలో సన్నీ డియోల్, శత్రుఘ్న సిన్హా

న్యూఢిల్లీ : 17వ లోక్‌సభలో అసలే పెదవే విప్పని ఎంపీలు ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది కదూ! అవును మరి. వారి పలుకే బంగారం అయిపోయింది. రాజకీయవేత్తలుగా మారిన సినీ నటులు సన్నీ డియోల్, శత్రుఘ్న సిన్హా కూడా లోక్‌సభలో ఒక్క మాట కూడా మాట్లాడలేదట. ఇలా లోక్‌సభలో తమ గొంతుక వినిపించని ఎంపీలు మొత్తం తొమ్మిది మంది. గురుదాస్‌పూర్ నుండి తొలిసారి బీజేపీ తరఫున ఎంపీగా ఎన్నికైన సన్నీ డియోల్ కొన్ని లిఖితపూర్వక అభ్యర్థనలు మాత్రం చేశారట. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన శత్రుఘ్న సిన్హా అయితే అది కూడా లేదు. ఆయన ఒక్క మాట మాట్లాడలేదు సరికదా లిఖితపూర్వక అభ్యర్థనలు కూడా అందజేయలేదు.

2019 మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత 17వ లోక్‌సభ జూన్ 17న తొలిసారిగా సమావేశమైంది. సభలో 543 మంది ఎంపీలు ఉండగా వారిలో తొమ్మిది మంది గత ఐదు సంవత్సరాల కాలంలో ఏ చర్చలోనూ, ఏ సంప్రదింపులలోనూ పాల్గొనలేదు. ఈ జాబితాలో బీజేపీకి చెందిన వారు ఆరుగురు ఉండగా తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు ఇద్దరు, బీఎస్పీకి చెందిన వారు ఒకరు ఉన్నారు. రమేష్ చందప్ప జిగాజినగీ (బీజపూర్-కర్నాటక), ప్రస్తుతం జైలులో ఉన్న అతుల్ కుమార్ సింగ్ (ఘోసీ-యూపీ), దివ్యేందు అధికారి (తమ్లుక్-పశ్చిమ బెంగాల్), బీఎస్ బాచెగౌడ (చిక్కబళ్లాపూర్-కర్నాటక), ప్రధాన్ బారువా (లఖింపూర్-అసోం), సన్నీ డియోల్ (గురుదాస్‌పూర్-పంజాబ్), అనంత్ కుమార్ హెగ్డే (ఉత్తర కన్నడ-కర్నాటక), వి.శ్రీనివాస ప్రసాద్ (చామరాజనగర్-కర్నాటక), శత్రుఘ్న సిన్హా (అసన్‌సోల్-పశ్చిమ బెంగాల్) లోక్‌సభ చర్చల్లో భాగస్వాములు కాలేదని దిగువసభ రికార్డులు చెబుతున్నాయి. వీరిలో ఆరుగురు లిఖితపూర్వక అభ్యర్థనలు అందజేయగా శత్రుఘ్న సిన్హా, అతుల్ కుమార్ సింగ్, చందప్ప మాత్రం ఆ పని కూడా చేయలేదు.

తొలిసారి సభకు ఎన్నికైన సభ్యులతో మాట్లాడించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించినా వారి నుండి ఎలాంటి స్పందన రాలేదు. 17వ లోక్‌సభ సమావేశాలు ఈ నెల 9న వాయిదా పడిన విషయం తెలిసిందే.

రాష్ట్రం నుంచి వాళ్లను వెళ్లగొడతాం..

- మణిపూర్ సీఎం మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు



వివరాలు 11లో

నల్ల చట్టాలతో మోడీ దగా

- బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా 16న గ్రామీణ బంద్, సమ్మె : కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి
- ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రధాని మోడీ నల్ల చట్టాలతో దేశంలోని రైతుల్ని మోసం చేశారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎమ్.కోదండరెడ్డి విమర్శించారు. అన్నదాతల ఆందోళనతో సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించిన మోడీ...ఆ తర్వాత సంబంధిత బిల్లులను వెనక్కి తీసుకోలేదని విమర్శించారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అదేరోజు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రైతు, కార్మిక, కూలీ సంఘాలు నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన వివిధ రైతు, కార్మిక, కూలీ సంఘాలు సమావేశమయ్యాయి. ఈనెల 16న నిర్వహించతలపెట్టిన గ్రామీణ బంద్, సమ్మె తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ...3లో

కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు టైంస్కేల్?

సాధ్యాసాధ్యాలు పరిశీలించనున్న విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేల్‌ను వర్తింపచేయాలని ప్రభుత్వం సమాలోచన చేస్తున్నట్టు తెలిసింది. వారిని రెగ్యులరైజ్ చేయడం లేదంటే మినిమం టైంస్కేల్‌ను వర్తింపజేసే అంశాల పట్ల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. నిబంధనల ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో చూడాలని కోరింది. అయితే కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలనీ, మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలంటూ గతేడాది డిసెంబర్ తొమ్మిదిన తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 495 కేజీబీవీలున్నాయి. 245 కేజీబీవీల్లో ఇంటర్ వరకు, మిగిలిన ...3లో

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

- ఫలితాలు విడుదల
- 23 మందికి 100 శాతం స్కోరు
- తెలంగాణ నుంచి ఏడుగురు, ఏపీ నుంచి ముగ్గురు



వివరాలు 11లో

గాజా యుద్ధంలో అదానీ డ్రోన్లు !

- ఇజ్రాయిల్‌కు విక్రయించిన హైదరాబాద్ కంపెనీ
- ఇప్పటికే 20కి పైగా యూఏవీల సరఫరా



వివరాలు 11లో

సాగర్ సురక్షితమా..?

- డ్యామ్‌ను సందర్శించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం
- వారి వెంట ఆంధ్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు
- మూడ్రోజుల పాటు కొనసాగనున్న పరిశీలన



వివరాలు 10లో..

వడ్డించేవారు మనవారైతే...

వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దైనా అక్కడే..!

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల వర్క్‌ఆర్డర్లు, డిప్యూటేషన్లు రద్దు చేస్తూ ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా ఆరు రోజుల కిందట మెమో జారీ చేశారు. ఈ పరిణామం ఆ శాఖ ఉద్యోగులను ఆందోళనకు గురిచేసింది. అయినా కొందరు మాత్రం ఉన్నచోటనే తిష్ట వేయడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఇతర ప్రభుత్వ శాఖల కంటే వైద్య ఆరోగ్యశాఖలోనే డిప్యూటేషన్లపై అత్యధికంగా వైద్యులు, నర్సులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వరకు డీపీహెచ్‌గా పనిచేసిన డాక్టర్ గడల శ్రీనివాసరావు తమ పరిధిలోని వైద్యులు, ఉద్యోగులకు వారు కోరిన విధంగా డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి.

- జాబితా పంపే క్రమంలో అధికారుల మాయాజాలం
- ఉన్నతాధికారులను పక్కదోవ పట్టించేలా లిస్టు
- ఏండ్ల తరబడి స్థానచలనం లేకపోవడంపై అనుమానాలు

ప్రభుత్వం మోమో జారీ చేసినా అంతేనా?

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి / ఖమ్మం

డీపీహెచ్, డీఎంఈలను ఆ పోస్టుల నుంచి బదిలీ చేసిన వెంటనే ప్రభుత్వం డిప్యూటేషన్లు రద్దు చేసింది. పాత అధికారుల వద్ద పనిచేసిన సిబ్బంది కొందరు రూ.లక్షలు తీసుకుని డిప్యూటేషన్లు, వర్క్‌ఆర్డర్లు ఇప్పించారనే అనుమానాలున్నాయి. తిరిగి ఆ ఉద్యోగుల చేతుల్లోకే జిల్లా అధికారులు పంపించిన బదిలీల జాబితాలు వెళ్లడంతో వారు 'వడ్డించేవారు మనవారైతే...' అనే రీతిలో అసలు విషయాలను కప్పి పెట్టి అధికారులు పంపిన జాబితాలనే ఫైనల్ ...11లో



ఏసీబీ వలలో శామీర్‌పేట తహసీల్దార్

- రైతు నుంచి రూ.10లక్షలు లంచం తీసుకుంటూ..



నవతెలంగాణ-శామీర్‌పేట

భూమిని ధరణిలో ఎక్కించేందుకు రైతు నుంచి రూ. 10 లక్షలు లంచం తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ ఏసీబీకి చిక్కాడు. ఏసీబి డీఎస్పీ మజీద్ అలీఖాన్, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలంలోని ఎమ్మార్వో కార్యాలయం తహసీల్దార్ సత్యనారాయణ. లల్గాడి మలకపేట గ్రామ రెవెన్యూ పరిధిలో 29 ఎకరాల భూమిని 2006లో మువ్వ రామశేషగిరిరావు అనే రైతు కొనుగోలు చేశాడు. 2013లో పట్టాదారు పాసుబుక్కులు కూడా వచ్చాయి. కాగా ధరణిలో తన భూమి నమోదు కోసం రెండేండ్ల కిందట శామీర్‌పేట తహసీల్దార్‌ను సంప్రదించాడు. అందుకు తహసీల్దార్ రూ.30 లక్షలు డిమాండ్ చేశాడు. ఏడాది కిందట రూ.10 లక్షలు ఇచ్చాడు. అలాగే, 2023 డిసెంబర్ 28న తహసీల్దార్‌కు రూ.20 లక్షల చెక్కును బాధితుడు రాసి ఇచ్చాడు. అయినా మరో రూ.10 లక్షలు తన డ్రైవర్ బద్రికి ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు. దాంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో బాధితుడు మంగళవారం రూ.10 లక్షలను తహసీల్దార్ డ్రైవర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

అనంతరం శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అదేవిధంగా తహసీల్దార్ స్వస్థలం పెద్దపల్లి జిల్లాలోని అతని నివాసంలో, ప్రస్తుతం ఉంటున్న శామీర్‌పేట మండలంలోని తుంకుంటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దాడులు నిర్వహించినట్టు డీఎస్పీ వివరించారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున్, పురేందర్ బట్టు, సిబ్బంది పాల్గొన్నారు. ఏసీబీ అధికారులు ఇదివరకే నాలుగుసార్లు రెక్కీ నిర్వహించగా మూడుసార్లు తప్పించుకున్న తహసీల్దార్ నాలుగోసారి రూ.10 లక్షలు లంచం తీసుకుంటూ చిక్కాడు.

తల్లీకొడుకు దారుణ హత్య

- మంత్రాల నెపంతోనే..!



నవతెలంగాణ-గూడూరు

మహబూబాబాద్‌జిల్లా గూడూరు మండలంలో మంగళవారం మధ్యాహ్నం బోల్లపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల సమ్మక్క(55), ఆలకుంట్ల సమ్మయ్య(35) దారుణ హత్యకు గురయ్యారు. వారికి మంత్రాలు వస్తాయనే అనుమానంతో అదే గ్రామానికి చెందిన శివరాత్రి కుమార్ అతి కిరాతకంగా రాడ్డుతో కొట్టి హత్య చేశాడు. వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా శివరాత్రి కుమారస్వామి, ఆలకుంట్ల సమ్మయ్య కుటుంబాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. సమ్మయ్య కుటుంబీకులకు మంత్రాలు వస్తాయని కుమారస్వామి ఆరోపణ. ఈ క్రమంలో గ్రామంలో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టారు. కుమారస్వామి ఆటో నడుపుతూ గూడూరు మండల కేంద్రంలో కుటుంబ సభ్యులతో జీవనం సాగిస్తున్నాడు.

సమ్మయ్య కూడా ఆటో నడుపుతుండగా కుటుంబం వరంగల్‌లో ఉంటోంది. గత శుక్రవారం గూడూరు మండల కేంద్రంలో సమ్మయ్య, కుమారస్వామి మధ్య వాద్వివాదం జరిగింది. సమ్మయ్య కుటుంబ సభ్యులు అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్లో కుమారస్వామిపై కేసు పెట్టారు. మంగళవారం సమ్మయ్య తల్లి సమ్మక్క, తండ్రి కొమురయ్య, భార్య రజితతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తిరిగి ఆటోలో ఇంటికి వెళ్తుండగా.. కుమారస్వామి ఆటోలో వెళ్తూ ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. స్థానికులు చూస్తుండగానే కుమారస్వామి ఆటోలో నుంచి ఇనుప రాడ్డు తీసి మొదట సమ్మయ్య తలపై దాడి చేయడంతో అక్కడికక్కడే పడిపోయాడు. ఆ తర్వాత సమ్మయ్య తల్లి సమ్మక్క తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కుమారస్వామిని స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ, సత్యనారాయణ, సీఐ పనిధర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాక్టర్‌లో మృతదేహాలను ఆస్పత్రికి తరలిస్తుండగా బాధితుల బంధువులు అడ్డుకోవడంతో వారికి పోలీసులు నచ్చజెప్పారు. సమ్మయ్య భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముగిసిన నాగోబా జాతర

- బేతాల్, మండ వాజలింగ్ పూజలు
- భుదుందేవ్‌కు పయనం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ముగిసింది. నాగోబా సన్నిధిలో మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున బేతాల్, మండ గాజాలింగ్‌కు పూజలు చేసి జాతరకు వీడ్కోలు పలికారు. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం మెస్రం ఆడపడుచులు గోవాడ ప్రాంతంలో పటేల్ వెంకట్ రావ్, కుల పెద్దలకు అభిషేకం చేసి బేతాల్ పూజకు ఆహ్వానించారు. వారి సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తూ, కుల పెద్దలకు పాదాభివందనం చేశారు. అనంతరం బేతాల్ నృత్యం, మహిళలు, పురుషులు వేర్వేరుగా కర్రసాము ఆడారు. తమ జాతర విజయవంతం అయిందని వారు సంతోష దాయకంగా ఈ బేతాల్ నృత్యం చేస్తారు. అనంతరం నాగోబా ఆవరణలో సందర్శకులు సమర్పించిన పేలాలు, కాయలు ఒక చోటికి పేర్చి మెస్రం వంశీయులకు అందజేశారు. పూజలకు ఉపయోగించిన మట్టి కుండలను మెస్రం ఆడపడుచులకు అందజేశారు. అనంతరం సాయంత్రం వేళల్లో నాగోబా జాతరకు వీడ్కోలు పలికారు. ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లో వెలసిన భుదుం దేవత పూజకు పయనమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

- కేసీఆర్ సభానంతరం ట్రాఫిక్ క్లియర్ చేస్తుండగా ప్రమాదం

నవతెలంగాణ- నల్గొండ టౌన్

నల్లగొండ పట్టణంలో మాజీ సీఎం కేసీఆర్ సభ నేపథ్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుండగా రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన నల్లగొండ మండల పరిధిలోని చర్లపల్లి వద్ద మంగళవారం జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి బైపాస్ వద్ద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ నిర్వహించారు.

సభ అనంతరం ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న సమయంలో హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్న నెంబర్లేని కారు హోంగార్డు కిషోర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. అదే సమయంలో బహిరంగ సభ ముగించుకొని హైదరాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్యే కారు కింద కిషోర్ పడ్డాడు. దీంతో కిషోర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో హోంగార్డు కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ఓబీసీ గుర్తింపునకు ఎదురుచూపులు

40 కులాలు కేంద్ర విద్య, ఉపాధి అవకాశాలకు దూరం

రెండుసార్లు జాతీయ బీసీ కమిషన్ విచారణ

- కేంద్ర సోషల్ జస్టిస్ శాఖలో పెండింగ్‌లో ఫైలు
- ఎన్నికల్లోపు పూర్తయ్యేనా?

భారత స్వాతంత్ర్యపు 75 వసంతాల వజ్రోత్సవాలు పూర్తయిన తరుణంలోనూ దేశంలో 80 కులాలు, రాష్ట్రంలో 40 కులాలకు కేంద్ర ప్రభుత్వ ఓబీసీ గుర్తింపు దక్కలేదు. ఆ సామాజిక తరగతుల వారు విద్య, ఉపాధి అవకాశాలకు ఆమడ దూరంలో జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(24), 16(4) వర్తించకపోవడంతో న్యాయబంద్ధంగా రావాల్సిన కేంద్ర ప్రభుత్వ విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ చివరి పార్లమెంట్ సమావేశాలు కావడం ఈ సెషన్‌లోనైనా ఓబీసీ బిల్లును కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలుపుతుందా అని 40 కులాలు ఎదురు చూస్తున్నాయి.



నవతెలంగాణ-నవీపేట్

కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టే 6వ, 9వ తరగతి జవహర్ నవోదయ, కేంద్ర సైనిక్ ప్రవేశ పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. 40 కులాల్లోని విద్యార్థులు ఈ పోటీ పరీక్షలకు హాజరైనప్పటికీ ఓబీసీ కుల గుర్తింపు లేక వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉందని ఆ సామాజిక తరగతుల ప్రతినిధులు వాపోతున్నారు.

ఢిల్లీకి రెండుసార్లు విచారణకు హాజరు

జాతీయ ఓబీసీ కమిషన్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్రంలోని 40 కులాల ప్రతినిధులు హాజరవ్వగా.. రాష్ట్రం నుంచి బీసీ కమిషన్ సభ్యులుగా నియమించబడిన తల్లోజీ ఆచారి అధికార హెూదాలో విచారణ చేపట్టినప్పటికీ సరైన సమయంలో రిపోర్ట్ అందకపోవడంతో నిలిచిపోయింది. తర్వాత హంస రాజ్ అహీర్ గంగారం జాతీయ బీసీ కమిషన్ చైర్మెన్‌గా రెండోసారి విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో సోషల్ జస్టిస్ మంత్రిత్వ శాఖకు అందించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి 40 కులాలు ఓబీసీ కోసం దరఖాస్తు చేసుకోగా, పాత కులాలైన బుక్క అయ్యవారు, గోత్రాల, బొందిలి, ఆరె మరాఠి, ఆరే, వీర శైవ లింగాయత్‌తో పాటు మరో 5, కొత్తగా బీసీ-ఏ జాబితాలో చేర్చిన 13 కులాలు, బీసీ-డీలో చేర్చిన 4 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. మిగతా 12 కులాలను కోర్టులో కేసులో ఉన్నందున తీర్పు అనంతరం చేర్చే అవకాశాలున్నాయి.

ఎన్నికల్లోపు పూర్తయ్యేనా?

దశాబ్ద కాలంగా ఓబీసీ జాబితాలో చేర్చేందుకు ఎదురుచూస్తున్న కులాలకు జాతీయ బీసీ కమిషన్ పూర్తి విచారణ చేపట్టి కేంద్ర సోషల్ జస్టిస్ మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. కేంద్ర క్యాబినెట్ ఆమోదంతో గెజిట్ ప్రకటన కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అందువల్ల కేంద్రం స్పందించి 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆకాంక్షిస్తున్నారు.



కేంద్ర ప్రభుత్వం బీసీఏ జాబితాలోని సంచార కులాలను ఓబీసీ జాబితాలో చేర్చి కేంద్రం ప్రవేశపెట్టిన సీడ్ పథకం ద్వారా ఈ కులాలకు లబ్ది చేకూర్చే విధంగా కృషి చేయాలి.

సీడ్ పథకం ద్వారా లబ్ది చేకూర్చాలి

దశాబ్ద కాలాలుగా వెనుకబాటుకు గురైన ఈ సామాజిక తరగతులకు క్రిమీలేయర్ విధానంలో కనీస ఆదాయ పరిమితిని పెంచాలి. కేంద్ర ప్రభుత్వ విద్య ఉద్యోగాల్లో సైతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి.

జాదవ్ శరత్- ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రంలో ఓబీసీ సర్టిఫికేట్ లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం నవోదయ, సైనిక కేంద్రీయ విద్యాలయాల్లో నిర్వహిస్తున్న ఐఐటీ, ఐఐఎం వంటి విద్యాసంస్థల్లో మా

విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నాం

పిల్లలు అడ్మిషన్‌లు, ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. అదేవిధంగా యూపీఎస్సీ లేదా ఎస్ఎస్‌సి వంటి వాటిలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసు కునే అవకాశాలు కోల్పోతున్నాం. అందువల్ల తెలంగాణ లో అర్హత కలిగిన కులాలను ఓబీసీలుగా గుర్తించాలని కోరుతున్నాం.

గుజ్జెటి వెంకటేష్- శ్రీ వైష్ణవ/శ్రీక్షత్రియ రామజోగి అధ్యక్షులు, సిద్దిపేట జిల్లా



రాష్ట్ర ప్రభుత్వం 2009లో బీసీ జాబితాలో చేర్చిన గోత్రాల సామాజిక తరగతికి 2015లో ఓబీసీ జాతీయ అధ్యక్షులు ఈశ్వరయ్య అధ్యక్షతన హైదరాబాదులో విచారణ

రెండు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం

చేపట్టారు. ఇప్పటివరకు మూడుసార్లు విచారణ పేరుతో కాలయాపన చేస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి క్యాబినెట్ ఆమోదంతో ఓబీసీ గుర్తింపు ఇవ్వాలి.

తిప్పిరిశెట్టి శ్రీనివాస్- గోత్రాల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు

గాలిమాటలు వద్దు.. నిజమేంటో నిరూపించాలి

దమ్ముంటే మేడిగడ్డ బ్యారేజీ సబ్‌కాంట్రాక్టు ఎవరికిచ్చారో తేల్చాలి

బండి సంజయ్ నోటికి ఏదొస్తే అది మాట్లాడొద్దు :కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో ఎల్అండ్‌టీ సంస్థను తాను బెదిరించడంతో తన బంధువులకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చిందని గాలి మాటలు మాట్లాడొద్దని, నిజమేంటో నిరూపించాలని ఎంపీ బండి సంజయ్‌కి కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ప్రజలు పట్టించుకోరన్నారు. ఎల్అండ్‌టి సంస్థ మేడిగడ్డ సబ్ కాంట్రాక్టు ఎవరికి ఇచ్చిందో తెలిస్తే.. పేరు బయట పెట్టాలని, అసలు మాజీ ఎంపీ ఎవరో?, అతడి బంధువులు ఎవరో? సూటిగా చెప్పాలన్నారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎంపీగా ఉన్నానని, అంతకు ముందు పొన్నం ప్రభాకర్, కేసీఆర్, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఎల్.రమణ ఎంపీలుగా ఉన్నారని.. ఇందులో ఎవరి బంధువులకు మేడిగడ్డ బ్యారేజ్ సబ్ కాంట్రాక్టు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఎంపీగా గెలిచి ఐదేండ్లు అవుతున్నా ప్రజలు గుర్తుకురాని బండి సంజయ్‌కి.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో గుర్తొచ్చారా అని ఎద్దేవా చేశారు. ఐదేండ్లలో ఐదు కొత్తలు తేలేదని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం, హరితహారం, నేషనల్ హెల్త్ మిషన్ వంటి పథకాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టుగానే తెలంగాణకు ఇచ్చిందని, ఇవన్నీ తన నిధులేనని బండి సంజయ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడూ మతం ముసుగులో రాజకీయం చేస్తూ కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలకు నయాపైసా తెచ్చిన మొఖం లేదని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన విషయంలో జ్యుడీషియల్ విచారణ జరిపితే అభ్యంతరం లేదని గతంలోనే తమ పార్టీ స్పష్టం చేసిందని వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుల హామీద్ గంగాధర్ ఎంపీపీ శ్రీరాం, జక్కుల నాగరాజు, గవ్వ వంశీదర్‌రెడ్డి దూలం సంపత్, గందెకల్పన, వోల్లాల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

విద్యార్థిని కుటుంబానికి

ఐద్వా, ఎస్ఎఫ్ఐ పరామర్శ

- 'గురుకుల' ఘటనలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ-సూర్యాపేట

ఇమాంపేట గురుకులంలో మృతిచెందిన విద్యార్థిని వైష్ణవి కుటుంబాన్ని ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం పరామర్శించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థినుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో గురుకుల కళాశాల విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మల్లు లక్ష్మీ మాట్లాడుతూ .. గురుకుల కళాశాలలో వైష్ణవి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. శరీరంపై గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. వైష్ణవి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, స్పష్టమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ బృందంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి వల్లపుదాస్ సాయికుమార్, నాయకులు మద్దెల జ్యోతి, కోట సృజన, మామిడి సుందరయ్య, అక్కినపల్లి వినయ్, నాగరాజు, రాణమ్మ శశిరేఖ, భిక్షమమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

ప్రాజెక్టులపై కేసీఆర్ మోసం

డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

- నల్లగొండలో కాంగ్రెస్ వినూత్న నిరసన
- ఖాళీ కుర్చీపై పింక్ టవల్, కేసీఆర్ ఫొటో



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు. నల్లగొండలో కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఖాళీ కుర్చీలో పింక్ టవల్ వేసి కేసీఆర్ ఫొటో పెట్టి.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఎండగడుతూ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ .. కేసీఆర్‌వన్నీ దొంగ హామీలని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్‌ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు- రంగారెడ్డి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయ కుండా నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కేసీఆర్‌కు నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభి వృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయ లేదని ప్రశ్నించారు. మంత్రి కోమట రెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, ఎంపీపీ మనిమిద్దె సుమన్, కాంగ్రెస్ పార్టీ తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపీపీ నాగులవంచ విజయ లక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నాంపల్లి భాగ్య, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్, రేఖల భద్రాద్రి, బషీర్, కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోదరుడు వెంకటేశ్వర్లు మృతి



నవతెలంగాణ-వైరా

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో హైదరాబాద్ ఏఐజి ఆస్పత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ఎస్సి సామాజిక తరగతికి చెందిన మల్లు అఖిలాండ దాస్, మాణిక్యమ్మ దంపతుల మూడో సంతానం అయిన వెంకటేశ్వర్లు హోమియోలో ఎమ్‌డి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో ఆచార్యులుగా, ఆ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆయన ఒకటో వార్డులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రయివేటుగా వైద్య వృత్తిని కొనసాగించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొద్ది రోజుల కిందట హైదరాబాద్ గచ్చిబౌలి ఏఐజి ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. మల్లు వెంకటేశ్వర్లు మరణంతో వారి కుటుంబంలోనూ, లక్ష్మీపురంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.



ప్రాజెక్టులపై కేసీఆర్ మోసం

డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్

- నల్లగొండలో కాంగ్రెస్ వినూత్న నిరసన
- ఖాళీ కుర్చీపై పింక్ టవల్, కేసీఆర్ ఫొటో

నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు. నల్లగొండలో కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఖాళీ కుర్చీలో పింక్ టవల్ వేసి కేసీఆర్ ఫొటో పెట్టి.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఎండగడుతూ ఎల్‌ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కేసీఆర్‌వన్నీ దొంగ హామీలని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్‌ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు- రంగారెడ్డి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కేసీఆర్‌కు నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభివృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కేసీఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేష్ గౌడ్, జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, ఎంపీపీ మనిమిద్దె సుమన్, కాంగ్రెస్ పార్టీ తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నాంపల్లి భాగ్య, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్, రేఖల భద్రాద్రి, బషీర్, కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కదిలితే కూలిపోయేలా పేకమేడలు కట్టారా?



కాళేశ్వరం అద్భుతం కదా..కేసీఆర్ ముందుండి వివరించాలి

- కారు, బస్సుల్లో రాలేకపోతే హెలిక్యాప్టర్ రెడీగా ఉంది
- తెలంగాణ సమాజానికి వాస్తవాలు తెలియాలి
- తప్పుకు కారులెవ్వరు? శిక్ష ఏమిటి? తేలాల్సిందే
- త్వరలో సభలో కాళేశ్వరంపై శ్వేతపత్రం: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇసుక కదిలితే కూలిపోయేలా పేకమేడలుగా కాళేశ్వరం బ్యారేజీలు కట్టారా?' అని గత ప్రభుత్వాన్ని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం అద్భుతం కదా..అందువల్ల బీఆర్ఎస్ ఎల్పీ నేత కేసీఆర్ ముందుండి దాని గురించి వివరించాలని కోరారు. కారు, బస్సుల్లో ఆయన రాలేకపోతే హెలిక్యాప్టర్‌ను కూడా బేగంపేటలో సిద్ధంగా ఉంచామని చెప్పారు. తెలంగాణ సమాజానికి కాళేశ్వరంపై వాస్తవాలు తెలియాలనీ, బుధవారమో, గురువారమో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేస్తారని ప్రకటించారు. కాళేశ్వరం కథేంటి? జరిగిన వాస్తవాలు తెలంగాణ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందా? లేదా? తప్పు జరిగిందా లేదా? జరిగితే కారణం ఎవరు? శిక్ష ఏమిటి? అనే దానిపై సభలో చర్చించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. మేడిగడ్డ పర్యటనకు ముందు మంగళవారం శాసనసభలో సీఎం మాట్లాడారు. నీళ్ల కోసం నిప్పులు చెరిగేలా తెలంగాణ సమాజం పోరాటం చేసిందన్నారు. డాక్టర్ వైస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో దేవెందర్‌గౌడ్ పాదయాత్ర చేశారనీ, ప్రాణహిత చేవెళ్ల ద్వారా తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని ఆయన డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ప్రజల ఆలోచనను దృష్టిలో పెట్టుకుని ఆ ప్రాజెక్టును మొదలుపెట్టారనీ, మొదట 12 వేల ఎకరాలు అనుకుని ఆ తర్వాత 14 లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరు అందించేందుకు 38,500 కోట్ల రూపాయలతో 2008లో టెండర్లు పిలిచారని తెలిపారు. సీనియర్ నేత వెంకటస్వామి సూచనతో ఆ ప్రాజెక్టుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టారని గుర్తుచేశారు. చేవెళ్లలో వేల కోట్ల రూపాయల పనులు కూడా పూర్తయ్యాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వాళ్లు రీడిజైన్ అనే ఒక బ్రహ్మపదార్థాన్ని కనిపెట్టారనీ, తుమ్మిడిహెట్టి దగ్గర మొదలుపెట్టాల్సిన పనులను వివిధ మార్పులకు, చేర్పులకు గురుచేశారని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టి లిఫ్టులు కట్టి నీళ్లు ఎత్తిపోస్తామనీ, మిడ్‌మానేరు నుంచి మిగతా ప్రాంతాలకు నీళ్లు తరలిస్తామని చెప్పిన విషయాన్ని సీఎం ఈసందర్భంగా గుర్తుచేశారు. ప్రాజెక్టు వ్యయాన్ని 1,47,000 వేల కోట్ల రూపాయలకు పెంచారని విమర్శించారు. దానికి డీపీఎల్ (ప్రాజెక్టు పూర్తి రిపోర్టు) ఉందా అంటే అదీ లేదన్నారు. భవిష్యత్తులో 2.5 లక్షల కోట్లతో పూర్తి అవుతుందా? ఇంకా ఎక్కువ ఖర్చుపెట్టాలా? అనే దానిపై ఆలోచన చేసే పరిస్థితి లేదన్నారు. ఇంజినీర్ల సూచనల మేరకు ప్రాజెక్టు కట్టారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ కింద ఇసుక కదిలిందనీ, అందుకే ప్రాజెక్టు కుంగిందని చెప్పిందన్నారు.

ఇసుక కదిలితే కూలిపోయేలా పేకమేడలు కట్టారా? అని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన ప్రాజెక్టు కుంగిపోతే అక్కడకు ఎవ్వరూ వెళ్లకుండా వాఘా సరిహద్దుల్లో లాగా పోలీసు భద్రత పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. కుంగిన బ్యారేజీని ఎవ్వరూ చూడకుండా దాచిపెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పలు ఫిర్యాదులతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులను పంపగా వారు అధ్యయనం చేసి ఒక రిపోర్టు ఇచ్చారనీ, దాన్నీ గత ప్రభుత్వం తొక్కిపెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మంది అధికారులు ఫైళ్లను మాయం చేశారని మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను పంపి విచారణ చేయించిందని వివరించారు.

ఏ ఫైళ్లు మాయమయ్యాయి? ఎవరెవరు మాయం చేశారు? తదితర అంశాలపై అధికారులు విచారణ జరిపించి ప్రాథమిక నివేదిక ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకూ కాళేశ్వరంలో ఏం జరిగిందో? అక్కడ ఏమైందో సభలోని చాలా మంది సభ్యులకు తెలియదన్నారు. అందుకే మేడిగడ్డ రిజర్వాయర్ సందర్శనకు రావాలని సభలోని అన్ని పక్షాల నేతలకు లేఖలు రాశామన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమంటూ న్యూయార్క్ స్క్వేర్, డిస్కవరిలో ప్రచారం చేయించారు కదా..ఆ అద్భుతం గురించి తెలంగాణ శాసనసభ, శాసనమండలి సభ్యులకు ప్రజలకు వివరించేందుకు మాజీ సీఎం కేసీఆర్ ముందుకు రావాలని విన్నవించారు.

తెలంగాణ సమాజానికి తాజ్‌మహల్ అంత అద్భుతాన్ని ఆవిష్కరించారు కాబట్టి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి వచ్చి మేడిగడ్డలో ఉన్న పరిస్థితులను నిష్పక్షపాతంగా వివరించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ కారులోగానీ, బస్సులోగానీ రాలేని పక్షంలో ప్రత్యేకంగా హెలిక్యాప్టర్ కూడా సిద్ధంగా ఉంచామని చెప్పారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంగా మారిందనీ, కనకమేడలు గుప్పించింది అని తాము అనదలుచుకోలేదనీ, ప్రాజెక్టు గురించి కేసీఆర్ తన అనుభవాలను మేడిగడ్డలో అందరికీ వివరించాలని కోరారు. సీఎం ప్రసంగం అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు. అనంతరం సీఎం నేతృత్వంలో మంత్రులు, కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులు అక్కడకు వెళ్లారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చకు డిప్యూటీ సీఎం ప్రతిపాదన

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చకు స్పీకర్ అనుమతి ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క సభ ముందు ప్రతిపాదించారు. అనంతరం శాసనసభ వ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..మేడిగడ్డ పర్యటనకు స్పీకర్ అనుమతివ్వాలని స్పీకర్‌ను కోరారు. ఇందుకోసం ప్రభుత్వం తరపున ముందస్తు అనుమతి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ పర్యటనకు అధికార పక్షంతో పాటు ప్రధాన ప్రతిపక్షం, ఇతర పక్షాల సభ్యులందరూ రావాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో ప్రజాధనం వృథా అయ్యిందని విజిలెన్స్ రిపోర్టు వచ్చిందన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు కూడా ప్రాజెక్టు డిజైన్‌లో, నిర్మాణంలో, నిర్వహణలో లోపాలున్నాయని ఎత్తిచూపిన విషయాన్ని ప్రస్తావించారు.

వెంట పడ్తాం.. వేటాడ్తాం..

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. కృష్ణాజలాల ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించడంపై అసెంబ్లీ తీర్మానం చేసిందని, దాంతో సరిపోదని, ఇక అసెంబ్లీ బంజేసి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కృష్ణా ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు రావాల్సిన జలాల వాటా వచ్చే వరకు ప్రధానిపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు.మ కృష్ణాజలాల వాటా దక్కే విధంగా పోరాడాలన్నారు. కృష్ణాజలాల వాటా కోసం 24ఏండ్లుగా పోరాడుతున్నానని, తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పటికీ కృష్ణా ట్రిబ్యునల్‌కు లేఖలు రాస్తునే ఉన్నామని చెప్పారు. తన హయాంలో కేంద్రం నుంచి అనేక బెదిరింపులు, ఒత్తిళ్లు వచ్చినా తట్టుకున్నాం.. కానీ కృష్ణాజలాలు అప్పగించలేదన్నారు. చివరకు మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేసినా ఒప్పుకోలేదన్నారు. సంపూర్ణమైన నీటి వాటా వచ్చే వరకు కొట్లాడుతూనే ఉంటానన్నారు.

కాళేశ్వరం ఒక ఆట బొమ్మ కాదన్నారు. మేడిగడ్డలో ఏముందని, కాళేశ్వరం పెద్ద ప్రాజెక్టు అని అందులో 250 పిల్లర్లు ఉన్నాయని, 1200 కిలోమీటర్లు కాల్వ ఉందని, 19సబ్‌స్టేషన్లు ఉన్నాయని, 20 రిజర్వాయర్లు ఉన్నాయని చెప్పారు. అన్ని ఉన్నప్పుడు అందులో రెండు మూడు కుంగడం సహజమని, దానిని సరిచేసి నీళ్లు ఇవ్వడం వదిలేసి ఏదో తప్పు జరిగిపోయిందని గగ్గోలు పెడుతున్నారని అన్నారు.

గతంలో నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, మూసీ ప్రాజెక్టులు కుంగిపోలేదా అని ప్రశ్నించారు. మేము కూడా అసెంబ్లీ అయ్యాక మేడిగడ్డను సందర్శిస్తామన్నారు. అహంకారంతో, దుర్మార్గంతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. "మీరు అంత మగాళ్లా.. నన్ను చంపి మీరు ఉంటరా.. మీకు అంత దమ్ముందా..రా" అంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. చేతగాక.. పాలన చేయలేక పొద్దున్నస్తే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రంలో దద్దమ్మల రాజ్యం కొనసాగుతోందని విమర్శించారు. "మేడిగడ్డ బొందల గడ్డకాదు.. కాళేశ్వరంలో నీళ్లు ఉన్నాయి.. మీకు దమ్ముంటే నీళ్లు ఎత్తిపోయండి" అని కేసీఆర్ సవాల్ విసిరారు. నీళ్ల విషయంలో వారికి అవగాహన లేదన్నారు. తెలివిలేకపోతే ఎవరినైనా అడిగి తెలుసుకోవాలని, ప్రతిపక్షంలో తనతోపాటు ఎంతో మంది సీనియర్ నాయకులు ఉన్నారని, కనీసం వారినైనా అడిగి తెలుసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పాలమూరు ఎత్తిపోతల పథకం, సీతారామం ప్రాజెక్టు, గురుకుల పాఠశాలల పెరుగుదల, కరెంట్, మంచినీళ్ల విషయంపై దృష్టిపెట్టి పూర్తి చేయాలన్నారు.

తాము అధికారంలో ఉన్నప్పుడు 24గంటలు కరెంట్, ఇంటింటికీ మంచినీరు అందించామన్నారు. రైతులకు కరెంట్, నీళ్లు పెట్టుబడి సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేశామని వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి కరెంట్ బంద్ అయ్యిందని, రైతుబంధు ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో జనరేటర్ పెట్టి నడిపించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఈ మధ్యనే మరో విషయం తెలిసిందని.. ధాన్యానికి మద్దతు ధర వస్తే బోనస్ రూ.500 ఇవ్వబోమని కాంగ్రెస్ చెబుతుందని ఇదేక్కడి దారుణమని అన్నారు. నాడు..నేడు ఎప్పుడూ తెలంగాణ హక్కుల సాధన కోసం కేసీఆర్ పోరాటాలు చేస్తూనే ఉంటాడని, కట్టె కాలేవరకు తెలంగాణ కోసం పోరాడుతానని చెప్పారు. కృష్ణా జలాల హక్కుల సాధన కోసం నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలు పోరాడాలని, ఇది ఈ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్యని చెప్పారు. నల్లగొండ సభ కేవలం శ్రీకారమేనని, భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు ఉంటాయని, ఒక్క పిలుపుతోనే తెలంగాణ ప్రజలు తరలివచ్చి సైనికులుగా ఉద్యమించాలని సూచించారు. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీలు కేశవరావు, నామ నాగేశ్వర్‌రావు, బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, సబితాఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కేసీఆర్ గో బ్యాగ్

- కేటీఆర్ బస్సుపై కోడి గుడ్లతో దాడి
- రంగంలోకి పోలీసులు

నవతెలంగాణ-నల్గొండటౌన్

నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన మాజీ సీఎం కేసీఆర్ సభతో మంగళవారం కొంత ఉద్రిక్తత ఏర్పడింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యేలకు పట్టణంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసానికి వచ్చారు. వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. అది పూర్తి చేసుకుని సభా స్థలికి బస్సులో వెళ్తున్న సమయంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు హైదరాబాద్ రోడ్డులోని హెూటల్ మనోరమ ముందు అడ్డంగా వెళ్లారు. కేసీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నల్లటి దుస్తులు ధరించి కోడిగుడ్లతో దాడి చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు.

నల్ల చట్టాలతో మోడీ దగా

(మొదటి పేజీ తరువాయి)

కోదండరెడ్డి మాట్లాడుతూ... రైతు తన భూమిని కార్పొరేట్ కంపెనీలకు కౌలుకు ఇచ్చిన తర్వాత అతని పరిస్థితేంటని ప్రశ్నించారు. గోదాముల్లో నిల్వలు ఉండొద్దనే చట్టాన్ని కూడా మోడీ ఎత్తేశారని విమర్శించారు. అదానీ, అంబానీకి లాభం చేసే పనిలో ప్రధాని ఉన్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి మాట్లాడుతూ...బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలు, రైతులను, కార్మికులను హత్య చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను రక్షించుకునేం దుకు అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరాపార్కు వద్ద నిర్వహించబోమే మహాధర్నాకు మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వస్తారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ఐఎన్‌టీయూసీ నేత నాగయ్య మాట్లాడుతూ గ్రామీణ బంద్‌ను విజయవంతం చేసేందుకు ఇప్పటికే అనేక కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.

మేడిగడ్డ అవినీతిపై ఊరూరా ప్రచారం
టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

మేడిగడ్డ ప్రాజెక్టు అవినీతిపై ఊరూరా ప్రచారం నిర్వహిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ చెప్పారు. ప్రాజెక్టు కుంగుబాటుకు గురైతే, దాన్ని పరిశీలించేందుకు ఆనాటి బీఆర్ఎస్ సర్కారు అనుమతి ఇవ్వలేదన్నారు. కనీసం ఎమ్మెల్యేలకు కూడా అవకాశం కల్పించలేదని విమర్శించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో నెలకొన్న అవినీతి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకపోతే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అయ్యేదని వ్యాఖ్యానించారు. .

రైతులపై బాష్ప వాయువు ప్రయోగం దుర్మార్గం

ఏఐఎడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమైన రైతాంగ హక్కుల కోసం పోరాడుతున్న రైతులపై మిలటరీ, బాష్ప వాయువులను ఉపయోగించడం దుర్మార్గపు చర్య అని ఏఐఎడబ్ల్యుయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ శంబూ సరిహద్దులో రైతులు న్యాయపరమైన డిమాండ్ కోసం పోరాడుతున్నారన్నారు. వారిపై మిలటరీని పెట్టి టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని యావత్తు దేశం ఖండించాలని, ఈ దుర్మార్గపు చర్యలు వీడి మోడీ ప్రభుత్వం తక్షణమే రైతులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రైతులకు బీజేపీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. 'ఢిల్లీ చలో' కార్యక్రమానికి 15 రోజుల ముందే రైతులు మోడీకి లేఖ రాశారని ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి వారికి ఎలాంటి భరోసా రాలేదని అన్నారు. దేశం కోసం కష్టనష్టాలను భరించి పంటలు పండించిన రైతులను దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాల కోసం భారత రత్నాలు ప్రకటిస్తున్న మోడీ హరిత విప్లవ సృష్టికర్త ఎంఎస్ స్వామినాథన్ కు భారతరత్న ప్రకటించారు. కానీ వ్యవసాయంలో ఆయన చేసిన ప్రతిపాదనలు మాత్రం ప్రభుత్వం తీసుకోదా? అని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కును హరిస్తున్న మోడీకి 16న జరిగే బంద్ తో గ్రామీణ పేదలు, రైతులు, ఉపాధి హామీ కార్మికుల, పేదలు, కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు టైంస్కేల్?

(మొదటి పేజీ తరువాయి)

230లో పదో తరగతి వరకు విద్యార్థినిలు చదువుతున్నారు. 2014లో కేవలం 391 కేజీబీవీలుండేవి. 2017-18లో కొత్తగా 84 కేజీబీవీలను ప్రభుత్వం మంజూరుచేసింది. దీంతో రాష్ట్రంలో వాటి సంఖ్య 475కి చేరింది. ఇటీవల మరో 20 కేజీబీవీలను ప్రభుత్వం మంజూరు చేయడంతో వాటి సంఖ్య 495కు చేరింది. వాటిలో సుమారు 1.50 లక్షల మంది విద్యార్థినిలు విద్యనభ్యసిస్తున్నారు. కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లు (ఎస్‌వో), పీజీసీఆర్టీ, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎం, అకౌంటెంట్లు పనిచేస్తున్నారు. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్లకు రూ.32,500, పీజీసీఆర్టీలకు రూ.29,900, సీఆర్టీలకు రూ.26,000, పీఈటీలకు రూ.15,600, అకౌంటెంట్లకు రూ.14,300, ఏఎన్ఎంలకు రూ.14,300 వేతనం ఇస్తున్నారు. వారికి మినిమం టైంస్కేల్‌ను వర్తింపచేస్తే వేతనాలు పెరుగుతాయి. సమాన పనికి సమాన వేతనమివ్వాలనీ, ఎస్‌వోను ప్రిన్సిపాల్‌గా, పీజీసీఆర్టీలను జేఎల్స్‌గా, సీఆర్టీలను స్కూల్ అసిస్టెంట్లుగా, పీఈటీలను పీడీలుగా గుర్తించి ఆ పోస్టుకు ఇస్తున్న బేసిక్‌పేను మినిమం టైంస్కేల్‌గా చెల్లించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. దీన్ని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

సుద్దపూస మాటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ అవినితిపై బీజేపీ వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆ రెండు పార్టీలు చీకటి మిత్రులని విమర్శించారు. కాళేశ్వరంపై సభలో చర్చకు రాకుండా నల్లగొండలో మీటింగ్ పెట్టడాన్ని ఖండించారు. సమస్యలపై చర్చించకుండా పార్లమెంట్ ఎన్నికల కోసం ఓట్లడుక్కోవడానికి ఆయన వెళ్లారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై బీఆర్ఎస్ పార్టీ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. కుర్చీ వెతుక్కుంటూ నల్లగొండకు వెళ్లటం సిగ్గు చేటని అన్నారు. మేడిగడ్డ ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదముందంటూ విజిలెన్స్, రిపోర్టు చెబుతుందనీ, అన్ని పాపాలకు కేసీఆర్ కారణమని విమర్శించారు. మంగళవారం శాసనసభ సమావేశాల వాయిదా అనంతరం సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ బ్యారేజిని సందర్శించారు. సీపీఐ, ఎంఐఎం, ఎమ్మెల్యేలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.నర్సిరెడ్డి ఇతరులు సైతం అక్కడికి సీఎంతో పాటు వెళ్లారు. ప్రభుత్వం ఆహ్వానించినప్పటికి బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మేడిగడ్డను ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కలియ తిరిగారు. బ్యారేజీకి సంబంధించి కుంగుబాటుకు గురయిన అన్ని పిల్లర్లు, స్పిల్‌వేలను పరిశీలించారు. అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బ్యారేజీపైనే కాకుండా కిందకూడా పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. తీవ్రంగా దెబ్బతిన్న 19,20,21,22, పిల్లర్లను ఆసాంతం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియాతో కలిపి అదే అంశంపై రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. ఇందులో సాగునీటి శాఖ ఇంజినీర్లు, మేడిగడ్డకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారులు చెబుతున్న సందర్భంగా సీఎం మధ్యలో జోక్యం చేసుకుని అనేక విషయాలపై, వివరణ కోసం ప్రశ్నించారు. అలాగే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ సైతం తన విచారణ నివేదికను పవర్ పాయింట్ రూపంలో చెప్పారు. సీఎం, మంత్రులు, అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డ్యాం సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ, సమస్యను సరిదిద్దకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్వహణకు ఏటా విద్యుత్ బిల్లులు రూ.10,500 కోట్లు ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏటా దాదాపు రూ. 25 వేల కోట్లు చెల్లించే పరిస్థితి ఏర్పడిందని ఆందోళనల వ్యక్తం చేశారు. సాంకేతిక నిపుణులతో చర్చించిన తర్వాత మేడిగడ్డ పునర్నిర్మాణంపై మా నిర్ణయం చెబుతామన్నారు. అక్రమాలకు బాధ్యులపై విచారణ కొనసాగుతోందనీ, అవసరమైతే రెవెన్యూ యాక్ట్‌తో సొమ్ము రికవరీ చేస్తామని అన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎంచేయాలో సలహాలు సూచలను ఇవ్వాలని కోరారు. తెలంగాణ కోసం చావు నోట్లో తల పెట్టిన ఆయన మేడిగడ్డపై సుద్దపూస లెక్కలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ. లక్ష కోట్లు ఖర్చు పెటారనీ, కొత్త ఆయకట్టు సృష్టించింది మాత్రం 90 వేల ఎకరాలేనని వివరించారు. కానీ కేసీఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరిచ్చామంటూ పచ్చి అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాలు విరిగిన కేసీఆర్ కూత వేటు దూరంలో ఉన్న అసెంబ్లీకి రాకుండా నల్లగొండకు ఎలా వెళ్లారని ప్రశ్నించారు. ప్రజలకు అవగాహన లేదని ఆనుకుంటున్నారనీ, కానీ వాళ్లుగమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అవినీతికి దోపిడికి మేడిగడ్డ బలైందని విమర్శించారు. అసెంబ్లీలో పెట్టిన తీర్మాణం సరిగ్గా లేదని మామ అళ్లుండ్లు బయట చెప్పడం కాదనీ, సభకు వచ్చి తీర్మానాన్ని సవరించాలని సూచించారు.

ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని అడుగుతున్నారనీ, ముందు ప్రజలు ఎన్నుకున్న సభకు వచ్చి మాట్లాడాలని సూచించారు. ఎన్నికల ముందే నీ సంగతి ప్రజలకు తెలిసుంటే ప్రతిపక్ష హెూదాకూడా వచ్చుండేది కాదని వ్యాఖ్యానించారు. సీపీఐ శాసన సభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు మాట్లడుతూ మేడిగడ్డ బ్యారేజి పగుళ్లను.. తెలంగాణ ప్రజల గుండెల పగుళ్లని వ్యాఖ్యానించారు. దేశంలోనే కాళేశ్వరం పెద్ద కుంభకోణమని విమర్శించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి తలెత్తడానికి కాళేశ్వరం అవినీతేనని గుర్తు చేశారు. అవినీతిలో భాగస్వాములైనవారందరిని జైలులో పెట్టడంతో పాటు దుర్వినియోగమైన నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం అవినీతిని వెలికి తీయడానికి ఎంత దూరమైనా పోతామని హెచ్చరించారు. అంచాలనాలను తక్కువగా రూపొందించి తర్వాత భారీగా పెంచుకున్నారని అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

కేంద్రం కాషాయీకరణను పెంచిపోషిస్తోంది

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యునివర్సిటీల కన్వెన్షన్ కోసం ఆహ్వాన సంఘం ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యను అందించకుండా కేంద్ర ప్రభుత్వం కషాయీకరణను పెంచి పోషిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి అన్నారు. ఈ నూతన జాతీయ విద్యావిధానం ఓ విపత్తు లాంటిదని, దీని నివారణ కోసం ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపిందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీల్లో తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర యునివర్సిటీల కన్వెన్షన్ జయప్రదం కోసం నిజామాబాద్‌లో మంగళవారం ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లిలోని టీయూలో నిర్వహించిన సమావేశంలో ఆర్.ఎల్ మూర్తి మాట్లాడారు. రీసెర్చ్ స్కాలర్స్ ఫెలోషిప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ కోత విధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి 7.7 శాతం అరకొర నిధులు కేటాయించడం సరైంది కాదన్నారు. కొఠారి కమిషన్ పేర్కొన్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పున:సమిక్షించాలని కోరారు. అదే విధంగా మేధోశక్తికి ఉత్పత్తి కేంద్రాలుగా విలసిల్లుతున్న రాష్ట్ర యూనివర్సిటీలకు రూ.500 కోట్లే కేటాయించడం



దారుణమని, అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్నా ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ ఆహ్వానం సంఘంలో సభ్యులుగా ప్రొఫెసర్లు, మేధావులు, విద్యావేత్తలు, వైద్యులు ఉన్నారని చెప్పారు. రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ కరపత్రాన్ని ముఖ్య వక్తలైన ప్రొఫెసర్ పున్నయ్య, నరాల సుధాకర, రామ్ మోహన్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, ఉపాధ్యక్షులు నాగరాజు, మహేష్, దీపిక, యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు దినేశ్, అభి, గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

దారిద్ర్యంలో ఆదివాసీలు

'జల్, జంగిల్, జమీన్ హమారా' ఇది ఆదివాసీల ఆత్మగౌరవ నినాదం. కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా వారి బతుకుల్లో వెలుగు కనపడటం లేదు. విద్యా, వైద్య, ఉపాధి ఊసే లేదు. రెండు రోజుల కిందట ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో జరిగిన నాగోబా దర్బార్‌కు వెల్లువలా వచ్చి పడిన వినతులే దీనికి సజీవ సాక్ష్యాలు. ఏండ్లుగా ఇలాంటి దర్బారులు ఎన్ని జరిగినా తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది తెగలకు చెందిన నాయకులు మంత్రి సీతక్క ముందు తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు.

> ఇప్పటి వరకు గిరిజనుల అభివృద్ధి కోసమంటూ ఎన్నో దర్బార్లు జరుగుతూనే ఉన్నాయి. మనమూ చూస్తూనే ఉన్నాం. కానీ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. వినతులు అందుకున్నంత మాత్రానా సమస్యలకు పరిష్కారం దొరకుతుందనుకుంటే అది కేవలం మన భ్రమే. వారు సాగు చేసుకుంటున్న భూమి వారికే దక్కాలి. 'జల్, జంగిల్, జమీన్ హహారా' అనే వారి ఆత్మగౌరవ నినాదాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అడవిపై కన్నేసిన మోడీ ప్రభుత్వ పెత్తనాన్ని అణగదొక్కాలి. అడవి నుండి అన్యాయంగా తరిమేయబడుతున్న ఆదివాసీ బిడ్డలను అక్కున చేర్చుకోవాలి.

ఒక్క ఆదిలాబాద్‌లోనే కాదు రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా ఆదివాసీల దుస్థితి ఇది. అడవి బిడ్డల ప్రధాన సమస్య భూమి. వారు సాగు చేసే భూమికి హక్కు పత్రాలు కావాలి. 2006లో యూపీఏ 1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల డిమాండ్లలో భాగంగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా ఖర్చు పెట్టకుండా అమలు చేయగలిగిన చట్టం ఇది. భూమి కోసం ఎక్కడో వెతకాల్సిన పని లేదు. ఎవరి దగ్గరో కొనాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఇప్పటికే వారు సాగు చేసుకుంటున్న భూమిపై వారికి హక్కు కల్పించడం మాత్రమే ప్రభుత్వం చేయాల్సింది. అయినా ఇది ఎక్కడా అమలు చేయడం లేదు. అడవులను కార్పొరేట్లకు దోచి పెట్టడం కోసం జరుగుతున్న కుట్రలో భాగమే ఇది. మోడీ అయితే ఆయా రాష్ట్రాల్లో తన అనుంగు మిత్రులకు అటవి భూమిని అప్పనంగా పంచిపెడుతున్నాడు. దీనికి ఎలాంటి అడ్డంకులూ రాకుండా చట్టంలో అవసరమైన మార్పుచేర్పులు చేసుకుర్చున్నాడు. దీని వల్ల దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఆదివాసీలు అమ్మలాంటి అడవికి దూరమైపోతున్నారు.

ఇక ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ జి.ఓ నెంబర్ 3 తీసుకొచ్చారు. కానీ బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అది కోర్టుమెట్లెక్కి కూర్చుంది. అయితే పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ తీసుకొచ్చి చిటికెలో దీన్ని అమలు చేసే సత్తా కేంద్ర ప్రభుత్వానికి ఉంది. తన వద్ద అంతటి భారీ మెజారిటీ ఉన్నా మోడీ ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయడం లేదు. అంటే ఆదివాసీలంటే ఎంతటి చిన్న చూపుందో,



కార్పొరేట్లపై ఎంతటి మోజుందో తెలిసిపోతుంది. ఏది ఏమైనా నోరు లేని ఆదివాసీల అమాయకత్వాన్ని అడ్డు పెట్టుకొని కేంద్రం వారి హక్కులన్నీ కాలరాస్తున్నది. పచ్చని అడవులన్నీ మింగేస్తుంది. కార్పొరేట్లకు పంచిపెడుతూ గిరిపుత్రుల కడుపు కొడుతోంది. ఇప్పుడు రాష్ట్రం తరపున రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దీని అమలుకై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ నమ్మకంతోనే ఆదివాసీలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారనేది గుర్తు పెట్టుకోవాలి.

ఇక రాష్ట్రాన్ని మొన్నటివరకు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారమంటూ ఆదివాసీలకు తీవ్ర నష్టం చేసింది. అలాగే వారి జీవనాధారమైన హక్కు పత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాష్ట్ర వ్యాప్తంగా పదమూడు లక్షల మందికి హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, నాలుగున్నర లక్షల మందికే ఇచ్చి చేతులు దులుపుకుంది. దానికి మూల్యం కూడా భారీగానే చెల్లించుకుంది. ఇప్పటి వరకు గిరిజనుల అభివృద్ధి కోసమంటూ ఎన్నో దర్బార్లు జరుగుతూనే ఉన్నాయి. మనమూ చూస్తూనే ఉన్నాం. కానీ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. వినతులు అందుకున్నంత మాత్రానా సమస్యలకు పరిష్కారం దొరకుతుందనుకుంటే అది కేవలం మన భ్రమే. వారు సాగు చేసుకుంటున్న భూమి వారికే దక్కాలి. 'జల్, జంగిల్, జమీన్ హహారా' అనే వారి ఆత్మగౌరవ నినాదాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అడవిపై కన్నేసిన మోడీ ప్రభుత్వ పెత్తనాన్ని అణగదొక్కాలి. అడవి నుండి అన్యాయంగా తరిమేయబడుతున్న ఆదివాసీ బిడ్డలను అక్కున చేర్చుకోవాలి. అడవి వారిదే అనే నమ్మకాన్ని కల్పించాలి. గిరిజనుల సమగ్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలి. ఈ బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే.

తెలంగాణ గడ్డ ఆదివాసీ పోరాటాల గడ్డ. ఆధిపత్యానికి వ్యతిరేకంగా రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య వాదులతో పోరాడి ప్రాణాలర్పించిన రాంజీగోండు పుట్టిన నేల ఇది. తెలంగాణ ఆదివాసీల ఆత్మగౌరవ పతాక, సాయుధ తెలంగాణ పోరాట యోధులు కొమరం భీం, సోయం గంగూలు వారసులు వీరంతా. ఈ పోరాట చరిత్రను పాల కులు గుర్తు పెట్టుకోవాలి. ఇన్నేండ్లు అభివృద్ధికి నోచుకోని ఆదివాసీలు ప్రస్తుత రేవంత్ ప్రభు త్వంపై గంపెడంత ఆశపెట్టుకున్నారు. దీన్ని నిలబెట్టుకోవల్సిన బాధ్యత కాంగ్రెస్‌దే. అలాగే తన ఎన్నికల ప్రచారాన్ని ఆదివాసీ ప్రాంతమైన ఇంద్రవెల్లి నుండి ప్రారంభించి ముఖ్యమంత్రైన విషయాన్ని ఆయన ఎన్నటికీ మర్చిపోరాదు. గిరిపుత్రుల పట్ల కేంద్ర అనుసరిస్తున్న వినాశనకర విధానాలకు వ్యతిరేకంగా తన గళాన్ని ఎక్కుపెట్టాలి. అలాగే తన ఎన్నికల మ్యానిఫెస్టోలో 'మేం అధికారంలోకి వస్తే అందరికీ హక్కు పత్రాలు అందిస్తాం' అని హామీ ఇచ్చారు. కాబట్టి పార్లమెంటు ఎన్నికల లోపు దీనికోసం ఓ రోడ్ మ్యాప్ తయారు చేసి లబ్దిదారులను గుర్తిసే అప్పుడు గిరిపుత్రుల విశ్వాసాన్ని పొందగలరు.

16న సమ్మె, గ్రామీణ భారత్ బంద్: మోడీకి ఓ హెచ్చరిక



పాలడుగు భాస్కర్
9490098033

కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు కార్మికులు, కర్షకులు,కోట్లాది ప్రజానీకం సన్నద్ధమౌతున్నారు. కార్మిక, రైతు, ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలకై 2024 ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మె - గ్రామీణ భారత్ బంద్‌కు జాయింట్ ప్లాట్‌ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పూనుకున్నది. మేము సైతం అంటూ తెలంగాణ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు బంద్‌కు మద్దతునిచ్చి, ప్రత్యక్షంగా పాల్గొంటామని ప్రకటించాయి. భారతదేశ చరిత్రలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు కలిసి ఉద్యమిస్తున్న అరుదైన ఉద్యమం ఇది. నయా ఉదారవాద, కార్పొరేట్ మతోన్మాద విధానాల దుష్ఫలితాల వల్ల ఇబ్బందులు పడే వర్గాలు ఇప్పటి వరకు విడివిడి పోరాటాలు చేశాయి. ఇతర వర్గాలు సంఘీభావంగా, మద్దతునిచ్చే దశ నుండి ఐక్య కార్యచరణతో సమరశీల పోరాటాల అభివృద్ధి దిశగా కృషి సాగించడమే ఇందుకు నిదర్శనం. అయితే తలపెట్టిన ఈ ప్రతిఘటనా ఉద్యమం కేంద్రంలోని కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వానికి ఓ హెచ్చరిక.

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అధికారానికొచ్చి పదేండ్లకాలం పూర్తైంది. అయినా రైతాంగ, కార్మిక, ఉద్యోగ వర్గాల, ప్రజల సమస్యలను పరిష్కరించలేదు. భారత్ వెలిగిపోతుంది, అచ్చేదిన్ ఆయేగా, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలిచ్చినా ఈ పదేండ్ల కాలంలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. కేంద్ర ప్రభుత్వ అర్థిక విధానాల వల్ల పేద, ధనిక, తారతామ్యాలు తీవ్రమౌతున్నాయి. ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం దేశంలో 139 కోట్ల మంది ప్రజల్లో ఎనభై కోట్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన మగ్గిపోతున్నారు. వాటి దుష్ఫలితాల వల్ల నిరుద్యోగం దారిద్ర్యం పెరుగుతుంది. కనీస వేతనం ధరలకు అనుగుణంగా పెరగకపోవడం వల్ల కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. శ్రామికుల నిజ వేతనాలు ఇరవై శాతం తగ్గిపోయాయి. బీజేపీ నరేంద్రమోడీ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయి. 2019-2022 మధ్యకాలంలో ఒక శాతంగా ఉన్న బడా కార్పొరేట్ల వాస్తవ ఆదాయం 30 శాతం అభివృద్ధి చెందగా, పేదల వాస్తవ ఆదాయం పదకొండు శాతానికి పడిపోయింది. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు. కానీ నేడు ఉద్యోగ కల్పన క్షీణించి నిరుద్యోగం గత యాభై ఏండ్ల గరిష్ట స్థాయికి చేరింది.

స్విస్ బ్యాంకుల్లో నుండి నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్న మాటను చునావీ జుమ్లా అన్నారు. 2023లో పాలకులు కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారు.మోడీ విధానాల వల్ల మధ్య తరగతి ప్రజల జీవితాలు భారంగా మారాయి. ధరల్ని నియంత్రిస్తామని వాగ్దానం చేసిన బీజేపీ ప్రభుత్వ హయాం లోనే ధరలు కనీవినీ ఎరుగని రీతిలో 30 నుండి 56 శాతం వరకు పెరిగాయి. పెట్రోలు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను 243 శాతానికి పెంచింది.

ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తున్నది. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్నది. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రయివేటీకరిస్తున్నది. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతున్నది. సింగరేణిలోని 4 బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నది. కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదార్లుగా వున్న ఎల్‌ఐసి వాటాలను అమ్మేందుకు తెగబడింది. కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్నది. ఈ విధానాలు ఉద్యోగుల భద్రతతో పాటు దేశ ఆర్థిక స్వావలంబనకే ముప్పు తెస్తున్నాయి.



> 2014లో స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్‌పి (మినిమం సపోర్ట్ ప్రైస్) చెల్లిస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం నిలబట్టుకోలేదు. చారిత్రాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులకు రాతపూర్వక హామీచ్చింది. ఈ కాలంలో వాటిని అమలు చేయకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదానీ, రిలయన్స్, ఐటిసి,బేయర్ లాంటి సంస్థలకు కట్టబెట్టింది. వ్యవసాయోత్పత్తులను తగ్గించి ఏటా రూ. 4లక్షల కోట్ల విలువగల నూనెలు, పప్పులు తదితర పంటలను దిగుమతులు చేసుకుంటున్నారు. కార్పొరేట్లకు మరిన్ని లాభాలు చేకూర్చేందుకు మోడీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. రైతులపై పెట్టిన కేసులు ఉపసహరించుకోలేదు. పోరాట సందర్భంగా చనిపోయిన 750 మంది రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదు.

> ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేస్తున్నది. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతున్నది. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రయివేటీకరిస్తున్నది. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతున్నది. సింగరేణిలోని 4 బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదార్లుగా వున్న ఎల్‌ఐసి వాటాలను అమ్మేందుకు తెగబడింది. కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్నది. ఈ విధానాలు ఉద్యోగుల భద్రతతో పాటు దేశ ఆర్థిక స్వావలంబనకే ముప్పు తెస్తున్నాయి.

> దేశంలో పెట్టుబడిదారి విధానం తీవ్ర సంక్షోభంలోకి చేరుకుంది. పెట్టుబడిదారులు పాలకవర్గాలు ఈ సంక్షోభం నుండి బయటపడాలంటే కార్మిక వర్గ హక్కులు, సంక్షేమాలకు కోతలు పెట్టడం అనివార్యం. ప్రజలపై భారాలు మోపడం సహజం. వీరికి ఇవి తప్ప మరో మార్గం లేదు. దీనిని కోసం కార్మిక చట్టాల రద్దు, పని భారాలు పెంచడం, వేతనాలు పెరగన్వికుండా చేయడం, రైతాంగాన్ని దివాళ తీయించడం వంటి చర్యలు తీసుకోవడం అనివార్యం. ఈ కోణంలోనే కార్పొరేట్, మతోన్మాద శక్తులకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తున్నది. కార్మిక వర్గం గత హక్కులను నిలబెట్టుకోవాలన్న ప్రస్తుతం పొందుతున్న సాకర్యాలు దిగజారకుండా ఉండాలన్న కేంద్ర బీజేపీ కార్పోరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటించడమే పరిష్కార మార్గం.

రిలయన్స్ వంటి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది. కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికింది. సమ్మె హక్కును కాలరాస్తున్నది. పిఎఫ్, ఇఎస్‌ఐ, వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నది. ఎనిమిది గంటల పని దినం స్థానంలో తిరిగి 12గంటల పని విధానం అమల్లోకి తెస్తున్నది. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో మరింత పెంచి శ్రమదోపిడీకి గురి చేస్తున్నది. కనీస వేతనం నెలకు రూ.26వేలు నిర్ణయించేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం అంగీకరించటం లేదు. కోట్లాది మంది కార్మికులకు వర్తించే ఇపిఎస్‌ను నెలకు రూ.10 వేలకు పెంపు, పాత పెన్షన్ (ఓపిఎస్) స్కీం పునరుద్ధరణకు పూనుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వో ద్యోగులకు 8వ పే కమిషన్‌ను నియమించకుండా జాప్యం చేయడం, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయకపోవడాన్ని కార్మికవర్గం నిరసిస్తున్నది.

2014లో స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్‌పి (మినిమం సపోర్ట్ ప్రైస్) చెల్లిస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం నిలబట్టుకోలేదు. చారిత్రాత్మకమైన రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ కేంద్ర ప్రభుత్వం రైతులకు రాతపూర్వక హామీచ్చింది. ఈ కాలంలో వాటిని అమలు చేయకపోగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదానీ, రిలయన్స్, ఐటిసి, బేయర్ లాంటి సంస్థలకు కట్టబెట్టింది. వ్యవసాయోత్పత్తులను తగ్గించి ఏటా రూ. 4లక్షల కోట్ల విలువగల నూనెలు, పప్పులు తదితర పంటలను దిగుమతులు చేసుకుంటున్నారు. కార్పొరేట్లకు మరిన్ని లాభాలు చేకూర్చేందుకు మోడీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. రైతులపై పెట్టిన కేసులు ఉపసహరించుకోలేదు. పోరాట సందర్భంగా చనిపోయిన 750 మంది రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించలేదు. కేరళ తరహా రుణవిమోచన చట్టం తీసుకురావాలని, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుండి ఒకేసారి రుణమాఫీ చేయాలని, విద్యుత్ (సవరణ) బిల్లు ద్వారా విద్యుత్ రంగ ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని కౌలు రైతులకు రక్షణ చర్యలు తీసుకోవాలని సుదీర్ఘ కాలంగా రైతాంగం చేస్తున్న డిమాండ్ పట్ల బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కొద్దోగొప్పో ఉపాధి కల్పనకు సుదీర్ఘ ప్రజా పోరాటాలు పార్లమెంట్‌లో వామపక్షాల కృషి వల్ల ఉపాధి హామీ పథకం వచ్చింది. ఈ పథకాన్ని ఎత్తివేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది.ఈ పథకానికి బడ్జెట్ తగ్గించేసింది. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించేందుకు నిరాకరిస్తున్నది. ప్రతి వ్యక్తికి 200 రోజుల పని, రూ.600లు రోజు వారీ వేతనం ఇవ్వాలన్న డిమాండ్‌ను ఖాతరు చేయడం లేదు. పేదవాడి నోటికాడి బువ్వలాగే ప్రయత్నం చేస్తున్నది.


కార్పొరేట్ అనుకూల, నయా ఉదారవాద ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తూనే కార్పొరేట్, మతోన్మాద శక్తుల వైఫల్యాలు, ప్రజల రోజువారీ సమస్యలను దృష్టి మళ్లించేందుకు బరితెంగించింది. రామాలయ నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ, అక్షింతల పంపిణీ పేర్లతో భావోద్వేగాలను రెచ్చగొట్టి కార్మికవర్గ ఐక్యతకు భంగం కల్గిస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి తమకు వ్యతిరేకంగా గొంతెత్తిన ప్రతిపక్షాలను, ఉద్యమకారులను అణిచివేస్తున్నది. సిబిఐ, ఈడీ, ఐటి వంటి సంస్థలను వారి జేబు సంస్థలుగా ఉపయోగించుకొని వాటి స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీస్తున్నది. ప్రశ్నించే మీడియాను లొంగదీసుకుని అణచివేస్తున్నది. హక్కులకై పోరాడే వారిపై నిర్బంధం ప్రయోగిస్తూ ఉపా లాంటి చట్టాలను ప్రయోగించి నిర్బంధ పాలన సాగిస్తున్నది. ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది.

దేశంలో పెట్టుబడిదారి విధానం తీవ్ర సంక్షోభంలోకి చేరుకుంది. పెట్టుబడిదారులు పాలకవర్గాలు ఈ సంక్షోభం నుండి బయటపడాలంటే కార్మిక వర్గ హక్కులు, సంక్షేమాలకు కోతలు పెట్టడం అనివార్యం. ప్రజలపై భారాలు మోపడం సహజం. వీరికి ఇవి తప్ప మరో మార్గం లేదు. దీనిని కోసం కార్మిక చట్టాల రద్దు, పని భారాలు పెంచడం, వేతనాలు పెరగన్వికుండా చేయడం, రైతాంగాన్ని దివాళ తీయించడం వంటి చర్యలు తీసుకోవడం అనివార్యం. ఈ కోణంలోనే కార్పొరేట్, మతోన్మాద శక్తులకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తున్నది. కార్మిక వర్గం గత హక్కులను నిలబెట్టుకోవాలన్న ప్రస్తుతం పొందుతున్న సౌకర్యాలు దిగజారకుండా ఉండాలన్న కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటించడమే పరిష్కార మార్గం. ఈ విధానాల వల్ల నష్టపోయే సమస్త శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేయాలి. అందులో భాగమే 2024 ఫిబ్రవరి 16 దేశ వ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్ పిలుపు. కొనసాగింపుగా 2024లో జరగబోయే పార్ల మెంట్ ఎన్నికల్లో కార్పోరేట్, అవినీతికర మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కృషి కొనసాగాలి. అందుకు కార్మికుల, కర్షకులు, సామాన్య ప్రజానీకం తమ రాజకీయా అనుబంధాలకు అతీతంగా దేశ విశాల ప్రయోజనాల కోసం ఐక్య పోరుకు సిద్ధపడాలి.

నివాళి

నిష్క్రమించిన విజ్ఞాన శిఖరం ప్రొ.ఆదినారాయణ

ప్రశ్న ఎంత చిన్నదైనా, జటిలమైనా, అది రసాయన చర్య వేగమా, క్వాంటం సిద్ధాంతమా లేక మూఢ నమ్మకాల గుట్టు విప్పే ప్రకృతి రహస్యమైనా ఆయన సమాధానం 'వెరీ సింపుల్' అనే మాట ఆయన నోటి నుండి వచ్చేది.ఆ మాటే వినే వాడిలో కొండంత విశ్వాసాన్ని నింపేది. జవాబు ఎంత సింపుల్‌గా ఇస్తాడో అంతకంటే సింపుల్‌గా ఉండే మనిషి అతడు ప్రొఫెసర్ ఆదినారాయణ. మూడు దశాబ్దాలకు పైగా క్లిష్టతరం అనుకునే రసాయన శాస్త్రాన్ని యూనివర్శిటీలో బోధించిన ప్రొఫెసర్ అంటే నమ్మలేం. తానొక ప్రొఫెసర్‌నన్న స్పృహగాని, అత్యంత ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ జర్మనీలో ఏండ్ల పాటు పరిశోధనలు చేశానన్న గర్వంగాని, డిఎన్‌ఏ రిపేరు వంటి ఆధునిక విషయాలను శోధిస్తున్నానన్న దర్పంగాని ఏ కోశానా కనిపించేవి కావు. నిన్న మొన్ననే నల్లగొండ జిల్లా నల్లబండగూడెం నుండి వచ్చిన రైతు బిడ్డలా నలుగురితో కలిసిపోతాడు. దశాబ్దాలుగా తెలుగులో రసాయనశాస్త్ర పాఠ్య గ్రంథాల రచయిత, సంపాదకుడుగాను, ప్రయోగాలు చేస్తూ పిల్లలకు సైన్సును బోధించాలనే ఆలోచనలకనుగుణంగా కొత్త పుస్తకాలు తేవటంలో ప్రొ.ఆది నారాయణ చేసిన కృషికి నేడు రెండు తెలుగు రాష్ట్రాల సైన్సు పుస్తకాలే సాక్ష్యం.ఎన్ని కొత్త పద్ధతులు, పుస్తకాలు ప్రవేశ పెట్టినా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకపోతే ఫలితం శూన్యమని నమ్మినవాడు ఆది నారాయణ సార్. అందుకోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాలాంటి వారిని కలుపుకొని తరగతిగది బోధనకు తోడ్పడే ప్రయోగ దీపికలను తెచ్చినవాడు. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయులను సమాయత్తం చేయడానికి వారం రోజుల శిక్షణా కార్యక్రమాలు దాదాపు వంద వరకు నిర్వహించడంలో కీలకపాత్ర ఆయనది. రంప చోడవరం నుండి ఇచ్చోడ వరకు ఆదివాసీ ఆశ్రమ పాఠశాల పిల్లలకు బాలోత్సవాలు నిర్వహించి, వారిలో వైజ్ఞానిక స్పృహను నింపిన నిజమైన ప్రజా సైన్సు ఉద్యమకారుడు. పిల్లలు ఎక్కడున్నా, ఎక్కడకు రమ్మన్నా ఆనందంగా అడుగులు వేసిన పసిమనస్కుడు ఆయన. జీవితంలో ఎన్ని కష్టాలొచ్చినా నిబ్బరంగా ఎదుర్కొని ముందుకు నడిచిన దిశాళి. నమ్మిన దానికోసం, నిక్కచ్చిగా, నిజాయితీగా, నిబద్ధతతో ముందుకు సాగటం ఆయన నైజం. సైన్సు ఉద్యమంలో తనతో నడిచిన మిత్రులపై- శిష్యులపై చెరగని ముద్ర వేసిన ఆయనే మన ప్రొ. ఆది నారాయణ. ఉపాధ్యాయ శిక్షణా తరగతులకు హాజరైన విశాఖ, విజయనగరం, మిత్రులు వెలిబుచ్చిన అభిప్రాయాన్నొకదాన్ని ఇక్కడ గుర్తు చేయకుండా ఉండలేను. 'ఎప్పుడో సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆయన శిష్యులు గుర్రం బగ్గీలో స్వయంగా లాగుతూ స్టేషన్‌కు తీసుకు పోయారని విన్నాం. ఈ రోజు అంతటి గురువును కళ్లారా చూశాం' అని చెప్పటం నా చెవుల్లో మారుమోగుతూనే ఉంది. బోర్డుమీద రాసేందుకు కుడి చేయి లేవకుంటే రెండో చేత్తో పట్టి లేపి పాఠం చెప్పిన గొప్ప గురువు. చెకుముకి అంటే ఆయనకు ప్రాణం. ఆయన ప్రయోగాలతో 'క్విజ్'కు వన్నె తెచ్చాడు. అదే చెకుముకి సంబరాలు, భువనగిరి వేదిక, రోజంతా పిల్లలతో చిరునవ్వులు చిందించిన ఆదినారాయణ, ఇక సెలవంటూ నిష్క్రమించాడు. తాను ప్రేమించిన పనిలో పాల్గొంటూ తనువు చాలించిన ఆది నారాయణ ధన్యజీవి.



- ప్రొ.కట్టా సత్యప్రసాద్

ఆదర్శ వివాహాలు - సామాజిక బాధ్యత



స్కైలాబ్‌బాబు
9177549646

ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ కేవలం మన దేశంలో మాత్రమే ఉంది. మూడు వేల ఏండ్ల కిందటి మనుస్మృతి మానసిక చట్టాల ఫలితంగా ఏ కులంలో పుట్టినవాడు ఆ కులంలోనే వివాహం చేసుకోవాలి, ఆ కులంలో చావాలి. ఇది మన భారతదేశంలో మాత్రమే ఉన్న ఒక దుర్మార్గపు మానసిక నిబంధన. రాజ్యాంగ చట్టాలు మనుషులందరికి తెలియదు. కేవలం 'లా' చదివినవారికి మాత్రమే తెలుసు. కానీ, మనుస్మృతి మానసిక చట్టాలు వేల ఏండ్లుగా వంశపారంపర్యంగా అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అని తేడా లేకుండా అమలు చేస్తు న్నారు. దీంతో కులం భారతదేశంలో క్యాన్సర్‌కంటే ప్రమాదకరమైన జబ్బుగా మారింది. కులం కట్టుబాట్లను తొలగించడానికి దేశంలో అనేక ఆలోచనలు, ప్రణాళికలు రూపొందించబడ్డాయి. కుల నిర్మూలన జరగాలని కలలుకన్న వారి ఆశయాలు నేటికి నెరవేర్చబడలేదు. జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిస్టు నేతలు, నాస్తిక వాదులవంటి అనేకమంది మహనీయులు కుల నిర్మూలన కోసం అనేక త్యాగాలు చేశారు. వంశపారంపర్యంగా కుల వ్యవస్థ కొనసాగింపు వివాహవ్యవస్థలోనే దాగి ఉందని గ్రహించారు.

కుల నిర్మూలన జరగాలని భారత రాజ్యాంగం నిర్దేశించుకున్నది. కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు ఓ మెట్టులాగా ఉంటాయని భావించింది. కులాంతర వివాహాలను చేసుకున్న వారిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం కొన్ని పారితోషకాలు కూడా ఇస్తున్నది. అందుకే ఆ రోజుల్లోనే జ్యోతిబాపూలే పూజారి లేని ఆదర్శ వివాహాలను పూలదండలు మార్చడం ద్వారా జరిపించారు. వారి అడుగుజాడల్లో నేటి పౌర సమాజం ఆదర్శ వివాహాలను ప్రోత్సహించే సామాజిక బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉన్నది.వివాహానికి 21 ఏండ్లు నిండిన యువకుడు, 18 ఏండ్లు నిండిన యువతి ఉంటే చాలు. కులమేదైనా, మతమేదైనా, ప్రాంతమేదైనా, భాష వేరైనా, దేశం వేరైనా ప్రేమించుకొని జీవిత భాగస్వా ములుగా సహజీవనం గడిపే హక్కు రాజ్యాంగబద్ధంగా కల్పించబడింది. వివాహానికి ముందు చూడాల్సింది కులం, మతం కాదు.ఆస్తులు అంతస్తులు అంతకన్నా కాదు. కట్నాలు, డబ్బులు అవసరమే లేదు, గుణం గొప్పదై ఉండాలి. మతం కంటే మానవత్వం ఉండాలి.మల్లె పువ్వు లాంటి మనసు కష్టసుఖాల్లో ఒకరికొకరు కంటికి రెప్పలా కాపాడుకోగలరా అనే ఆత్మవిశ్వాసం ఉండాలి. జీవిత కాలం కలిసి ఉండడానికి జీవనోపాధి తప్పనిసరి. కేవలం కులం కారణంగానే రెండు మనసులు కలిసి మానసిక ఐక్యత సాధించిన వ్యక్తులు దూరం కాకూడదు. పరస్పరం చర్చించుకుని వాటిపై అంగీకారం కుదిరితే ఆదర్శ వివాహం చేసుకోవడానికి అభ్యంతరం ఉండకూడదు ఏ అర్హతలు లేకపోయినా పర్వాలేదు కానీ, మా కులం వాడైతే చాలు అది బాల్యవివాహమైన లక్షల రూపాయల కట్నాలు పోసి అయినా, మా కులం వాడికే ఇచ్చి వివాహం చేస్తాను. మా కులం కానీ వాడిని ప్రేమిస్తే ఊరుకోం, అవసరమైతే కన్నబిడ్డనైనా కడతేరుస్తాం అనే కసాయిమూకలు జీవిస్తున్న సమాజమిది. లక్షలాది రూపాయల కట్నాలు పోసి పెళ్లిళ్లు జరిపి తమ కులం వాడైతే కట్నం ఎంతిస్తారు? ఆస్తిపాస్తులు ఎన్ని ఉన్నాయి?అవి మాత్రమే చూడడంతో తమ జీవిత భాగస్వామిని చూసుకునే అవకాశం నేటి యువతరానికి దక్కడం లేదు. నూరేళ్ల జీవితం తమ తల్లి దండ్రులపై కట్టబెడితే ఎలా? పెళ్లి రోజు మాత్రమే మొహాలు చూసుకునే వారు ఆ రోజు నుండి మాత్రమే ఒకరినొకరు ఎలా అర్థం చేసుకుంటారు. దీని వల్ల అపార్థం చేసుకోవడం, పరస్పరం తమ మనసులను గాయపరచుకోవడంపై కేంద్రీకరణ జరుగుతున్నది. ఆప్యాయత అనురాగాలతో జీవించాల్సిన యువతరం కులం కుదిర్చినపెండ్లిళ్లు, కట్న కానుకలు పుచ్చుకున్న పెండ్లిళ్లను చూస్తుంటే కుల మతాంతర వివాహాలు ఎంతో ఆదర్శవంతమైనవిగా గుర్తించాలి.

పురాతన కాలం నుండి కుల మతాంతర వివాహాలు జరిగాయి. మహాముని వశిష్టుడే దళితురాలిని వివాహమాడారు. వేంకటేశ్వరుడు బీబీ నాంచారిని ప్రేమించి వివాహమాడాడు. కానీ వేంకటేశ్వరుడిని ప్రతీ రోజు పూజించే వాళ్లు కూడా తమ కూతురు తక్కువ కులం వాడిని ప్రేమించి పెళ్లి చేసుకున్నదని, తమ కూతురికి భర్తగా ఉన్న వ్యక్తిని, అంటే తన అల్లుడిని సుఫారీ ఇచ్చి నరికి చంపుతున్నటువంటి ఉదంతాలను కండ్లారా చూస్తున్నాం. ప్రేమికులపై ఎందుకింత కుల,మత విద్వేషాలు? నేడు దేశంలో కులదురహంకార హత్యలు పెరిగి పోయాయి. ఆధిపత్య కులరక్కసి విషపు నాగులాగా బుసలు కొడుతున్నప్పుడు కుల దురహంకార హత్యలు పెచ్చరిల్లుతున్నాయి. సమాజాభివృద్ధిని కాంక్షించే సామాజిక ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఆదర్శ వివాహాలకు అండగా నిలుస్తున్నప్పటికీ మెజారిటీ సమాజం మనువాద కుల సంస్కృతి అడ్డుగోడల్ని ఛేదించలేక పోతున్నది. ఇది మారాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ పార్టీలు కూడా సామాజిక బాధ్యతతో వ్యవ హరించాలి. ప్రేమించుకున్న వారిని చేరదిసి ఆదర్శ వివాహాలను జరిపించాలి. కుల, మతాంతర పెండ్లిళ్లను ప్రోత్సహించడం కోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలి. కులదురహంకారుల వంచన చేరి ప్రేమికులను దూరం చేయరాదు. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో సుమారు వందకు పైగా కుల దురహంకార హత్యలు జరిగాయి.

2017లో తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన ఘటన గుర్తుండే ఉంటుంది. ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో పెరు మాండ్ల ప్రణయ్ అనే దళిత యువకుడు అమృత అనే వైశ్య యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గర్భిణిగా ఉన్న ఆమెను హాస్పిటల్‌లో వైద్యం చేయించుకొని తిరిగొస్తుండగా కోటి రూపాయలు సుఫారీ ఇచ్చి అమృత తండ్రి మారుతిరావు అత్యంత క్రూరంగా ప్రణయ్‌ని నరికి చంపించాడు. ఈ ఒక్క ఘటన చాలు కుల దురహంకారం ఎలా రాజ్యమేలుతుందో చెప్పడానికి. కానీ ఇలాంటి వాటిని ప్రోత్సహించి, కుల దురహంకార శక్తులను వంచన చేర్చుకునే మతోన్మాద శక్తులు కూడా మన మధ్యలోనే ఉన్నాయన్న సంగతి మరవరాదు. భజరంగ్‌దళ్, విహెచ్‌పీ, ఏబీవీపీ వంటి మనువాద మతోన్మాదులు ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం రోజున, పార్కుల దగ్గర మారణాయుధాలతో, కర్రలతో దాడులకు దిగుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నారు. సమాజ అభ్యుదయాన్ని సహించలేని తిరోగమన శక్తులకి బుద్ధి చెప్పడానికి, ప్రేమికుల రోజున కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) వంటి సంస్థలు ఆదర్శ దంపతులను అభినందిస్తూ సభలు నిర్వహిస్తున్నది.



> కుల దురహంకార హత్యలు, దాడుల తర్వాత ప్రేమికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీస్ స్టేషన్లలోకి వెళ్లి తమకు రక్షణ కల్పించాలని దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ప్రభుత్వం వారి అర్హతను బట్టి ఉద్యోగాలలో రాయితీలివ్వాలి. ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించివ్వాలి. వారి పిల్లల చదువుల ఖర్చులు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అనేక జీవోలు ఉన్నప్పటికీ అవేవీ అమలుకు నోచుకోవటం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఆదర్శ దంపతులకు ప్రత్యేక ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, తెలంగాణ కొత్త ప్రభుత్వం కూడా అదేవిధంగా ఆచరించాలి. రాజస్థాన్ ప్రభుత్వం కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం చేస్తూ అసెంబ్లీ తీర్మానించింది. మన అసెంబ్లీ కూడా చట్టం చేయాలి.

కుల దురహంకార హత్యలు, దాడుల తర్వాత ప్రేమికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోలీస్ స్టేషన్లలోకి వెళ్లి తమకు రక్షణ కల్పించాలని దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ప్రభుత్వం వారి అర్హతను బట్టి ఉద్యోగాలలో రాయితీలివ్వాలి. ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించివ్వాలి. వారి పిల్లల చదువుల ఖర్చులు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అనేక జీవోలు ఉన్నప్పటికీ అవేవీ అమలుకు నోచుకోవటం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో ఆదర్శ దంపతులకు ప్రత్యేక ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, తెలంగాణ కొత్త ప్రభుత్వం కూడా అదేవిధంగా ఆచరించాలి. రాజస్థాన్ ప్రభుత్వం కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణ చట్టం చేస్తూ అసెంబ్లీ తీర్మానించింది. మన అసెంబ్లీ కూడా చట్టం చేయాలి. కేవలం వయసు మాత్రమే గీటురాయిగా పరిగణించి అలాంటి వివాహాలను పోలీస్ స్టేషన్‌లోనే జరిపించి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. దాడులకు దౌర్జన్యాలకు చోటు లేకుండా కుల దురహంకార హత్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజ అభ్యుదయం కాంక్షించే అన్ని రాజకీయ పార్టీలు వారి పార్టీలో ప్రతి ఏటా ఎన్ని ఆదర్శ వివాహాలు జరిపించారో శ్వేతపత్రం విడుదల చేయాలి. ఆదర్శ వివాహాలు మన దేశ భవిష్యత్తుకు దోహదం చేస్తాయి. కులరహిత భారత్‌గా రూపుదిద్దుకోవటానికి మొట్టమొదటి మెట్టుగా ఉంటాయి. కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతుందో పౌర సమాజంపై అంతకన్నా ఉంది

(నేడు ప్రేమికుల దినోత్సవం)



విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు

ప్రతిభా పరీక్షలు దోహదం

జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ

నవతెలంగాణ-ఖమ్మం
విద్యార్థులలో ప్రతిభని, సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేత పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ప్రయివేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షులు కాంతారావులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు శివరామకృష్ణ, విన్ ఫీల్డ్ స్కూల్ యజమాన్యం శ్రీకాంత్, కిషోర్, పుల్లారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాగుల మేరా, నిఖిల్, సాయి, మురళి, చందులాల్, నరేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ డిఆర్‌లు విడుదల చేయాలి

- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం
2022 సంవత్సరం జులై నుండి పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని యు.బాస్కర్‌రావు అధ్యక్షతన ఖమ్మం కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి 30 శాతం పిట్‌మెంట్‌తో అమలు చేయాలని, 20 సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారికి పూర్తి పెన్షన్ చెల్లించాలని, 12 సంవత్సరాలకే సివిపి. రెస్టోర్ చెయ్యాలని, 398 వేతన సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ నిర్ధారణ చెయ్యాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపీచంద్, రాజేంద్ర ప్రసాద్, కె.శ్రీధర్, పి.కృష్ణారావు, కొమ్మాలు, వెంకటయ్య, పి.చంద్రశేఖర్, పి.వెంకన్న, సాహెబ్, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వెంకటరమణ ఆటోమొబైల్స్ బజాజ్ షోరూంలో బంపర్ డ్రా

నవతెలంగాణ- ఖమ్మం
దసరా , దీపావళి పండుగ అమ్మకాలకు సంబంధించి వెంకటరమణ ఆటోమొబైల్స్ బజాజ్ షోరూంలో సుమారు రెండు లక్షల రూపాయల విలువైన వస్తువులు బంపర్ డ్రా తీశారు. మొదటి బహుమతిగా బజాజ్ పాసింజర్ సిఎంజి కొన్న ఖమ్మం వాసి మొహమ్మద్ జలీల్ పాషాకి 90 వేలు విలువగల బజాజ్ ప్లాటినా 2 వీలర్ వాహనం వచ్చింది. జలీల్ పాషాకి వెంకటరమణ ఆటోమొబైల్ ఎండి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బజాజ్ డివిజన్ ప్రతిసంవత్సరం కస్టమర్ కోసం సుమారు రెండు లక్షల వరకు బహుమతులు ఇలాంటి లక్కీ డ్రా ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే రెండవ బహుమతి పూనెం భద్రయ్య కారేపల్లి, బర్లగూడెం, మూడవ బహుమతి మాటూరు వెంకటేశ్వర్లు వాడగూడెం, వెంకటాపురం రావడం జరిగిందని చెప్పారు. ఖమ్మం డివిజన్ లో 90 శాతం మార్కెట్ షేర్‌తో తమ బజాజ్ 3 వీలర్ ముందు ఉన్నదని, బజాజ్ సీఎన్జీ ఆటో ఒక కేజీనకు సుమారు 50 కిలోమీటర్లు మైలేజ్ వస్తున్నదని తెలిపారు. మెయింటెనెన్స్ చాలా తక్కువని తమ వెంకటరమణ ఆటోమొబైల్స్‌ని 30 సంవత్సరాలుగా అదరిస్తున్న తమ కస్టమర్ దేవుళ్ళకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఖమ్మంలో తమ రెండవ విశాలమైన వర్క్‌షాప్‌ను మా కస్టమర్‌ల విన్నపం మేరకు ఓపెన్ చేస్తున్నామని అన్నారు. ముందు ముందు ఇలాగే తమ వెంకటరమణ ఆటోమొబైల్స్‌ని ఆదరించాలని కోరారు.

గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపికైన 'సాయిరాం'

నవ తెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన తమ్మారపు సాయిరామ్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఫలితాలను విడుదల చేసింది. సాయిరాం బోనకల్ మండల పరిధిలోని గోవిందాపురం గ్రామంలో గల శాంతి కాన్వెంట్ నందు ఒకటి నుంచి 4వ తరగతి వరకు చదువుకున్నాడు. ఐదో తరగతి గోవిందాపురం ఎల్ ప్రాథమిక పాఠశాల నందు చదువుకున్నాడు. 6 నుంచి 10వ తరగతి వరకు గోవిందాపురం ఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు చదువు కొన్నాడు. ఇంటర్ ఏపీఆర్జేసీ నాగార్జునసాగర్ నందు పూర్తి చేశాడు. డిగ్రీ కవితా మెమోరియల్ డిగ్రీ కాలేజ్ ఖమ్మం నందు పూర్తి చేశాడు. పీజీ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీ నందు పూర్తి చేశాడు.

వరి గడ్డివామి దగ్ధం

తిరుమలాయపాలెం : బీరోలు గ్రామం గోపోజు దేవయ్యకు చెందిన వరిగడ్డివాముకి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని మంగళవారం దగ్ధమైంది. ఈ ఘటనలో రైతుకు రూ.30వేల నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సాయంతో మంటలను ఆర్పేశారు.

సమ్మెను జయప్రదం చేయండి

సత్తుపల్లి : మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసిందని, బ్యాంకింగ్, రైల్వేలు, విమానాశ్రయాలు, ఎల్ఐసీ వంటివి లాభాలను ఆర్జించి పెడుతున్న సంస్థలన్నింటిని పెట్టుబడిదారులకు అప్పగించారని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు విమర్శించారు. కార్మిక, కర్షక, బ్యాంకింగ్, బీమా తదితర 15 సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్ కార్యక్రమం విజయవంతం కోరుతూ మంగళవారం సత్తుపల్లిలోని కిన్లే వాటర్ బాట్లింగ్ కంపెనీ వద్ద సంఘ సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కల్యాణం ప్రసంగించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, కిన్లే వాటర్ ప్లాంట్ యూనియన్ నాయకులు ప్రసాద్, రాజేశ్, బీకే ప్రసాద్, జిలాని, చారి, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫేర్వెల్ డే

నవతెలంగాణ-వైరా
స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పూర్తి చేసిన విద్యార్థులు కళాశాల విడిచిపోతున్నందుకు, ప్రథమ సంవత్సర విద్యార్థులు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అతిథిగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఇన్చార్జి హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్ కుమార్, పి శ్రీనివాసరావు, ఉమా సుందరి, జి శ్రీనివాసరావు, బాబురావు, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, శ్రీకాంత్, ఈశ్వరరావు, రోషన్ బి, వెంకట ముత్యం, మధు, కవిత, సుధాకర్, నాగ సర్వేశ్వరరావు, ఎంవి శ్రీనివాస్‌రావు, నాన్ టీచింగ్ స్టాఫ్ సీనియర్ అసిస్టెంట్ డి.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .



భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖమ్మం

మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే పారిశ్రామిక గ్రామీణ సడక్ బంద్‌ను. జయప్రదం చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో విస్తత ప్రచారం చేశారు. మయూరి సెంటర్ నుండి ఇల్లందుక్రాస్‌రోడ్డు వరకు ప్రతి దుకాణానికి వెళ్లి బంద్ ఆవశ్యకతను వామపక్ష నేతలు వివరించారు. సామాన్యులకు సైతం బంద్ ప్రచార కరపత్రాలను అందించి బందకు తోడ్పాటు సందించాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం గాంధీచౌక్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి బంద క్కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా, జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు యర్రా శ్రీను, వై.విక్రం, సుదర్శన్, దొంగల తిరుపతిరావు, శింగు నర్సింహారావు, తోట రామాంజనే యులు, రావి శివరామకృష్ణ, ఆవుల అశోక్, జి.రామయ్య, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక మతోన్మాద విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న కార్మిక ఉద్యోగ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల భవనంలో పార్టీ మండల జనరల్ బాడీ సమావేశం దుగ్గి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్ల పాలనలో కార్మిక, రైతాంగ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైం దన్నారు. సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ నెల 18 న చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులచే గుండె, కిడ్నీలు, చెవి ముక్కు గొంతు సమస్యలు, గ్యాస్టిక్ సమస్యలు, ఎముకలు, కీళ్ల వ్యాధులు, కంటి సమస్యలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఎన్జీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో గత 14 నెలలుగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలను కూడా విస్తృతం చేయాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలేరు ఆయకట్టు పరిధిలో రైతులు సాగు చేసిన అనేక పంటలు నీరు లేక ఎండిపోతున్నందున తక్షణమే పాత కాలువకు సాగునీరు అందించి పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని అన్నారు. మండలంలోని చెరువులను నింపి భూగర్భ జలాలు అడుగంటి పోకుండా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, కట్టేకోల వెంకన్న, దేగల వెంకటేశ్వరరావు, శివరాజు, బలుసు ప్రమీల, చింతలపాటి భాస్కర్, దండా సూర్యనారాయణ, కె.వి చారి, పోతనబోయిన పెరుమాళ్ళు, మారుతి సూర్యనారాయణ, బొడ్డు మధు, మేకల శేషుబాబు, గురజాల వెంకటేశ్వర్లు సామల మల్లికార్జునరావు, బొడ్డు బాబు పాల్గొన్నారు.



బోనకల్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ చేయాలని అఖిల పక్ష రాజకీయ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిఐటియూ కార్యాలయంలో సిఐటీయూ మండల కన్వీనర్ బోయినపల్లి వీరబాబు అధ్యక్షతన అఖిల పక్ష రాజకీయ, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అఖిల పక్ష రాజకీయ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, గాలి దుర్గారావు, దొండపాటి నాగేశ్వరరావు, యంగల ఆనందరావు, రావుట్ల సత్యనారాయణ, బంధం శ్రీనివాసరావు, బంధం నాగేశ్వరరావు, నాయకులు బోళ్ల ప్రసాదరావు, మండేపూడి గోర్కి, గవీదు సైదులు, బూర్గుల అప్పారావు, ఉదారపు నాగేశ్వరావు, గారపాటి వెంకటేశ్వరరావు, భద్రునాయక్, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండల కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో మిత్రపక్షాల కార్మిక సంఘాలు, రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. బైక్‌ర్యాలీ నిర్వహించారు. 16న జరిగే బంద్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఐ వెంకన్న, తెలంగాణ రైతు సంఘం తోటకూరి రాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండె పొంగు మల్లేష్, రైతు కూలిసంఘం జిల్లా అధ్యక్షులు బజ్జూరు వెంకటరామిరెడ్డి, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు బిక్కసాని గంగాధర్, ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రేపాకుల శివలింగం, ఐఎఫ్‌టియు మండల నాయకులు గోపి రవి, కాంపాటి మధు, దాట్ల వీరస్వామి, పోకల వెంకన్న, రైతు కూలి సంఘం మండల అధ్యక్షులు చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు, తెలంగాణ రైతు సంఘ నాయకులు మల్లెల సనమంతరావు, యడవల్లి రమణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడు గన్యానాయక్, సిఐటియు నాయకులు పడిశాల శేషయ్య కొమ్ము రోశయ్య పాల్గొన్నారు.

వైరాటౌన్ : గోల్లెనపాడు గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జరుగుతుందని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతులపై జరిపిన డ్రోన్ దాడులను ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు నల్లమోతు వెంకటనారాయణ, చంద్ర వెంకట్రావు, ఆళ్ళ రాంబాబు, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

తల్లాడ : గ్రామీణ బంద్‌లో సిపిఎం కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డ కృష్ణయ్య భవన్‌లో షేక్ నన్నేసాహెబ్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మాజీ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, కళ్యాణపు కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

వైరాటౌన్:యువతకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వని మోడీని, బీజేపీ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఓడించాలని, 16న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక, గ్రామీణ బంద్ కు డివైయఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, బంద్ జయప్రదం చేయాలని డివైయఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బోడేపూడి భవనంలో డివైయఫ్ఐ వైరా పట్టణ, రూరల్ మండల సమావేశం పట్టణ అధ్యక్షుడు చిత్తారుమురళి అద్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డివైయఫ్ఐ పట్టణ కార్యదర్శి షేక్ నాగుల్ పాషా, జిల్లా నాయకులు కనపర్తి గిరి, నాగిరెడ్డి, సుజాత, నర్సింహారావు, కార్తిక్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ : కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న దేశ వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు వివరించారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని గ్రానైట్ పరిశ్రమ ప్రాంతాలు, పెద్దతండాలోని గోదాములో మంగళవారం ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రత్నాకర్‌రావు, వెంకన్న, రాములు, శ్రీను, ప్రసాద్, వెంకటేశ్వర్లు, వీరయ్య, నరసయ్య పాల్గొన్నారు.





జేఈఈ మెయిన్స్ ఫలితాలలో రెజొనెన్స్ విజయభేరి

నవతెలంగాణ- ఖమ్మం
దేశ వ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి తమ ఆధిక్యాన్ని చాటుకున్నారని డైరెక్టర్స్ ఆర్‌వి. నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్ఠమైన ప్రణాళిక అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం బోధనానుభవం కలిగిన మెనేజ్ మెంట్ ఈ విజయానికి కారణమని తెలిపారు ఇంటర్‌తో పాటే ఐఐటి, నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం ద్వారా ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. అత్యుత్తమ పర్సంటైల్ లతో పాటు సుమారు 82 శాతం మంది పైగా విద్యార్థులు అర్హత సాధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిర్చి పంటల సాగును పరిశీలించిన జెడిఎ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని అమ్మపేటలో రైతులు సాగు చేసిన మిర్చి తోటలను వ్యవసాయశాఖ జిల్లా అధికారి విజయనిర్మల మంగళవారం సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి మిర్చి పంటల దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మపేట ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ మిర్చి నర్సరీలో రైతులు మిర్చి నారుకొని కొని పంటలు సాగు చేసిన మిర్చితోటలు కాపు రాక నష్టపోయామని జెడిఎకు రైతులు చెప్పారు. నష్టపోయిన మిర్చితోటలను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయిలో పంపించాలని రైతులు జెడిఏ విజయనిర్మల దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యతలేని మిర్చి నారును విక్రయించి రైతులను తీవ్రంగా నష్టపరిచిన మిర్చి నర్సరీపై కఠినచర్యలు తీసుకొని, రైతులకు న్యాయం చేయాలని జెడిఏను కోరారు. అనంతరం జెడిఎ విజయనిర్మలకు రైతుల వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు రమణ, నరసింహారావు, డివిజన్ అధికారి వెంకటేశ్వరరావు, ఏవో మందుల రాధ, పలువురు రైతులు పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్స్‌లో హార్వెస్ట్ విజయభేరి

నవతెలంగాణ- ఖమ్మం
జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో హార్వెస్ట్ విద్యార్థులు అద్భుతంగా రాణించి, మంచి ఫలితాలను రాబట్టారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మందికి పైగా విద్యార్థులు అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులలో 50 శాతంగా ఉంది. వీరిలో 8 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ పైన సాధించారు. మరొక ఐదుగురు 98 పర్సంటైల్ పైగా ఇంకొక ఆరుగురు 97 పర్సంటైల్పైన, ఇంకా ఏడుగురు 96 పర్సంటైల్ పైన సాధించారు. మొత్తం 43 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించారన్నారు. వేల్పుల జశ్వంత్ యల్.కె.జి నుండి 12వ తరగతి వరకు హార్వెస్ట్ స్కూల్లోనే చదవి 99.94 పర్సంటైల్ సాధించటం గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రైమరీ స్థాయి నుండి 12వ తరగతి వరకు హార్వెస్ట్ లోనే చదివిన విద్యార్థులు 25 మందికి పైగా ఉన్నారని అన్నారు. అడుసు మిల్లి జిగ్నేన్ యం.బై.పి.సి.లో చదువుతూ జేఈఈలో 99.86 పర్సంటైల్ సాధించటం విశేషమనీ, రాబోయే నీట్ పరీక్షలో ఎయిమ్స్‌లో సీటు సాధించగలడని తెలిపారు. జేఈఈ మెయిన్స్ రెండవ విడతలో కూడా మంచి పర్సంటైల్ను సాధించాలని విద్యార్థులకు సూచించారు. పటిష్ట ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం నిరంతర పర్యవేక్షణతో ఈ అద్భుత ఫలితాలు సాధించామన్నారు.

జెఈఈ పరీక్షలో లిటిల్ ఫ్లవర్ విద్యార్థుల సత్తా

నవతెలంగాణ-వైరా

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో (2024) జాతీయ స్థాయి జెఈఈ మెయిన్స్ పరీక్షలలో వైరా న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు 10 మంది అర్హత సాధించి ప్రభంజనం సృష్టించారు. ఫిబ్రవరి 12న విడుదల చేసిన మొదటి సెషన్ ఫలితాలలో న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ మొదటి బ్యాచ్‌లోని 24 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 10 మంది క్వాలిఫై అయి జెఈఈ అడ్వాన్స్ పరీక్ష రాయటానికి అర్హత సాధించారు. కుర్రా స్వాత్య, కొప్పురావూరి తేజస్విని, బీరెల్లి రామకృష్ణ, శీలం భావన, పిల్లలమర్రి జ్ఞాన ప్రద్యుమ్న, దుగ్గినేని రమ్యశ్రీ, వడ్డే శ్రీముఖి, చావా సుధీర్, భూక్యా యుగంధర్, మిట్టపల్లి ప్రజాన్‌లు జెఈఈ మెయిన్ అడ్వాన్స్ రాయటానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతీనేని భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్‌లు మాట్లాడుతూ వైరా డివిజన్ స్థాయిలో కాక ఖమ్మం జిల్లా స్థాయిలో తాము గర్వపడే ఫలితాలు సాధించారని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటిలలో చేరేందుకు మార్గం సుగమం కావటం పట్ల గర్వపడుతున్నట్లు తెలిపారు. భవిషత్‌లో తమ పాఠశాల నుండి మరింత మంది విద్యార్థులను ఐఐటి, ఎన్ఐటిలలో సీట్లు సాధించేలా బాధ్యతగా చేస్తామన్నారు. జెఈఈ మెయిన్స్‌కు అర్హత విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అభినందించారు.

నిబంధనలు పాటించండి...ప్రాణాలు కాపాడుకోండి

నవతెలంగాణ కల్లూరు

రోడ్డు భద్రత నిబంధనలను పాటించి విలువైన ప్రాణాలు కాపాడుకొని కుటుంబాలకు అండగా నిలవాలని ఎస్సై ఎస్కే షాకీర్, సత్తుపల్లి వాహనాల ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య కోరారు. మంగళవారం జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా పట్టణ సెంటర్లో డ్రైవర్లకు ప్రజలకి అవగాహన చేయటం కోసం ఆటపాటల ద్వారా ప్రమాదాలు జరిగితే కలిగే నష్టాలు ఏ విధంగా ఉంటాయి... కుటుంబాలు ఏ విధంగా రోడ్డును పడతాయి.. అంటూ కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు.

మండల పరిషత్ సమావేశంలో సరైన వివరణలు ఇవ్వని అధికారులు

వందపడకల ఆసుపత్రికి స్థల సేకరణ జరిగినా చెప్పని డీటీ

నవతెలంగాణ-వైరా
వైరా పట్టణంలో 37.50 కోట్ల రూపాయల వ్యయంతో 100 పడకల ఆసుపత్రిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ అసెంబ్లీలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు విజ్ఞప్తి చేయగా ప్రభుత్వ అనుమతితో ఆసుపత్రి మంజూరు అయింది. అందుకు స్థల సేకరణ చేయాలని ఆదేశాలు వచ్చినవి. తొలుత ప్రస్తుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్న స్థలంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం సాధ్యమా అని పరిశీలించారు. మొత్తం 5 ఎకరాల స్థలం అయినప్పటికీ ఆక్రమణలు పోను ప్రస్తుతం అక్కడ రెండు ఎకరాలు ఉండీ లేమిడే. ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన సుమారు 5 ఎకరాల స్థలాన్ని గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణానికి కేటాయించింది. అక్కడ 65 లక్షల రూపాయలతో మినీ స్టేడియం నిర్మించతలపెట్టింది. టెండర్లు కూడా పూర్తి చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ బందెల పౌల్ ఆకస్మాత్తుగా మరణించటంతో స్టేడియం పనులు నిలిచిపోయినవి. స్టేడియం నిర్మించటం కోసం ముందు రహదారి సర్వే చేశారు. మధిర ఆర్అండ్‌బీ రోడ్డు నుండి మినీ స్టేడియంకు వెళ్ళు దారి రాజశేఖర్ నగర్‌లో ఉన్నది. అక్కడ ఇళ్లు నిర్మించే దశలో ఎన్ఎస్‌పి పంట కాలువ కలుపుకుని ప్రహరీ గోడలు నిర్మించారు. సర్వేలో ఆక్రమణలను తొలగింపునకు గోడలను కూల్చి వేశారు ఇప్పటికే సంవత్సరం గడిచిపోయింది. స్టేడియం లేదు గానీ తమ గోడలు మాత్రం కూల్చారని వారు కొన్నాళు నొచ్చుకున్నారు. ఆ స్థలాన్ని 100 పడకల ఆసుపత్రికి ప్రతిపాదిస్తూ డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు తాసీల్దార్ శ్రీనివాసరావు ప్రతిపాదనలు పంపారు. ఇదిలా ఉండగా ఈ నెల 9న వైరా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తూ వైరాకు మంజూరైన 100 పడకల ఆసుపత్రి కి స్థల సేకరణ త్వరగా పూర్తికాకపోతే సమీప మండలం కొణిజర్లకు తరలిపోయే అవకాశం ఉందని, నియోజక వర్గ కేంద్రం కాబట్టి వైరాలోనే ఆసుపత్రి ఉంటే మంచిదని అన్నారు. అనంతరం రెవెన్యూ రిపోర్ట్ ఇచ్చిన డిప్యూటీ తహసీల్దార్ రాము కనీసం ఆసుపత్రి స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు పంపినట్లు ఒక్క మాట కూడా చెప్పలేదు. మండల పరిషత్ నుండి ముందుగానే తమ శాఖల ప్రగతి నివేదికలను ప్రజా ప్రతినిధులకు అందజేయాలని, మండల పరిషత్‌కు కూడా కాపీలు ఇవ్వాలని ఎన్నిసార్లు కోరినా ఏ ఒక్క శాఖా ప్రగతి నివేదికలు ఇవ్వలేదు. సమగ్ర సమాచారంతో కాకపోయినా మౌలికాంశాల సమాచారం కూడా పరిషత్ సమావేశానికి ఇవ్వటం లేదు. ఈ విషయాన్ని కూడా జడ్‌పి చైర్మన్ ప్రత్యేకించి ప్రస్తావించాల్సి వచ్చింది. 100 పడకల ఆసుపత్రికి స్థల సేకరణ, ప్రతిపాదనలు పంపిన విషయం చెప్పలేని అధికారులు సమావేశానికి వచ్చినా ఫలితం ఏమిటని ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com



డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు మృతికి డిప్యూటీ సీఎం నివాళులు

నవతెలంగాణ-వైరాటౌన్

ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు, ఢిల్లీ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి మంగళవారం సాయంత్రం చేరుకున్నారు. తమ సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో హైదరాబాద్లో మరణించడంతో ఆయన భౌతికకాయాన్ని వైరాకు తరలించారు. వైరా పట్టణంలో తన సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు, తెలంగాణ రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తన అన్న పార్థివ దేహం వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు కంటతడి పెట్టారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రాక సందర్భంగా వైరా ఏసిపి రహమాన్ ఆధ్వర్యంలో వైరా పట్టణం, స్నానాల లక్ష్మీపురం గ్రామంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రముఖులు నివాళులు అర్పించారు.

సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ కో- కన్వీనర్‌గా దండమూడి గిరిజ

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని 27 డివిజన్ శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో జరిగిన సఖి జాతీయ మహిళా మండలి సమావేశంలో దండమూడి గిరిజను సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ కో- కన్వీనర్ గా సంస్థ ఫౌండర్, చైర్మన్ నరాల సత్యనారాయణ నియమించారు. నూతనంగా నియమించబడ్డ నేషనల్ కో- కన్వీనర్ దండమూడి గిరిజకు స్థానిక కార్పొరేటర్ దొడ్డ నగేష్ శుభాకాంక్షలు తెలిపారు.

నూతనంగా నియమించబడ్డ నేషనల్ కో- కన్వీనర్ దండమూడి గిరిజ బేడ బుడగ సంఘం మహిళ జిల్లా అధ్యక్షురాలుగా ఆ తర్వాత జిల్లా గౌరవ అధ్యక్షురాలుగా ఉన్నారు. అదేవిధంగా స్వచ్ఛభారత్, కరోనా టైంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, నిరుపేద మహిళలకు అండగా ఉంటూ సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ వారి మనలను పొందుతున్నారని చిట్టి పొట్టి తగాదాలతో భార్యాభర్తలు విడిపోవడం వచ్చిన సమయంలో కూడా వారికి నచ్చచెప్పి కౌన్సిలింగ్ ఇప్పించి కలిపిన దాఖలు కూడా ఉన్నాయి అని అన్నారు. ఎన్నో కుటుంబాలను కూడా నిలబెట్టారని పేర్కొన్నారు.

వరిలో చీడపీడలు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నవతెలంగాణ-కల్లూరు

రవిలో సాగు చేసిన వరికి చీడపీడలు ఆశించాయని వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు యు.నరసింహారావు రైతుల కోరారు. మంగళవారం కల్లూరు చుట్టుపక్కల నీటి అవకాశం ఉన్న దగ్గర సాగుచేసిన వరి ఫైర్ ను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు తదితరు చీడ పీడలు ఆశించాయని నివారణకు వ్యవసాయ అధికారిని విస్తరణాధికారులు సంప్రదించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ పాఠశాలలో మండలస్థాయి టాలెంట్ టెస్ట్

- ప్రథమస్థానంలో రేజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-సత్తుపల్లి

పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో రేజర్ల ప్రభుత్వ ఉన్నత విద్యార్థిని పి గాయత్రి ప్రథమ స్థానం దక్కించుకుంది. అలాగే మండల సాంఘికశాస్త్ర ఫోరం నిర్వహించిన క్విజ్ పోటీలో రేజర్ల పాఠశాలకు ద్వితీయ స్థానం దక్కింది. తృతీయ స్థానంలో అయ్యగారిపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థికి దక్కింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసుగా రూ. 1200, 1000, 800 చొప్పున విజేతలకు అందజేస్తూ జ్ఞాపికలు అందించారు. టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఫోరం తరపున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకర్లపల్లి, ఎన్టీఆర్‌నగర్, రేజర్ల ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు నక్కా రాజేశ్వరరావు, వీర్ల సరోజిని, నాగమణి, ఉపాధ్యాయిని కమలకుమారి, విద్యార్థులు, ఫోరం, ఛారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఏసీపీగా అనిశెట్టి రఘు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి (కల్లూరు) ఏసీపీగా అనిశెట్టి రఘు బదిలీపై సత్తుపల్లి రానున్నారు. ఇక్కడ ఏసీపీగా పనిచేసిన బొజ్జా రామానుజన్ బదిలీ అయ్యారు. గతంలో రఘు సత్తుపల్లి ఎస్సైగా కూడా పనిచేశారు. సత్తుపల్లి ఏసీపీగా నేడు (బుధవారం) రఘు బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

నల్లగొండ సభకు బయలుదేరి వెళ్లిన ఖమ్మం బిఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

కృష్ణా నది పరిధిలోని శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ... బీఆర్ఎస్ పార్టీ నల్గొండలో మంగళవారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలి వెళ్లనున్నారు. ర్యాలీ ను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, తో సీనియర్ నాయకులు ఆర్జెసి కృష్ణ, ఫోర్ లీడర్ కర్నాటి కృష్ణ, కలిసి నల్లగొండ సభకు భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడారు. ఈ సభకు బస్సులలో కార్లలో భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ఉద్యమకారులు, ముఖ్య కార్యకర్తలు, బిఆర్ఎస్ అభిమానులు, అందరూ సభకు హాజరవుతున్నామని మేయర్ నీరజ తెలిపారు.

స్టడీ చైర్స్, ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

తోపుడు బండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 20 స్టడీ చైర్స్, లాంగ్ ప్యాడ్స్ ను మంగళవారం తోపుడు బండి సంస్థ చైర్మన్ సాధిక్ అలీ పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కల్లూరు పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని రాబోయే పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులుపొందాలని అభినందించినారు. 22 వేల రూపాయలు వెచ్చించి 20 కుర్చీలు అందించటం జరిగింది. మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్టర్స్ పత్తిపాటి నివేదిత, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

45 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ కల్లూరు

మండల పరిధిలోనే చిన్న కోరుకొండ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ 45 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో కరుకుల నరసింహారావు ఇంటి ముందు గల బొలెరో వ్యాన్లో పీడిఎస్ రైస్ 45 క్వింటాలు అక్రమ రవాణా చేయుచుండగా పట్టుకున్నారు. కాగా ముగ్గురుని అదుపులోకి తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

జేఈఈలో నారాయణ విద్యార్థుల విజయకేతనం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



జేఈఈ 2024 మెయిన్ పరీక్ష ఫలితాల్లో నారాయణ కళాశాల ఖమ్మం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్థాపించిన బ్యాచ్‌లలో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించారు. ఆల్ ఇండియా 99.50 శాతంతో పాటు 99.12, 98.58, 98.28, 98.22, 97.22, 97.01, 95.95, 95.80, 95.72 శాతాలతో విజయ కేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కోర్ డీన్ వెంకటరెడ్డి, డీన్ పాటి మాధవరావు ప్రిన్సిపల్ అభినందించారు.

మెరుగైన వైద్యం అందించాలి



కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్, ప్రభుత్వ వైద్య కళాశాలలోని ప్రిన్సిపాల్ ఛాంబర్ లో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరుతో, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో సేవలు మరింతగా మెరుగవ్వాలన్నారు. వైద్య కళాశాల రాకముందు 90 మంది వైద్యులు ఉండగా, ఇప్పుడు 113 మంది ఉన్నారని, స్టాఫ్ నర్సులు 147 మంది ఉండగా, ఇప్పుడు 230 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ప్రసవాలు పెంచాలని, నెలకు 1000 ప్రసవాల లక్ష్యం చేరాలని అన్నారు. సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలని ఆయన అన్నారు. ఆసుపత్రిలో 2 టిఫా పరీక్ష యంత్రాలు, 5 గురు రేడియాలజిస్టులు ఉన్నారని, ప్రసవాల సంఖ్య మేరకు టిఫా పరీక్షలు చేపట్టాలన్నారు. స్కానింగ్, సిటీ స్కాన్ పరీక్షలు పెంచాలని, టిఫా, స్కానింగ్ పరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, సర్జరీ తదితర విభాగాల్లో సాధించిన పురోగతిపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లాపరోస్కోపి సదుపాయానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన అన్నారు. డాక్టర్లు అందుబాటులో ఉన్నట్లు, పరికరాలు సమకూర్చుతున్నట్లు, సేవలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల అవసరాల దృష్ట్యా భవనాల నిర్మాణానికి స్థల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇప్పుడు కళాశాల నిర్వహిస్తున్న ప్రదేశంలో భవనాల నిర్మాణానికి స్థల సమస్య ఉందని, ప్రస్తుతం కళాశాల నిర్వహణలో ఉన్నదని, భవన నిర్మాణానికి సమయం పడుతుందని, ఆలోగా తరగతుల నిర్వహణ, భవన నిర్మాణాలు ఏకకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నర్సింగ్, పారా మెడికల్, ఫిజియోథెరపి కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రానున్నందున, భవిష్యత్ అవసరాల దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం ల్యాబ్, లెక్చర్ హాళ్లు, అవసరం దృష్ట్యా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రాములు నాయక్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ వి.పి. గౌతమ్

సైనిక సంక్షేమ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్, సైనిక సంక్షేమ భవన నిర్మాణ పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భవనంలో విద్యుత్, టైల్స్, కలరింగ్ పనులు చేయాల్సి ఉందని, పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. మూడో అంతస్తు నిర్మాణానికి, లిఫ్ట్‌కు టెండర్ ప్రక్రియ చేపట్టి, మూడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. నిర్మాణాన్ని మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె. శ్రీరామ్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ డిఇ రాందాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ - మెయిన్ పరీక్షలో అగ్రగామిగ నిలిచిన శ్రీచైతన్య

విజయం సాధించిన విద్యార్థులను అభినందించిన మల్లెంపాటి శ్రీధర్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జెఈఈ - మెయిన్ 2024 పరీక్ష ఫలితాలలో ఖమ్మం శ్రీ చైతన్య విద్యార్థులు 10 లోపు, 100 లోపు ఆల్ ఇండియా అత్యుత్తమ ర్యాంకులను సాధించగలిగే న్యూక్లీస్, స్టెర్లింగ్ - సూపర్ 60 ప్రోగ్రామ్‌తో బి.అభిలాష్ - 99.88, టి.శ్రీరామ్ తేజ - 99.78, ఎస్. బి.వర్షిత్ కౌండిన్య - 99.72, వి. తుషార్ చౌదరి - 99.69, బి నాగశ్రీ - 99.67, కె.శ్రీ పూజిత - 99.56, యం . సాయికుమార్ - 99.45, కె.నవదీప్ కిరణ్ - 99.44,పి.సాయి దినేష్ రెడ్డి - 99.43, పి.రఘునాథ్ - 99.40, డి.శ్రీ సాత్విక్ - 99.29, జె . జెమినీ నాయక్ - 99.23, వి.ప్రణవి సాయి - 99.15, ఏ.ఇందు రెడ్డి - 99.09, జి.అక్షయ్ రెడ్డి - 99.02, వంటి అత్యుత్తమ పర్సంటైల్ స్కోర్లతో విజయదుందుభి మ్రోగించారు. అదేవిధంగా 99 కుపైగా పర్సంటైల్ తో 15 మంది విద్యార్థులు, 98 పర్సంటైల్ పైగా 23 మంది విద్యార్థులు, 97 పర్సంటైల్ పైగా 39 మంది విద్యార్థులు, 96 పర్సంటైల్ పైగా 54 మంది విద్యార్థులు, 90 పర్సంటైల్ పైగా 135 మంది విద్యార్థులు, స్కోర్లును సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ వ రా ట్లా డ ు తూ ా . . మారుతున్నపరీక్షా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసె తులనాత్మక విద్యాప్రణాళికతో పాటు రాష్ట్రంలోనే బెస్ట్ అనదగ్గ లెక్చరర్ల విద్యాబోధనను అందిస్తూ, నిరంతరం విద్యార్థులకు అందుబాటులో ఉంచుతూ వారి పెర్ఫార్మెన్స్ ను ఎప్పటికప్పుడు సమీక్షించడం వల్లనే తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సునాయాసంగా సాధించగలిగారని తెలిపారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను



విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, అకడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, డి.జి.యమ్, సి.హెచ్. చేతన్ మాథుర్, అకడమిక్ డీన్ శ్రీ ఎన్.ఆర్.యస్.డి వర్మ, ఎ.జి.యం.లు శ్రీ సి.హెచ్. బ్రహ్మం, శ్రీ జి. ప్రకాష్, జి. గోపాలక్రిష్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం, కలిసి విజయం సాధించిన విద్యార్థులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.

భారత్ బందుకు న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు

తిరుమలాయపాలెం : కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం కోరుతూ మంగళవారం మండలంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ శ్రేణులు వివిధ గ్రామాలలో మోటార్ సైకిల్ తో విస్తృతంగా ప్రచారం చేయటం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించినా, పేదలు తదితరుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 15 లక్షలు జమచేస్తున్నప్పటికీ, దశాబ్ద కాలంగా సాగుతున్న బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజల ప్రాథమిక సమస్యలను పెద్దగా పరిష్కరించకపోగా, వాస్తవం మాత్రం అలాంటి వాగ్దానాలకు ద్రోహం చేస్తోందని అన్నారు. యాభై ఏళ్ల క్రితం కంటే నిరుద్యోగం అత్యధికంగా ఉంది. గత పదేళ్లలో "అచ్చే దిన్", "మెరుస్తున్న భారతదేశం" అనే చర్చ వాస్తవ వాస్తవాల వెలుగులో క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. శ్రామిక ప్రజల నిజమైన వేతనాలు 20% పడిపోయాయి మరియు ధరల పెరుగుదల ఈ కాలంలో అపూర్వమైనదిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోలేపొంగు నాగయ్య, జిల్లా నాయకులు పేరం వెంకటేశ్వర్లు, గొర్రెపాటి వీరస్వామి, అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు జిల్లా నాయకులు అమ్మోజు బ్రహ్మాచారి, పివైఎల్ జిల్లా నాయకులు దారమల్ల శంకర్, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి ఆడేపు నగేష్, ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



మాతృ మరణాలను నివారించడంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



జిల్లాలో మాతృమరణాలను నివారించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్, ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశ మందిరంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవ సమయాన వివిధ కారణాలతో మరణిస్తున్న గర్భవతులకు మెరుగైన వైద్యం అందించి సంరక్షించాలని తెలిపారు. దేశంలో మాతృ మరణాల రేటు 52 ఉండగా, తెలంగాణలో 42, ఖమ్మం జిల్లాలో 45 ఉందన్నారు. జిల్లాలో ఏప్రిల్, 2023 నుండి జనవరి, 2024 వరకు 9 మాతృ మరణాలు సంభవించినట్లు, మరణానికి కారణాలు, పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వైద్యాధికారులతో సమీక్షించారు. వైద్యాధికారులు చికిత్సపై సలహాలు చేస్తూ, పోషకాహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రసవానంతరం బాలింతలను 45 రోజులపాటు పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాములు నాయక్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సైదులు, హెచ్ఓడి లు, వైద్యాధికారులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని వ్యవసాయ మార్కెట్ లో సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ లో మంగళవారం ఉదయం సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ. ఈనెల 16వ తారీఖున జరిగే గ్రామీణ బంద్ లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరుతూ దేశంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ బంద్ నిర్వహిస్తున్నామని,తెలిపారు. ఈ సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, ఐద్వా త్రీ టౌన్ కార్యదర్శి పత్తిపాక నాగ సులోచన, డివైఎఫ్ఐ ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు, దడవాయిలు నరసింహారావు, సాయి, సిఐటియు నాయకులు కొట్టి అలివేలు, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జల ఉద్యమానికి తరలిన 'గులాబీ' దండు

- సండ్ర నాయకత్వంలో 20 వేల మంది నల్లగొండకు పయనం

నవతెలంగాణ-సత్తుపల్లి

కృష్ణానది జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకొనేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండలో మంగళవారం తలపెట్టిన భారీ బహిరంగ సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నాయకత్వంలో 20వేల మంది గులాబీ దళం తరలి వెళ్లింది. సత్తుపల్లి పట్టణం, రూరల్, వేంసూరు, పెనుబల్లి మండలాల నుంచి కార్లలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలి వెళ్లగా కల్లూరు, తల్లాడ మండలాల నుంచి గులాబీ శ్రేణులు బస్సుల్లో తరలి వెళ్లారు. సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలు నుంచి నల్లగొండకు బయలుదేరిన కార్లను సండ్ర జెండాఊపి ప్రారంభించారు. నల్లగొండ సభకు వెళ్లిన వారిలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, యాగంటి శ్రీనివాసరావు, ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్ మట్టా ప్రసాద్, మోరంపూడి బ్రదర్స్, మందపాటి శ్రీనివాసరెడ్డి, కంచర్ల నాగయ్య, ఏగోటి పెద్దిరాజు, కాల్నేని వెంకటేశ్వరరావు, బాలాజీరెడ్డి, మందడపు ప్రభాకర్, క్లబ్బు వెంకటేశ్వరరావు, మిద్దే శ్రీనివాసరావు, నరేంద్ర తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

విద్యార్థులతో ఘర్షణ పడ్డ యువకుడు

పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు...

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

విద్యార్థులతో ఘర్షణపడ్డ యువకున్ని గ్రామస్థులు పోలీసులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలోని కామంచికల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఓ యువకుడు, మరికొంత మందితో కలిసి కామంచికల్ ఉన్నత పాఠశాల వద్దకు వచ్చి విద్యార్థులతో ఘర్షణ పడ్డాడు. విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు, గ్రామస్థులకు తెలియజేయగా గ్రామస్థులు పాఠశాల వద్దకు వచ్చి ఆ యువకున్ని పట్టుకొని పాఠశాలలో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందజేశారు. గుర్తు తెలియని యువకుడు గంజాయి మత్తులో విద్యార్థులతో ఘర్షణపడుతున్నాడని, మత్తులో విద్యార్థులను ఏమైనా చేస్తాడని భయంతో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందజేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఆ యువకునితో వచ్చిన వారంతా పారిపోగా యువకుడు ఒక్కడే పట్టుబడ్డాడు. అ యువకుడు దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ -కూసుమంచి

మండలంలోని గట్టుసింగారం గ్రామ సమీపంలో గురుదత్త గార్డెన్, ఎస్ఆర్ఎస్పి కాల్వ పక్కన మంగళవారం పిడిఎస్ రైస్ సుమారు 500 క్వింటాళ్లు భారీగా డంపు చేయడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు రేషన్ బియ్యాన్ని పెట్టుకున్నారు. రేషన్ బియ్యం కోదాడకు చెందిన వ్యక్తిదిగా తెలుస్తుంది. మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని, 500 క్వింటాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితగాని శ్రీను, మంగు, నరేష్‌లను అదుపులోకి తీసుకున్నారు.


ఎస్బిఐటి విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం వి.టి.యస్. కంపెనీ వారు నిర్వహించిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఉద్యోగ ప్రాంగణ నియామకాలలో 13 మంది ఎస్బిఐటి విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి, ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె. అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, ఎ.వి.వి. శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, జె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వల్లాపురం వాసికి మిలియనీర్ ఫార్మర్ ఇండియా అవార్డు

నవతెలంగాణ-వైరా



వల్లా పురం గ్రామానికి చెందిన రైతు తుమ్మల రాణా ప్రతాప్‌ను మరో అరుదైన అవార్డు వరించింది. సోమవారం సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కృషి విజ్ఞానకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఐసిఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఉద్దం సింగ్ న్యూ ఢిల్లీ రాణాప్రతాప్‌కు మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డును అందజేశారు. రాణా ప్రతాప్‌కు గత సంవత్సరం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో మాజీ ఉప రాష్ట్ర పతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రైతు నేస్తం అవార్డు అందుకున్నారు. రాష్ట్ర , జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న రాణా ప్రతాప్ వ్యవసాయంలో అనేక ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా రసాయన ఎరువులు లేని సంప్రదాయ పంటలు పంటలు పండించారు. గత సంవత్సరం పురాతన వరి బ్లాక్అండ్ రెడ్ రైస్ వంగడాల పరిరక్షణకు నడుం బిగించి 15 రకాల దేశీయ వరి వంగడాలను సేద్యం చేశాడు. మరో 15 రకాల దేశీయ వరి వంగడాలను పండించి ప్రత్యేక వరి విత్తన బ్యాంకు ఏర్పాటు చేయటమే లక్ష్యంగా కృషి చేస్తున్నాడు. నిత్య కృషీవలుడుగా రైతులచే, జిల్లా ,రాష్ట్ర అధికారులచే ప్రశంసలు అందుకున్న ప్రతాప్ కు మిలియనీర్ ఫార్మర్ ఇండియా అవార్డు రావటం పట్ల రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు అభినందనలు

నవతెలంగాణ-వైరాటౌన్

పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మంగళవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షకు మండలంలోని ఏడు ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి మొత్తం 21 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ముత్తమాల శరత్‌చంద్ర, ప్రథమ స్థానం (జెడ్.పిహెచ్ఎస్, గరికపాడు), కూరాకుల ఉమేష్, ద్వితీయ స్థానం (జెడ్.పిహెచ్ఎస్ సిరిపురం), వేమిరెడ్డి ఉషశ్రీ, తృతీయస్థానం (జెడ్.పిహెచ్ఎస్ గరికపాడు) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గరికపాడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకట్రావు, నాగమణి, యాకూబ్, శ్రీనివాసరెడ్డి, శిరీష, భాస్కర్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా సురేందర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ -ఎర్రుపాలెం



త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబడుతున్న అధికారుల బదిలీలలో భాగంగా ఎర్రుపాలెం మండల అభివృద్ధి అధికారిగా సుమారు 30 నెలల నుంచి విధులు నిర్వహిస్తున్న బిక్కంటి శ్రీనివాసరావును మహబూబాద్ జిల్లా గార్ల బయ్యారం మండలానికి బదిలీ చేశారు. జనగాం జిల్లా లింగాల ఘనపూర్ మండలంలో పని చేస్తున్న బి.సురేందర్ ఎర్రుపాలెం మండల అభివృద్ధి అధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏపీవో గంధం శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, వేణు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 14, 2024 | www.navatelangana.com



16న బందును జయప్రదం చేయండి

• గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల పట్ల నిరంకుశ ధోరణికి నిరసనగా ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్ నందు ఏర్పాటు చేసిన అకిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో తొలుత 16 న జరిగే బంద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంఘటిత, అసంఘటిత కార్మికులపై ఉక్కు పాదం మోపిన మోడీ ప్రభుత్వంను గద్దె దింపాలన్నారు. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో పాల్గొన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మికులపై అనేక రకాల కేసులను మోపిందని అన్నారు. నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఆర్థిక వ్యవస్థపై భారం మోపిందని చెప్పారు. దేశ జనాభాలో 40 శాతం ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికుల పట్ల నిరంకుశ ధోరణి వహిస్తూ వారికి ప్రభుత్వం ద్వారా అందవలసిన ఫలాలను సైతం సరైన సమయంలో అందజేయక ఇబ్బందులకు గురి చేస్తుందని చెప్పారు. 16న తలపెట్టిన బందును జయప్రదం చేసి కార్మిక వర్గాల శక్తి సామర్థ్యాలను కేంద్ర ప్రభుత్వానికి చాటి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్, కంచర్ల జమలయ, వంగా వెంకట్, డి.వీరన్న, పి.సతీష్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, మల్లికార్జునరావు, వీరాస్వామి, విశ్వనాథం,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ టీటీ పోటీల్లో 'గూడెం 'వాసి ప్రతిభ

• సింగిల్స్, డబుల్స్‌లో పతకాలు సాధించిన లోకేష్

నవతెలంగాణ-కొత్తగూడెం



ఈ నెల 8 నుండి 13 వరకు పటారా ఫటోర్డా గోవాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ విభాగంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన కొత్తగూడెం వాసి ఇడుపుగంటి లోకేష్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం, డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప జేశాడు. సింగిల్స్ విభాగంతో సెమీఫైనల్స్‌లో ప్రస్తుత సింగిల్స్ విజేత కేరళకు చెందిన అర్జున్‌పై ఓడినప్పటికీ మూడవ స్థానం కోసం జరిగిన పోరులో అద్భుతమైన ప్రతిభా కనపర్చి కాంస్య పతకం సాధించాడు. డబుల్స్ విభాగంలో ఖమ్మంకు చెందిన యాకూబ్ ఆలీతో జోడిగా బరిలోకి దిగిన లోకేష్ జంట ఫైనల్స్‌లో కేరళకు చెందిన సునీత్, అర్జున్ జంటపై 11-9, 8-11, 9-11, 7-11 స్కోర్ తేడాతో పరాజయంపాలై రజత పతకంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. లోకేష్, యాకూబ్ ఆలీలు జాతీయ సాయి మాస్టర్స్ పోటీలలో పతకాలు సాధించడం పట్ల సీనియర్ టిటి క్రీడాకారులు ప్రేంకుమార్. శ్రీనివాస్, థామస్, ఎంవి.రమణ, చందు, రియాజ్ సీనియర్, షామంత్, ఇమ్మానియేల్, ఫణి, రాంబాబు, వర్ధన్‌రావుతదితరాలు హర్షం వ్యక్తం చేశారు.



సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన హమాలీ కూతురు

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట జీసీసీ హమాలీ కూతురు భోగ్యం సమ్మక్క సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. దమ్మపేటకు చెందిన భోగ్యం సత్యం-రమణ దంపతుల కుమార్తె అయిన సమ్మక్క సివిల్ ఫలితాలలో ప్రథమ స్థానంలో నిలిచి కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం దమ్మపేట గ్రామస్తులు, దమ్మపేట వాల్మీకి సంక్షేమ సంఘం, జీసీసీ హమాలీ యూనియన్ సభ్యులు సమ్మక్కను సన్మానించి అభినందించారు. రాబోవు రోజులు మునుముందు మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన లిటిల్ ఫ్లవర్స్ బాలికలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో భద్రాచలం పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల బాలికలు తమ సత్తా చాటి ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఐఐటీలో ప్రవేశం కోసం జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరైన కేలోత్ సాహితి 76.75 శాతం మార్కులు, భూక్య నిహారిక 57.39 శాతం మార్కులు కైవసం చేసుకుని ఐఐటీ సీట్లు సాధించేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. జేఈఈ మెయిన్స్‌లో చక్కని మార్కులు సాధించిన ఈ విద్యార్థినీలను మంగళవారం కళాశాలలో జరిగిన సమావేశంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు, డైరెక్టర్ ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఏటా ఇంటర్ ఫలితాల్లో తమ లిటిల్ ఫ్లవర్స్ బాల బాలికలు తమ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకుంటున్నారని, అలాగే జేఈఈ మెయిన్స్‌లో కూడా తమ కళాశాల విద్యార్థినీలు దేశస్థాయిలోనే ఉత్తమ మార్కులు కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు తర్ఫీదునిచ్చిన అధ్యాపక బృందాన్ని వారు ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల గణితం అధ్యాపకులు బషీరు తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి శ్రీరామ పాదయాత్ర భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-ములకలపల్లి

దమ్మపేట మండలం పట్వారిగూడెం నుంచి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న శ్రీరామ భక్తులకు మంగళవారం జగన్నాథపురం రైతువేదిక వద్ద కమలాపురం గ్రామానికి చెందిన చీమకుర్తి సాంబశివరావు-చంద్రకళ దంపతులు, కుమారుడు అజిత్ రామభక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ అన్నదానంలో శ్రీరామభక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి దుర్గాప్రసాద్, కృష్ణారావు, జ్యోతి, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం త్రివేణి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న లోహిత్ కుషాల్, 8వ తరగతి చరణ్ నాయక్ విద్యార్థులు ఆరెంజ్ గ్లోబల్ ఒలంపియాడ్ స్టేట్ లెవెల్ కాంపిటీషన్లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ జంగాల మంజుల విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... త్రివేణి పాఠశాల విద్యార్థులు పాఠశాలలో జరిగే పోటీలలోనే కాకుండా జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతులు సాధిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమలాదేవి, అకాడమిక్ ఇన్చార్జి నరేష్, క్యాంపస్ ఇంచార్జ్ సందీప్ విద్యార్థులను అభినందించారు.

సామర్థ్యంపై బదిలీ వేటు...

దేవస్థానం ఈవో బదిలీపై సర్వత్రా విమర్శ

పాలక మండలి లేకపోయినా, పాపికొండలు విహారయాత్ర ఆశించిన స్థాయిలో నడవకపోయినా, భద్రాచలం దేవస్థానం ఆదాయాన్ని అంతకంతకు పెంచుతూ కబ్జాదారుల చేతిలో ఉన్న రామయ్య భూములపై ప్రత్యక్ష పోరుకి దిగిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆలయ ఈవో సామర్థ్యం పై దేవాదాయ శాఖ బదిలీ వేటు వేసింది.

• ఈవో బదిలీపై ఇంటి దొంగల పాత్ర

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రాముడు పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్య ఫలితంగా రామాలయ ప్రాముఖ్యత అంతకు అంతకు మసకబారుతున్న విషయం తెలిసింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు కరోనా కష్టాలు అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాపికొండల విహారయాత్ర అత్యంత ఆంక్షల పేరుతో కఠినత్వం చేసిన తరుణంలో భద్రాచలం ఆలయ ఆదాయాన్ని పెంచేందుకు ఈవోగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాత్రికులను స్థానిక భక్తులను ఆకర్షించే విధంగా నూతన అధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టి ఆలయ ఆదాయాన్ని క్రమక్రమంగా పెంచుకుంటూ వచ్చారు. ప్రధానంగా ముక్కోటి అధ్యయన ఉత్సవాలు భక్త రామదాసు శబరి స్మృతి యాత్రల పేరుతో స్థానిక భక్తులను విశేషంగా ఆకట్టుకోవటమే కాకుండా ప్రత్యేక పూజలు పేరుతో టిక్కెట్లను ఆన్లైన్లో పొందుపరిచి రామయ్యకు ఆదాయాన్ని భారీగా తెచ్చిపెట్టే మార్గాలను ఎంచుకొని విజయం సాధించారు. ఎన్నో ఏళ్లగా ఇంటి దొంగల సహకారంతో పురుషోత్తపట్నంలోని రామయ్య భూములను కబ్జాలు చేస్తూ కవులు చెల్లించకుండా పూర్తిగా స్వాహ చేసేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారులపై ప్రత్యేక పోరుకు దిగి ఆలయ అర్చకులు సిబ్బందితో కలిసి రాష్ట్ర సరిహద్దు దాటి పురుషోత్తపట్నం భూమిలో ప్రత్యేక పోరాటం నిర్వహించి తద్వారా ఆ సమస్యను రెండు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తీసుకురావటంలో విజయం సాధించారు. రామాలయం చెందిన సత్రాల పై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడంలో విజయం సాధించారు. ఎన్నో ఏళ్లగా ఒకే సీట్లపై పాతుకుపోయి ఆలయ ఆదాయంలో చేతివాటం చూపిస్తూ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న ఉద్యోగస్తులను అంతర్గత బదిలీలతో పాటు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ తన మార్కు పాలనను చూపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డ తరుణంలో ఈవో రమాదేవి పాలను తోడు పాలకమండలి కూడా ఏర్పడితే దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతుందని వివిధ వర్గ ప్రజల ఆకాంక్షించిన నేపథ్యంలో కొంతమంది ఇంటి దొంగల సహకారంతో దేవస్థానం నే ఆర్థిక వనరులుగా మార్చుకొని కొన్ని వ్యవహారాలు నడిపిస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు రామయ్య భూములను అక్రమంగా అనుభవిస్తున్న కబ్జాదారుల కలయికలో ఇంటి దొంగల ప్రాబల్యంతో దేవాదాయ శాఖకు తప్పుడు నివేదికలు పంపి రమాదేవి బదిలీపై కొంతమంది పెద్దలు పూనుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానం ఈవో బదిలీని నిలిపివేయాలని దేవస్థాన అర్చకులు, కింద స్థాయి ఉద్యోగులతో పాటు పట్టణంలోని పుర ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు బహిరంగనే డిమాండ్ చేస్తూ ప్రత్యక్ష ఉద్యమానికి సైతం దిగటంతో మరోసారి భద్రాచలం వార్తల్లోకి ఎక్కింది. ఏదేమైనాప్పటికీ పాలనలో తన మార్కు చూపిస్తున్న మహిళ అధికారిపై ఇటువంటి బదిలీ వేటు వేయటం సరైనది కాదని, రామయ్య భక్తులతో పాటు భద్రాచల పుర ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.


దేవస్థానం ఈవో బదిలీని నిలిపివేయాలని ఆలయ అర్చకుల నిరసన

రామాలయం ఈవో బదిలీ అర్థరహితం



భద్రాచలం రామాలయాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తున్న దేవస్థానం రమాదేవి అకస్మాతిక బదిలీ అర్థరహితం. రామాలయ చరిత్రలో ఎన్నో విప్లాత్మకమైన మార్పులు చేపట్టిన రమాదేవిని బదిలీ చేయడం సరైనది కాదు. నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం ఆలయ ఈవో రమాదేవి వంటి నిజాయితీపరులను బదిలీ చేసి ఆ ప్రతిష్ట పాలు కావద్దు. వెంటనే రమాదేవి బదిలీని దేవాదాయ శాఖ రద్దుచేసి యదాస్థానంలో కొనసాగించాలి.

- టీడీపీ నేత అజీమ్

ఈవోగా రమాదేవిని కొనసాగించి పాలకమండలిని ఏర్పాటు చేయాలి



సమర్థవంతమైన పాలనందిస్తున్న దేవస్థానం ఈవో రమాదేవిని అదే స్థానంలో కొనసాగించి భద్రాచలం దేవస్థానానికి వెంటనే పాలకమండలిని ఏర్పాటు చేయాలి. ఆలయ ఈవో బదిలీపై పట్టణ వ్యాప్తంగా వస్తున్న నిరసనను ప్రభుత్వం గుర్తించి ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. నిజాయితీగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాలే తప్ప బదిలీల పేరుతో వేధించవద్దు. మహిళా అధికారి రమాదేవి సాహసోపేత నిర్ణయాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆమెను మరొక రెండు సంవత్సరాలు అయినా కొనసాగించాలి.

-భీమవరపు వెంకటరెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షులు

సమ్మెలో ఒక్క ఉద్యోగీ పాల్గొనొద్దు

• సమీక్షా సమావేశంలో జీఎం

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి సంస్థకు సంబంధం లేని 16న సమ్మెలో ఒక్క ఉద్యోగి పాల్గొనవద్దని జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలకు వ్యతిరేకంగా ఈ టోకెన్ సమ్మె నిర్వహించబడుతుందని అన్నారు. జాతీయస్థాయికి సంబంధించిన విధి విధనాలపై సింగరేణి సంస్థ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ కీలక సమయంలో సమ్మె పిలుపుతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, లక్ష్యాలపై ప్రభావం పడుతుందన్నారు. కార్మిక సంఘాలు, ఉద్యోగులు ఈ సమ్మెకు దూరంగా ఉండాలని, సంస్థ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి సహకరించాలని కోరారు.

11 టన్నుల నిషేధిత గంజాయి దహనం

• ఎస్పీ రోహిత్‌రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల అక్రమంగా తరలిస్తున్న గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేసినట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా ఒకే రోజు దశల వారీగా నిషేధిత గంజాయిని దహనం చేసి రికార్డు సాధించినట్లు ఎస్పీ తెలిపారు. రూ.27 కోట్లు విలువ చేసే నిషేధిత గంజాయిని దహనం చేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం కొత్తగూడెం మేమచంద్రపురం, పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీపంలో దహనం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్లలో 142 కేసుల్లో వివిధ సందర్భాల్లో నిందితుల వద్ద నుండి సీజ్ చేసిన 11,061 కేజీల నిషేధిత గంజాయిని నిర్మానుష అటవీ ప్రాంతంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగిందన్నారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ రూ.27 కోట్లు పైగా ఉంటుందన్నారు. కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నిషేధిత గంజాయిని దహనం చేయడం జరిగిందని తెలిపారు. తొలుత డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మెన్, ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ స్టేషన్ల వారీగా స్వాధీనం చేసుకున్న గంజాయిని హెడ్ క్వార్టర్స్‌లో తూకం వేసి కేసు రికార్డులు పరిశీలించారు. అనంతరం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓఎస్డి సాయి మనోహర్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డిఎస్పీలు వెంకటేష్, రాఘవేంద్రరావు, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్బి ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

• సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి అన్నారు. మంగళవారం భద్రాచలం పట్టణంలో జరిగిన హమాలీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికుల హక్కులను కాల రాస్తున్నందున ప్రభుత్వ పరిశ్రమలన్నీ ప్రైవేటీకరిస్తున్నందుకు హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయని కారణంగా అనేకమంది కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారన్నారు. వారికి ఎటువంటి ఉపాధి దొరికే పరిస్థితులు కనబడటం లేదని బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో కార్పొరేట్ల ఆస్తులు విపరీతంగా పెరుగుతున్నాయని దానికి సమానంగా పేదల కష్టాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని కనీస వేతనాలు అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మరలా ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం గానీ గెలిస్తే ప్రజల మధ్య వ్యత్యాసాలు ఏర్పడతాయని, కావునా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి దించాలంటే ఈ నెల 16 తేదీ జరుగుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక గ్రామీణ బంధును జయప్రదం చేయాలని, దానికి భద్రాచల పట్టణంలోని ప్రజలందరూ వ్యాపారులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, అందరూ సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు సాయి, శ్రీను, సత్యం, నాగయ్య, వెంకట్రావు, నరసింహారావు, గోపి అనేకమంది హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యాష్ ట్యాంకర్ బోల్తా...డ్రైవర్‌కు గాయాలు

నవతెలంగాణ-పినపాక



మండలంలోని మల్లారం మూలమలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం మణుగూరు ఏటూరునాగారం ప్రధాన రహదారిపై మల్లారం మూలమలుపు వద్ద మణుగూరు బిటిపిఎస్ నుండి యాష్ లోడ్‌తో తాండూరు వెళుతున్న యాష్ ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కి గాయాలు అవ్వగా గమనించిన స్థానికులు 108కు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ శివప్రసాద్, ఎస్సై వెంకటప్పయ్య ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాదంపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గాయాలు పాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లుగా సమాచారం. మూలమలుపును పరిశీలించి వెంటనే స్పందించిన సీఐ శివప్రసాద్ వేగ నియంత్రణ డ్రమ్ములను తక్షణమే ఏర్పాటు చేశారు. మూలమలుపుల వద్ద వేగంగా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



పేదరికాన్ని వరించిన ప్రభుత్వ ఉద్యోగం

• అంబేద్కర్ కాలనీలో సంబరాలు
• మాధవిని సన్మానించిన కాలనీవాసులు

నవతెలంగాణ-బూర్గంపాడు

ఇష్టంతో కష్టపడి చదివితే ఎలాంటి ఇబ్బందులున్నా అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చని నిరూపించింది నిరుపేద కుటుంబానికి చెందిన కేసుపాక మాధవి. ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నర్సింగ్ ప్రభుత్వ ఉద్యోగాల్లో మండల కేంద్రమైన బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీకి చెందిన మాధవిని ప్రభుత్వ ఉద్యోగం వరించింది. కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు మాధవి స్వీకరించింది. ఈ మేరకు మండల కేంద్రమైన బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీ వాసులు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన మాధవిని ఘనంగా సన్మానించి సత్కరించారు.

పేదరిక వెంటాడుతున్నా.. వదలని లక్ష్యం:

బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీకి చెందిన కేసుపాక భూషణం-వెంకటమ్మ దంపతులకు చెందిన కుమార్తె కేసుపాక మాధవిని అటు పేదరికం వెంటాడుతున్నా అనేక కష్టాలు ఎదురవుతున్నా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగింది.

మాధవిని సన్మానించిన కాలనీవాసులు

మాధవి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం పట్ల బూర్గంపాడు అంబేద్కర్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మాధవిని పూల మాలతో శాలువాలతో సన్మానించి సత్కరించారు. అదేవిధంగా అంబేద్కర్ యువజన నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతున్న యువతకు మాధవి ఆదర్శంగా నిలుస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కేసుపాక పుల్లయ్య, కేసుపాక రఘురాం, కేసుపాక డాక్టర్ మహేష్, కేసుపాక రాజేష్, తోకల శంకర్ రావు, పుట్టి ప్రసాద్ ,తోకల నాగరాజు, తోకల రాము, కడారి శ్రీను,అలవాల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

8
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ఫిబ్రవరి 14, 2024 www.navatelangana.com



దరఖాస్తులు స్వీకరించి ట్రైనింగ్‌కు పంపాలి

నవతెలంగాణ-మణుగూరు

కొండాపురం భూగర్భ గని నందు ఖాళీగా ఉన్న వెండర్ పోస్ట్ సీనియారిటీ ప్రాతిపదికన కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ట్రైనింగ్‌కు పంపాలని కొండాపురం భూగర్భ గని కార్మికులు కోరుతున్నారు. మంగళవారం కార్మికులు మాట్లాడుతూ ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గతంలో క్యాంటీన్‌కు చెందిన వెండర్ పోస్ట్ లేని సమయంలో తాత్కాలికంగా ఎవరితో ఒకరితో క్యాంటీన్ నడిపించేవారన్నారు. ఇప్పుడు యాజమాన్యం క్యాంటీన్ వెండర్ పోస్ట్ కేటగిరీ ప్రత్యేకంగా కేటాయింపు చేయడంతో కార్మికుల నుంచి అసక్తి పెరుగుతుందన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన మాత్రమే పోస్ట్ భర్తీ చేయాలని కార్మికులు కోరుతున్నారు. పైరవీలతో వెండర్ పోస్ట్ కార్మిక సంఘాల నాయకులు ఎంపిక చేసిన వారికి మాత్రమే ఇచ్చే విధంగా గని అధికారులు కూడా సహకరిస్తున్నారనే వాదన కార్మికుల బలంగా ఆరోపిస్తున్నారు. అందుకో భాగంగానే గని నందు తాత్కాలికంగా క్యాంటీన్ నందు విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడికి మంగళవారం ట్రైనింగ్ కోసం వీటీసీకి పంపించారని కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గనికి చెందిన కేటగిరీ పోస్ట్ భర్తీ చేయాలంటే ఆసక్తి కార్మికుల నుంచి ముందుగా దరఖాస్తులు తీసుకోని ట్రైనింగ్‌కు పంపవలసిన ఉండగా అధికారులు ఎలాంటి నోటీస్ బోర్డ్ వేయకుండానే రహస్యంగా తమకు అనుకూలంగా ఉన్న కార్మికుడికి ప్రత్యేక ట్రైనింగ్‌కు పంపించి అయనకు వెండర్ కేటగిరీ కట్టబెట్టలని చూస్తున్నారన్నారు. దీనివల్ల సీనియర్‌గా గని నందు పని చేస్తున్న కార్మికులు నష్ట పోయే ప్రమాదం ఉందని, దీనిపై అధికారులు దృష్టి సారించి పారదర్శకంగా ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా వెండర్ పోస్టు భర్తీ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

నాకు అన్యాయం చేస్తున్నారు : కార్మికుడు ఎం.నాగేశ్వరరావు

కొండాపురం గనిలో ఖాళీగా ఉన్న వెండర్ పోస్టుకు ఆసక్తి గల కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి. ఎలాంటి నోటీస్ బోర్డ్ వేయకుండా నచ్చిన వారిని ట్రైనింగ్‌లకు పంపడం వల్ల సీనియర్‌గా ఉన్న కార్మికులకు అన్యాయం జరుగుతుంది. నిబంధనల ప్రకారం అధికారులు భర్తీ చేయాలి.

పీఎం కిసాన్ పథకంకు ఈకేవైసీ చేయించుకోండి



• ఏఈఓ లక్ష్మణరావు

నవతెలంగాణ-పినపాక

రైతులకు పెట్టుబడి కింద కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన పథకం కింద సంవత్సరానికి రూ.6 వేలు అందిస్తోందని, ఈ సహాయం అందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని ఏఈఓ లక్ష్మణరావు తెలియజేశారు. మండలంలోని ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ పథకానికి ఈ కేవైసీ చేసుకొని రైతులు ఈనెల 21వ తేదీ వరకు చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ కోసం బ్యాంక్ ఎకౌంట్, ఆధార్ కార్డుకు లింక్ అయిన అటువంటి ఫోన్ నెంబర్, జతపరిచి ఈ సేవ కేంద్రంలో ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారులను కానీ, రైతు వేదికల వద్ద గాని రైతులకు సంప్రదించాలని కోరారు.







16న జరిగే బంద్‌కు
సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- కార్మిక, కర్షక ఐక్యతతో కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొడదాం
- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్





నవతెలంగాణ-కొత్తగూడెం

భారత దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మత తత్వ విధానాల నుంచి దేశాన్ని రక్షించుకోవడం కోసం ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, బంద్‌కు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్‌లు తెలిపారు. మంగళవారం మంచికంటి భవన్‌లో సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. సమావేశాల ప్రారంభ సూచికగా పార్టీ సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య పార్టీ జెండా ఆవిష్కరించారు. గుగులోత్ ధర్మాకు నివాళులు అర్పించారు. అనంతరం ఏజె.రమేష్, ఎం.జ్యోతి, కె.పుల్లయ్యలు అధ్యక్షవర్గంగా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ దేశాన్ని రక్షించాల్సిన పాలకులు దేశాన్ని లూటీ చేస్తున్నారని అన్నారు. దేశ సంపదను, కార్మిక, కర్షక హక్కులను కాపాడుకోవడం కోసం ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మె, బంద్‌లో ప్రజాస్వామిక వాదులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతూ, రైతులు, సామాన్య ప్రజలను దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, కనీస మద్దతు ధర చట్టం చేయాలని, కార్మిక చట్టాల మార్పులను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, కనీస వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పేదలను ధనవంతులను చేస్తానని మాయమాటలు చెప్పిన మోడీ వందల కోట్ల ఆస్తి పరులకు దేశాన్ని అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ నాయకులు ఎం.సాయిబాబు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మాచారి, ఎంబి.నర్సారెడ్డి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, దొడ్డ రవికుమార్, భూక్యా రమేష్, వీర్ల రమేష్, నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, యలమంచిలి వంశీ, గద్దల శ్రీను, కొండబోయిన వెంకటేశ్వర్లు, ఎస్ఏ.నబీ, కున్సోత్ ధర్మ, దొడ్డ లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, గంగ, పద్మ, డి.వీరన్న, ఎస్ లక్ష్మి, బి.వీరభద్రం, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



16న దేశవ్యాప్త బందును జయప్రదం చేయండి



నవతెలంగాణ-చంద్రుగొండ

ఈ నెల 16న దేశవ్యాప్త బందును జయప్రదం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్కే ఉమర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, భీముడు, వెంకటేశ్వర్లు, డి.బాలు తదితరులు ఏకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

అళ్ళపల్లి : 16న దేశవ్యాప్త గ్రామీణ బందును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో సీఐటీయూ సంఘం జిల్లా నాయకురాలు కొమరం శ్రీలత అధ్యక్షతన మండల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అబ్దుల్ నబి పాల్గొని, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంగన్వాడీ నాయకులు కొమరం జయశ్రీ, సరిత, ఆశా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్ కోరుతూ సంతకాల సేకరణ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

16న దేశవ్యాప్త బంద్ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. మంగళవారం మార్బుల్ అండ్ ట్రైల్స్ వర్కర్స్ యూనియన్ భద్రాచలం పట్టణ జనరల్ బాడీ సమావేశం లంక శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి, నాయకులు వైవి రామారావు మాట్లాడారు. ఈ నెల 16 జరిగే దేశవ్యాప్త సమ్మె కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతుందని భద్రాచలం పట్టణంలో కార్మిక సంఘాలు రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు పాల్గొంటారని, పెద్ద ఎత్తున ర్యాలీ ప్రదర్శన ఉంటుందని, ఈ ర్యాలీలో మార్బుల్ అండ్ ట్రైల్స్ వర్కర్స్ యూనియన్‌తో పాటు వారి అనుబంధ సంఘ కార్మికులు కూడా పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా కార్యచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మిక అడ్డాలలో కార్మికుల నుండి సతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి సురేష్, రాజు, చంటి, రామకృష్ణ, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎస్ఐకు...సరికొత్త సవాళ్లు...?!

- చాప కింద నీరులా గంజాయి విక్రయాలు
- అడ్డూ అదుపు లేని అక్రమ ఇసుక రవాణా
- సారపాక, లక్ష్మీపురంలో ట్రాఫిక్ కంట్రోల్ సాధ్యమేనా..?!



నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సుమన్‌కు మండలంలో నెలకొన్న సమస్యలు సవాళ్ళుగా మారనున్నాయి. గోదావరి, కిన్నెరసాని నది ప్రవాహాల మధ్య బూర్గంపాడు మండలం విస్తరించి ఉండటం, మండలం పారిశ్రామిక ప్రాంతం కావడం పోలీసులకు ప్రతిసారి సవాళ్ళతో కూడిన సమస్యలు తలెత్తుతున్నాయి. బూర్గంపాడు మినహా సారపాక, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర, సంజీవరెడ్డిపాలెం, నకిరి పేట తదితర ప్రాంతాలు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాలు అభివృద్ధితో పాటు సమస్యాత్మకంగా, శాంతి భద్రతలకు ఇబ్బందికరంగా మారు తున్నాయని ఈ క్రమంలో కొత్త ఎస్సై సుమన్ మండలంలో తన మార్కును ప్రదర్శిస్తారా? అనే చర్చ మండలంలో విస్తృతంగా సాగుతోంది.. దీనిపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం...

తారాస్థాయికి చేరిన గంజాయి విక్రయాలు

మండలంలో గంజాయి విక్రయాలు చాపకింది నీరులా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా సారపాక కర్మాగా రంలో పని చేసే కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి వారు జీవనం సాగిస్తున్నారు. ఈ సమయంలో సారపాకలో చత్తీస్‌ఘడ్ , ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ ఉంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. సారపాక ప్రాంతాన్ని మినీ భారత్‌గా పిలుస్తుంటారు. అదే సమయంలో సారపాక ప్రాంతం గంజాయి విక్రయాలకు అడ్డాగా నిలిచిందనే ఆరోపణలు ఉన్నాయి. సారపాక, గాంధీనగర్ ప్రాంతాల నుంచి ఈ గంజాయి విక్రయాలు చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో ఇర వెండి, బూర్గంపాడు, లక్ష్మీపురం, రెడ్డిపాలెం తదితర ప్రాంతాలకు చేరుతున్నాయని తెలుస్తోంది. గతంలో పోలీసు లు జరిపిన దాడుల్లో ఈ గ్రామాలలో చిన్న చిన్న షాపులలో కూడా గంజాయి ప్యాకెట్లు లభ్యమైన సంఘటనలు ఉన్నాయి.

అడ్డూ అదుపు లేని ఇసుక అక్రమ రవాణా

మండలంలో అడ్డు అదుపు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా సాగుతున్నప్పటికీ పోలీస్ శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా సారపాక, రెడ్డిపాలెం, గొమ్మూరు గోదావరి రేవు, బూర్గంపాడు, సొంపల్లి ప్రాంతాల్లో ఇసుక రవాణా ట్రాక్టర్ల ద్వారా సాగుతోంది. ఈ రవాణా ఎలా సాగుతుందంటే రాత్రి, పగలు అని తేడా ఉండడు, వర్షం, ఎండ అనే తేడా కూడా ఉండదు. పోలీసులతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఈ ఇసుక అక్రమాలు చేయడం వల్ల పోలీసులపై ప్రధానంగా వెలువడుతున్న విమర్శ ఇదే..

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సాధ్యమేనా..?

మండలంలో సమస్యాత్మక గ్రామాల పై కొత్త ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కృష్ణ సాగర్, బేకుల చెరువు, సొంపల్లి, పాండురంగా పురం రైల్వే స్టేషన్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, ఉప్పుసాక తదితర ప్రాంతాలు గ్రామాలు సమస్యాత్మక పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా సారపాక, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర, బూర్గంపాడు తదితర గ్రామాలలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా లక్ష్మీపురం, సారపాక గ్రామాలలో సారపాక ఐటీసీకి ముడి సరుకులు తెచ్చే లారీలు రోడ్డు పక్కనే రోజులు తరబడి ఉండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిన సంఘటనలు ఉన్నాయి.

కొత్త ఎస్ఐ సుమన్ మార్కు సాధ్యమేనా?

గతంలో బూర్గంపాడు ఎస్సైలుగా పని చేసిన పలువురులు తమదైన శైలిలో తమ మార్కును ప్రదర్శించి శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా పనిచేశారు. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన మండలంలో ఎస్సైగా పనిచేయాలంటే కత్తి మీద సాము లాంటిదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో గతంలో ఇక్కడ పని చేసిన పలువురు ఎస్సైలు రాజకీయ ఒత్తుడులకు గురై సస్పెండ్ గురైనారు. అదేవి ధంగా పోలీస్ స్టేషన్‌లో జరిగే ప్రతి విషయాన్ని బయటికి చేర వేయటంలో సొంత సిబ్బంది హస్తం ఉందనే విషయం పలుమార్లు బయట పడింది. దీనిపై నూతన ఎస్సై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అటు ప్రతి పక్షాలతోనూ అధికార పక్షంతోను.. వామపక్షాలతోనూ... అనునిత్యం ఒత్తిడి ఉండే ఈ పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ సుమన్ తన మార్కును ప్రదర్శిస్తారా? లేదా? వేచి చూడాల్సిందే...!

ఊటచెరువు గ్రామానికి తీరిన నీటిసమస్య



నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని తాళ్లపాయ పంచాయతీ వలస ఆదివాసీ గ్రామమైన ఊటచెరువు గుంపులో చేతిపంపు గత ఆరు నెలలుగా పనిచేయకపోవడంతో 20 ఇళ్లున్న ఆదివాసీ కుటుంబాల్లో మహిళలు నీటికోసం సమీప చెరువు, వాగుల్లో చలమల ద్వారా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గ్రామంలో చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో ఇటీవల ఆ గూడేనికి వచ్చిన ములకలపల్లి వాసి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావడంతో చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చి మంగళవారం మరమ్మతులు చేయించారు. దీంతో నీటి సమస్య తీరడంతో ఆదివాసీ కుటుంబాలు, మహిళలు ఎస్సై పుష్పాల రామారావుతో పాటు సమస్యను ఆయనకు వివరించిన పుష్పాల చంద్రరావు, తాళ్లపాయ మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పుష్పాల సాయి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చిన ఎంపీఓ



నవతెలంగాణ-పినపాక

మండలంలోని జానంపేట గ్రామపంచాయతీ వలస ఆదివాసీ గ్రామం సుందరయ్య నగర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా తాగునీటి సమస్యను ఎంపీఓ వెంకటేశ్వరరావు పరిష్కరించారు. ఎంతో కాలంగా తాగునీటికి 40 కుటుంబాలు ఉన్న ఇబ్బంది పడుతున్నామని స్థానిక సీపీఐ(ఎం) నాయకులు మడివి రమేష్ ద్వారా తెలుసుకున్న ఎంపీవో తక్షణమే స్పందించారు. వెంటనే అక్కడ రిపేర్‌లో ఉన్న బోరును శుభ్రం చేయించి, నూతన మోటర్‌ను సైతం వేయించి ఇంటింటికి తాగునీరుని అందించారు. ఎంతో కాలంగా ఉన్న సమస్యను పరిష్కరించిన ఎంపీఓకు వలస ఆదివాసీ గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు. తానే స్వయంగా ఉదయం నుండి దగ్గర ఉండి పని పూర్తయి ఇంటింటికి నీరు అందే వరకు అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. తానే స్వయంగా పనులు సైతం చేశారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామంలో చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు. అలాగే దుగినేపల్లి బ్రిడ్జి గుంపులో పైప్ లైన్ వేసినా నీరు రావడంలేదని సమస్య వచ్చిందని దాన్ని నేడు పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. దానిపై సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. తన పరిధిలో ఉన్న సమస్య పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామన్నారు. అలాగే జానంపేటలో స్మశాన వాటికకు సైతం రహదారి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. దానిని సైతం తన పరిధిలో ఉంటే పరిష్కరిస్తామన్నారు. మంగళవారం పినపాక మండలంలో జానంపేట, దుగినేపల్లి, మల్లారం, జగ్గారం గ్రామపంచాయతీలలో పరిశీలించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సెక్రటరీలు ఉమామహేశ్వరరావు, జైపాల్ రెడ్డి, నాగిణి, అనూష, కృషమూర్తి, అశోక్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కూచిపూడి వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-తల్లాడ
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరరావు మంగళవారం హైదరాబాద్లో కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు. రైతుల పొలాలకు లింక్ రోడ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బస్సుల ర్యాలీని ప్రారంభించిన సండ్ర

నవతెలంగాణ-తల్లాడ
చలో నల్గొండ కార్యక్రమానికి తరలి వెళ్తున్న బస్సుల ర్యాలీని మంగళవారం తల్లాడలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జండా ఊపి ప్రారంభించారు.

ఎండిఓగా చంద్రశేఖర్



నవతెలంగాణ-కల్లూరు
మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.చంద్రశేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన బి.రవికుమార్, మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఎండిఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎండిఓను సూపరింటెంట్ వివిఎస్ శర్మ, మధుకర్ రెడ్డి తదితరులు పుష్ప గుచ్చాలు అందించి అభినందించారు.



వేపకుంట్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం
వేపకుంట్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలని మంగళవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్వప్న మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతని వెలికి తీయటంలో తమ పాఠశాల ఎప్పుడు ఒక అడుగు ముందే ఉంటుందని అన్నారు. అక్కడ తమ విద్యార్థులు, టీచర్ల బందం గణితం, సైన్స్ , ఆంగ్ల సబ్జెక్టుల లో వివిధ రకాల పాఠ్యాంశాలని వినూత్న పద్ధతులలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బోధించి తదుపరి వారికి క్విజ్ కాంపిటీషన్ పెట్టి విజేతలని బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యస్.కె. సర్వర్మియా, తెలుగు ఉపాధ్యాయులు పి. నాగేశ్వరరావు, గణిత ఉపాధ్యాయురాయు సునీత, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ట్రస్టీ సభ్యులు పన్నీరు జగన్ మోహన్ రెడ్డి , కదారి వినీత రెడ్డి , యోగానంద రెడ్డి , పాఠశాల అభివద్ధి కోసం 5 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ టీచర్స్ నజ్మారీల్ , బిట్టి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకి విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఎర్రుపాలెం
ఎర్రుపాలెం సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న అంగిరేకుల సతీష్ కుమార్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపిక అయినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ దండం అలివేలు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగిరెడ్డి సౌజన్య, ఎర్రబోలు నాగేశ్వరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జేఈఈ మెయిన్ ఫలితాలలో న్యూ విజన్ విజయ కేతనం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్
సోమవారం విడుదలయిన జెఇఇ మెయిన్ తొలి విడత పరీక్షా – 2024 ఫలితాల్లో నగరంలోని న్యూ విజన్ జూనియర్ కళాశాల విద్యార్థి వర్షిత్ కొప్పుల 99.9833112 పర్సంటైల్తో మరోసారి జయకేతనం ఎగురవేసిందని న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్.జి.కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో హైదరాబాదు మినహా ఏ ఇతర జిల్లాల విద్యార్థులు సాధించని ఘన విజయం ఖమ్మం జిల్లా నుండి 99 పర్సంటైల్ 20 విద్యార్థులు మరియు మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో 100/100 పర్సంటైల్ను న్యూ విజన్ జూనియర్ కళాశాల సాధించిందని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో జరగబోయే జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్డ్ మరియు నీట్ పరీక్షల్లో కూడా తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్.జి.కె. ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సి.హెచ్. కార్తీక్, డైరెక్టర్ సి.హెచ్. గోపిచంద్, కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు అభినందించారు.



మధిరలో అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-మధిర
ఈనెల 16న జరిగే భారత్ బంధ్ను జయప్రదం చేయాలని కోరుతూ అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో మధిర మార్కెట్ యార్డ్ నుండి భారీ బైక్ ర్యాలీ మధిర పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మున్సిపాలిటీ కౌన్సిలర్ కుమార్ కొనధని కుమార్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి బెజవాడ రవిబాబు ఐ.ఎన్.టి.యు.సి మధిర మండల అధ్యక్షుడు కోరంపల్లి చంటి జిల్లా నాయకులు పడకండి మురళి, వడ్రానపు మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తేలపోలు రాధాకృష్ణ, జిల్లా నాయకులు పల్లె కంటి విల్సన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, హమాలీ కార్మికుల రాష్ట్ర కమిటీ సభ్యులు నామాల శీను, హమాలీ నాయకులు రాము, నాగరాజు, పుల్లయ్య, మిషన్ భగీరథ జిల్లా అధ్యక్షులు అన్నం వెంకయ్య పాల్గొన్నారు.

మధిర నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మధిర
మధిర మండల అభివృద్ధి అధికారిగా మంగళవారం బొడ్డు వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మధిర మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత సూరంశెట్టి కిషోర్, నిడమనూరు వంశీ, అద్దంకి రవికుమార్, పార్టీ బంధ్ల చిట్టిబాబు, కర్నాటి రామారావు, తలుపుల వెంకటేశ్వర్లు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మో... బూర్గంపాడు పోలీస్ స్టేషన్..!?

- ఇక్కడ ఎస్ఐగా పని చేస్తే ... ఏటాచ్మెంటే..!
- ఎస్సైలను వెంటాడుతున్న ఆందోళన
- ఐటీసీలో ఎస్ఐల మకాం...
- గాడి తప్పుతున్న పోలీసుల నియంత్రణ..

నవతెలంగాణ -బూర్గంపాడు
బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పోస్ట్ సాధించాలంటే ఎంతో రికమండేషన్ అవసరం ఉండేది... అదేవిధంగా ఈ పోలీస్ స్టేషన్ కు ఎస్సైగా చాలామంది ట్రై చేసి చివరకు కొద్దిలో మిస్సయిందనే ఫీలింగ్ లో ఉండిపోయేవారు.. ఇక్కడ పనిచేసిన ఎస్ఐలకు అంత గౌరవంతో కూడిన విలువ ఉండేది... ఇక్కడ పనిచేసిన ఎస్ఐలు అందరూ సీఐలుగా, డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి, పదోన్నతులు సైతం పొందారు... ఇదంతా ఒకప్పటి ఘనమైన చరిత్ర కలిగిన బూర్గంపాడు పోలీస్ స్టేషన్ది.. ఏమైందో ఏమో గానీ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వారు పూర్తి కాలం పని చేయకుండానే... సస్పెండ్ కొందరైతే, మరి కొందరు ఎక్కువ శాతం వి.ఆర్ (వేకెన్సీ ఫర్ రిజ్వార్డ్) అటాచ్గా బదిలీలు కావడంతో పోలీసు అధికారులలో కలవరం ఆందోళన నెలకొంది. తాజాగా ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న రాజ్ కుమార్ సైతం అదే బాటలో సిసిఎస్కు అటాచ్మెంట్ గా బదిలీ కావడంతో మరల ఈ అంశం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో బూర్గంపాడు పోలీస్ స్టేషన్ కు ఎస్సైగా రావాలనే ఆలోచన సైతం కొందరు ఎస్సైలు విరమించుకుంటున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. గతంలో ఎంతో పగడ్బందీగా ఈ పోస్టు కోసం పైరవీలతో, బిజీ బిజీగా ఉండే ఎస్ఐ లు సైతం అంతగా బూర్గం పాడు పోలీస్ స్టేషన్ వైపు మొగ్గు చూపటం లేదనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఎందుకిలా?... ఏమిటి శిక్షా..?!
బూర్గంపాడు పోలీస్ స్టేషన్ లో గతంలో ఎస్సై లుగా పని చేసిన వారు ఎందరో సైతం ఈ ప్రాంతంలో పనిచేయాలని ఆసక్తిని చూపేవారు. కాలక్రమంలో ఈ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా రావాలంటేనే కొందరు ఎస్ఐలు వెనుకంజ వేస్తున్నారని తెలు స్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన పలువురు ఎస్సైలు సైతం సస్పెండ్ అయ్యారు. కొందరు వి.ఆర్, సి.సీ.ఎస్.లకు అటాచ్ గా వెళ్లటం గమనార్హం. గుర్రం ఉదయ్ కిరణ్, వెంకటప్పయ్య, జితేందర్, ధార సురేష్, బాలకృష్ణ, రాజ్ కుమార్లు ఎస్సైలుగా వచ్చి వీఆర్. సీసిఎస్ లకు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన బూర్గంపాడు మండలంలో ఎస్సై లుగా పనిచేయా లంటే అటు రాజకీయ పార్టీల తోనూ.. ఇటు కుల సంఘాలతోనూ ఎక్కువ ఒత్తిడి ఉండటం వలనే ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని తెలుస్తోంది. అదేవి ధంగా పారిశ్రా మిక ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న ఈమండలంలో శాంతి భద్రతలను కంట్రోల్ చేయుట విషయంలోనూ పోలీసులు విఫలం అవ్వటం వల్ల ఇది వారికి సమస్యగా మారుతుందని చర్చ సాగుతోంది. అదేవిధంగా మండలంలో గుట్టుచప్పుడు కాకుండా చాప కింద నీరులా గంజాయి విక్రయాలు పెద్ద స్థాయిలో జరగటం, ఈ క్రమంలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో గంజాయి పట్టివేత సంఘటనలో ఈ మండలానికి చెందిన వారే దొరకటం అనే విషయం కూడా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐలకు తలనొప్పిగా మారడంతో పాటు వారి ఉద్యోగా లకు సైతం ఎసరు తెచ్చే విధంగా మారుతున్నాయి.

ఐటీసిలో ఎస్ఐల మకాం... గాడి తప్పుతున్న పోలీస్ నియంత్రణ...



గత కొన్ని సంవత్సరాలుగా బూర్గంపాడు ఎస్సైలుగా విధులు చేపట్టే అధికారులు ఇక్కడ స్థానికంగా నివాసం ఉండకుండా సారపాక లోని ఐటిసి గెస్ట్ హౌస్ లో మకాం ఉండటం వల్లనే బూర్గంపాడు పోలీసు సిబ్బంది గాడి తప్పుతున్నారనే వ్యాఖ్యలు బలంగా వినబడుతున్నాయి. దాదాపు 6 సంవత్సరాలుగా ఇక్కడ ఎస్ఐలుగా పనిచేస్తున్న అధికారులు ఉండకుండా కొన్ని కారణాలను చూపుతూ సారపాక ఐటీసీలో మకాం ఉండటం వల్లే పోలీసు సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆక్షేపణలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో రాత్రిపూట మండలంలో పోలీసు పెట్రోలింగ్ లో సైతం సజావుగా సాగక పోవడంతోనే, రాత్రిపూట జరిగే అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఈ పోలీస్ స్టేషన్ ఎప్పటికప్పుడు పరివేక్షించాల్సిన అధికారులు సైతం అంతగా దృష్టి సారించ కపోవడం వల్ల ఇక్కడ ఈ తంతు పరంపరగా కొనసాగు తుందని వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

జిల్లా పోలీసు బాస్ దృష్టి సారించాలి:
ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిపాలనలోను, శాంతి భద్రతలు పర్యవేక్షణలో గాడి తప్పుతుందన్న విమర్శలు, ఆరోపణల నేపథ్యంలో జిల్లా పోలీస్ బాస్ ఈ స్టేషన్పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇక్కడ పనిచేసే ఎస్ఐలు లో స్థానికంగా ఉండేవిధంగా ఐటిసి పిఎస్పీడీ కర్మాగారంలో గెస్ట్ హౌస్ ల్లో ఉండకుండా నియంత్రణ చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ మండలాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి విక్రయాలు, అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై జిల్లా పోలీసు బాస్ మరింతగా దృష్టి సారించి నియంత్రణ విషయంలో కఠినమైన చర్యలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నిఘా నేత్రాన్ని కొట్టేసిన దొంగలు



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి
దొంగలు ఆధునిక పద్ధతిలో దొంగతనాలు చేయడానికి విశ్వ ప్రయత్నం చేసి చివరకు ఏమి లేవని తెలుసుకొని ఖాళీ చేతులతో వెనక్కి పోయిన సంఘటన మండలంలో సోమవారం అర్థరాత్రి సమయంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని జానకీపురం గ్రామంలో సత్తెమ్మ గుడిలో గతంలో అనేక సార్లు దొంగతనాలు జరిగి అదే గుడిలో నిద్రపోయి దొరికన సంఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా సత్తెమ్మ గుడిలో దొంగతనం చేసిన దొంగకి 8 నెలలు జైలు శిక్ష పడిన సంఘటన మరవక ముందే సోమవారం సుమారు అర్ధరాత్రి సమయంలో దొంగలు పడిన సంఘటన జరిగింది. మంగళవారం ఉదయం యధావిధిగా గుడి దగ్గరకు వెళ్లిన ఆలయ పూజారి సిసి కెమెరాలు, హుండీ, మోనటర్, గుడి గది తలుపులు ధ్వంసం అయి ఉండటం గమనించి గ్రామస్థులు తెలియజేయడంతో వారు వచ్చి చూడగా అన్ని చెల్లా చదరుగా పడి వున్నాయి.
హుండీలో నగదు గత మూడు రోజులు క్రితం తీవడం వలన ఆర్థిక నష్టం పెద్దగా జరగలేదని సిసి కెమెరాలు, మోనటర్, గుడి తలుపులు ధ్వంసం చేయడంతో సుమారు 25 వేల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలియజేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షాహిన తెలియజేశారు.

మరణంలో వీడని భార్యాభర్తల బంధం

-భర్త చనిపోయిన కొన్ని గంటలకి భార్య మృతి

- పినపాకలో విషాద ఛాయలు

నవతెలంగాణ-పినపాక
కలకాలం తోడుంటానని పెళ్లి మండపంలో ఏడడుగులు సాక్షిగా ఒక్కటైన ఆ దంపతులు మరణంలోనూ భార్యాభర్తల బంధాన్ని వీడలేదు. అనారోగ్యంతో భర్త మృతి చెందగా, ఆ బాధను తట్టుకోలేక భార్య కొన్ని గంటల వ్యవధిలో మృతి చెందింది. ఈ హృదయవిదారక సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పినపాక మండలం పినపాక చెందిన సుంకరి రాములు(80) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య సుంకరి నర్సమ్మ(75) సైతం కొన్ని నెలలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఉన్నది. ఈ నేపథ్యంలో నరసమ్మ సైతం భర్త మృతి చెందిన కొన్ని గంటలకు ఆమె మృతి చెందినట్లు నరసమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా మృతుడు సుంకరి రాములు ఉమ్మడి పినపాక పంచాయతీకి రెండు పర్యాయాలు సర్పంచ్ గా సేవలందించారు. భార్యాభర్తలు ఒకే రోజు చనిపోవడంతో పినపాకలో విషాద ఛాయలు అలముకున్నాయి. 60 ఏళ్ల పాటు ఒకరినొకరు విడిచి ఉండలేని ఈ దంపతులు ఒకేరోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. చివరకు చావులో కూడా ఒకటే అయ్యారని మృతుల బంధువులు ఆవేదన వెలిబుచ్చారు. మృతులకు దహన



సంస్కారాలు మంగళవారం నిర్వహించారు.. మృతులకు కొడుకు సుంకరి సాంబ ఉన్నారు. ఈ సంఘటన తెలిసిన వివిధ పార్టీల నాయకులు మృతుల పార్థివ దేహాలకు ఘన నివాళి అర్పించి మృతుల కుటుంబాలకి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ మనక్కు చెన్నూరు విద్యార్థి ఎంపిక

- దమ్ము చేసేటప్పుడు ప్రమాదాల నివారణ పరికరం

నవతెలంగాణ-కల్లూరు
మండల పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దంతాల కీర్తన రూపొందిన ఇన్స్పైర్ ప్రాజెక్ట్ దమ్ము చేసేటప్పుడు ట్రాక్టర్ ప్రమాదాల నివారణ పరికరం" రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి పాఠశాల నుండి జిల్లా స్థాయి పోటీలకు రెండు ప్రాజెక్టులను పంపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెట ఎల్లారెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని దంతాల కీర్తన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వరి పంట సాగు చేయుటకు దమ్ము చేసేటప్పుడు ట్రాక్టర్ ఫుల్ వీల్స్ రివర్స్ చేయునప్పుడు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఈ ప్రమాదాలు నివారణకు పరికరం తయారు చేయాలని ఆలోచన రావడంతో ఈ ప్రాజెక్టు ఉపాధ్యాయులు పి.నాగేశ్వరరావు సహకారంతో చేపట్టినట్టు తెలిపారు. తరచూ రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు నివారించడానికి ఈ పరికరాన్ని రూపొందించినట్లు, దీనిని ట్రాక్టర్కు అమర్చుకొన్నట్లైతే ప్రమాదం జరగకుండా నివారించగలము అని వివరించారు. జిల్లాస్థాయి పోటీలలో తన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాల నుండి ఒక ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ప్రాజెక్టు తయారు చేసిన కీర్తన, ప్రాజెక్టు గైడ్ చేసిన ఫిజిక్స్ ఉపాధ్యాయులు పి.నాగేశ్వరరావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



బూర్గంపాడు ఎస్సైగా సుమన్ బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-బూర్గంపాడు
మండల నూతన ఎస్సైగా కె. సుమన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన రాజ్ కుమార్ కొత్తగూడెం సీసీఎస్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కొత్తగూడెం సీసీఎస్ నుంచి ఎస్సైగా సుమన్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై పోలీసు స్టేషన్లో అదనపు ఎస్సై నాగభిక్షం, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ శాంతిభద్రతల రక్షణకు తనవంతు విధులు నిర్వర్తిస్తానని ఆయన పేర్కొ న్నారు. పోలీసులకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు.

నల్లగొండలోని బహిరంగ సభకు తరలిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-మధిర
నల్లగొండలో మంగళవారం జరిగిన బహిరంగ సభకు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో మధిర నుండి బస్సులు, కార్లల్లో బయలుదేరారు. ఈ వాహనాలను జెడ్పీ చైర్మెన్ జెండా ఊపి ప్రారంభించారు.

పిల్లలందరికీ విటమిన్ ఏ ద్రావణం అందిస్తాం

- డాక్టర్ రత్న మనోహర్

నవతెలంగాణ-తల్లాడ
ఈ నెల 13 నుండి 19 వరకు మండలంలోని ఐదు సంవత్సరాల పిల్లలకు విటమిన్ ఏ ద్రావణం అందిస్తున్నామని ఈ అవకాశం చేసుకోవాలని పిహెచ్సి వైద్యులు డాక్టర్ రత్న మనోహర్ కోరారు. ఈ టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బొప్పాయి, క్యారెట్, మామిడి ఆకుపచ్చని కూరలలో విరివిగా విటమిన్ ఏ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాస్కర్, పెద్ద పుల్లయ్య,మేరమ్మ భద్రమ్మ, మోహన్, సురేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్ ఎస్సైగా మధుబాబు నియామకం

ఎస్సై సాయికుమార్ ఖమ్మం విఆర్కు బదిలీ

నవతెలంగాణ - బోనకల్
బోనకల్ ఎస్సైగా మహబూబాబాద్ సిసిఎస్ నుంచి కడగండ్ల మధుబాబును ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు ఉన్నతాధికారులు సోమవారం నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. బోనకల్ ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ను ఖమ్మం విఆర్కు బదిలీ చేశారు. బోనకల్ ఎస్సైగా సాయి కుమార్ 2023 జూన్ 23న బాధ్యతలు స్వీకరించారు. 8 నెలల 20 రోజులపాటు బోనకల్ ఎస్సైగా విధులు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల నిర్వహణలో సాయికుమార్ కీలకపాత్ర నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో సమర్ధవంతంగానే బోనకల్ మండలంలో విధులు నిర్వహించారు. బోనకల్ పోలీస్ స్టేషన్ లో సాయికుమార్ అతి తక్కువ కాలం పని చేశారు.

గురువుని పరామర్శించిన ఎంపీ నందిగం సురేష్



నవతెలంగాణ -ఎర్రుపాలెం
మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు కోనా సుబ్బారావు గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రయివేట్ హాస్పిటల్ నందు మెరుగైన వైద్య చికిత్స పొందుతున్న గురువును బాపట్ల పార్లమెంటు సభ్యులు నందిగం సురేష్ మంగళవారం పరామర్శించారు. వారి కుటుంబ స భ్యులను యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్యం గురించి డాక్టర్లను వివరాలడికి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. త్వరగా కోలు కోవాలని అన్నారు. పరామర్శించిన వారిలో నందిగం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



తమ్మినేని వీరభద్రంను పరామర్శించిన తల్లాడ సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-తల్లాడ
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకొన్నారు. తెల్లారుపల్లి స్వగృహంలో మండల నాయకులు మంగళవారం పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో అయినాల రామలింగేశ్వరరావు, సేలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు, కళ్యాణ కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ తదితరులు పరామర్శించారు.

పరిశా సీతారత్నం చారిటబుల్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

మధిర : ఖమ్మం జిల్లా విద్యాశాఖ, జిల్లా ఉమ్మడి పరీక్ష విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో పరిశా సీతారత్నం చారిటబుల్ వారు టాలెంట్ టెస్టను మండలస్థాయిలో మధిర టీపీఎం పాఠశాల నందు నిర్వహించినట్లు టాలెంట్ టెస్ట్ కో కన్వీనర్, సిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామకృష్ణ, రాజేంద్ర ప్రసాద్ లు తెలిపారు. ప్రథమస్థానం శీలం రామ్మోహన్ రెడ్డి మర్లపాడు ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానం పసుపులేటి నందిని, మర్లపాడు ఉన్నత పాఠశాల, తృతీయస్థానం పోరళ్ళ నందిని మహదేవపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు.

నవతెలంగాణ

అమెరికా ఆమోదంతో రఫాలో ఇజ్రాయిల్ మానవ హననం

నెల్లూరు నరసింహారావు

ప్రపంచ గమనం

గాజాకు దక్షిణాగ్రంలోవున్న రఫా నగరంపై ఇటీవల ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున వైమానిక దాడులను ప్రారంభించింది. ఈ దాడుల్లో 100మందికిపైగా పాలస్తీనా ప్రజలు మృతిచెందారు. సోమవారం నాడు తెల్లవారగానే చెల్లాచెదురైన పసిపిల్లల దేహాలకు సంబంధించి హృదయ విదారకమైన దృశ్యాలను చూచిన ప్రపంచం నివ్వెరపోయింది. రానున్న రోజుల్లో మరోసారి ఇజ్రాయిల్ నరమేధం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

రఫా నగరంమీద పూర్తి స్థాయి యుద్ధం చేయనున్నామని గత వారాంతంలో ఇజ్రాయిలీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. గాజా భూ భాగంలో నివసించే ప్రజల్లో సగానికి పైగా అంటే 10లక్షల మందికి పైగా రఫా నగరంలో అత్యంత దుర్భర పరిస్థితుల్లో తలదాచుకుంటున్నారు. అక్కడ వారు నివసిస్తున్న చిరిగిపోయిన టెంట్లలో మంచినీటి సదుపాయంగానీ, కనీస ఆహారం అందుబాటులో ఉండటంగానీ, మురుగునీటి వ్యవస్థగానీ లేవు. ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో ఆస్పత్రులు నేలమట్టం అవటంతో రోగాలు ప్రబలుతున్నాయి. కరువు తాండవిస్తున్నది. ప్రపంచంలో ఆకలికి అలమటించే ప్రతి ఐదుగురిలో నలుగురు గాజాలో నివసిస్తున్నారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. రఫాపైన జరుగుతున్న దాడితో గాజాలో సంభవించే మరణాల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది. గత నాలుగు నెలలుగా ఇజ్రాయిల్ చేస్తున్న క్రూర వైమానిక బాంబు దాడులలో ఇప్పటికే 35000మందికి పైగా పాలస్తీనా ప్రజలు చనిపోయారు.

రఫాలో జరుగుతున్న మానవ హననం అమెరికా అధ్యక్షుడి అనుమతి తీసుకున్నాకే మొదలైంది. పాలస్తీనా ప్రజలపైన దాడులు ఆపాలి అన్న బైడెన్ తన మాటను



మార్చి అవి 'ఒక పథకం' ప్రకారం సాగాలని చెబుతున్నారు. ఇజ్రాయిలీ ప్రజల భద్రత కోసం పాలస్తీనా ప్రజలను చంపటం అవసరం అన్నట్టుగా ఉంది అమెరికా వైఖరి. అమెరికా, ఇజ్రాయిల్ రూపొందించిన 'పథకం' ప్రకారం 15క్యాంపు ప్రదేశాలనుంచి 25,000 టెంట్లలో నివసించే ప్రజలను రఫా నుంచి తరలించాలనే ప్రయత్నం జరుగుతున్నట్టు ఒక ఈజిప్ట్ అధికారి చెప్పాడని వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది. ఈ టెంట్ నగరాలకు అమెరికా, మధ్యప్రాచ్యంలోని దాని మిత్ర దేశాలు నిధులను సమకూరుస్తాయి. వీటి నిర్మాణం ఈజిప్ట్ నియంత ఎల్ - సీసీ నేతృత్వంలో సాగుతుంది.

ఈ విషయాన్ని మరోవిధంగా చెప్పాలంటే అమెరికా ప్రత్యక్ష ప్రమేయంతోను, నిధులతోను ఆకలితో అలమటించే, ఆరోగ్యం సరిగాలేని, నిస్సత్తువ ఆవహించిన 10 లక్షల మంది ప్రజలను ఎడారికి ఆవల టెంట్ల నగరాల్లో కుక్కనున్నారు. రఫా నుంచి ప్రజలను తరలించే పనిలో తాము పాల్గొనబోమని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియో గుటర్రెస్ అధికార ప్రతినిధి స్టిఫానే డుజ్రరిక్ చెప్పింది. ఇలా రఫాలో తలదాచుకుంటున్న పాలస్తీనా ప్రజలను బలవంతంగా తరలించే కిరాతక చర్యలో అమెరికా భాగస్వామిగా ఉంది. గత 48గంటలుగా జరుగుతున్న ఘటనలను చూశాక అమెరికా సామ్రాజ్యవాదం గాజా మానవ హననంలో ప్రత్యక్షంగా పాలుపంచుకుంటోందని ఎవరికైనా తెలుస్తుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆమోదంలేకుండా ఇజ్రాయిల్ ఏ పనీ చేయటం లేదు. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననానికి కావలసిన నిధులను, ఆయుధాలను అమెరికా సరఫరా చేస్తోంది.

గాజాలో జరుగుతున్న మానవ హననానికి బైడెన్ ఇస్తున్న షరతులులేని మద్దతువల్ల అమెరికాలో ఆయనకున్న ప్రజామోదం బాగా క్షీణించింది. అమెరికా ఇజ్రాయిల్‌కు ఇస్తున్న మద్దతు అత్యంత హేయంగా ఉందని ఉప జాతీయ భద్రతా సలహాదారు జాన్ ఫైనర్ గతవారం అరబ్ అమెరికన్ రాజకీయ నాయకులతో మిచిగన్‌లోని డియర్‌బోర్న్‌లో జరిగిన సమావేశంలో చెప్పాడని గతవారం న్యూయార్క్ టైమ్స్ రాసింది. పాలస్తీనా ప్రజల ప్రాణాలకు అమెరికా అధ్యక్షుడు, ఆయన పాలనా యంత్రాంగం అసలేమాత్రం విలువ ఇవ్వటంలేదని కూడా ఆయన చెప్పాడని టైమ్స్ రాసింది. ఇజ్రాయిల్ గాజాలో నివసిస్తున్న పాలస్తీనా ప్రజలను జంతువులతో పోలుస్తుంటే అమెరికన్ అధికారులు నోరు మెదపటం లేదని కూడా ఫైనర్ చెప్పాడు. అయితే బైడెన్ చర్యల ప్రభావం ఫైనర్ చెప్పినదానికంటే చాలా ఎక్కువగా ఉంది. మరోవైపు ఐరోపాలోని అమెరికా కూటమి దేశాలు ఇజ్రాయిల్‌ను విమర్శిస్తున్నట్టుగా నటిస్తూనే ఆర్థిక సహాయం చేస్తూ గాజాలో ఇజ్రాయిల్ పాల్పడుతున్న మానవ హననానికి తమ మద్దతును కొనసాగిస్తున్నాయి.

అమెరికా మధ్య ప్రాచ్య వ్యూహంలో గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మానవ హననం ఒక ప్రధాన అంశంగా ఉంది. ఇప్పటికే ఇరాక్, సిరియా, యెమెన్‌ల మీద అమెరికా వైమానిక దాడులు చేసింది. ఈ పరిస్థితి అమెరికా ఇరాన్‌తో ప్రత్యక్షంగా తలపడటానికి దారితీసేలా ఉంది. ఆధిపత్యం కోసం చైనా, రష్యాలపైన అమెరికా చేస్తున్న పోరులో ఇరాన్‌తో ఘర్షణకు దిగటం కూడా ఒక భాగం. ప్రపంచంపై అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటానికి ఈ దశాబ్దం "నిర్ణయాత్మక దశాబ్దం" అవుతుందని బైడెన్ పాలన పేర్కొంటోంది. ప్రపంచం పైన అమెరికా ఆధిపత్యాన్ని చెలాయించటానికి, మారకపు మీడియంగా డాలర్‌ను నిలబెట్టటానికి అమెరికా సామ్రాజ్యవాదం యుద్ధాన్ని ప్రధాన సాధనంగా ఎంచుకుంటోంది. గాజాలో పాలస్తీనా ప్రజల పైన జరుగుతున్న మానవ హననం అమెరికా సామ్రాజ్యవాదం క్రూరచర్యల పర్యవసానం ఎలావుంటుందో మానవాళికి అర్థమయ్యేలా చేస్తోంది. గత నాలుగు నెలలుగా పాలస్తీనా ప్రజలపైన నిర్విరామంగా జరుగుతున్న అమానుష దాడులను ఐక్యరాజ్య సమితి ఖండిస్తున్నప్పటికీ, ఆ దాడులను ఆపలేని దాని నిష్క్రియాపరత్వం స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. అది సామ్రాజ్యవాద దేశాల ఆధీనంలో పనిచేస్తున్న విషయం కూడా సుస్పష్టమే.

బిజినెస్

జనవరిలో స్థిర రిజిస్ట్రేషన్లు : నైట్‌ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్ : ప్రస్తుత ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో నివాస రిజిస్ట్రేషన్లు స్థిరంగా నమోదయ్యాయని నైట్ ఫ్రాంక్ ఇండియా ఓ రిపోర్ట్‌లో తెలిపింది. గడిచిన నెలలో నగరంలో 5,411 రెసిడెన్షియల్ ప్రాపర్టీలు నమోదయ్యాయని పేర్కొంది. వీటి విలువ రూ.3,279 కోట్లుగా ఉందని తెలిపింది. గతేడాదితో పోల్చితే విలువలో మాత్రం 24 శాతం పెరుగుదల చోటు చేసుకున్నట్టు పేర్కొంది. 2024 జనవరిలో నమోదయిన గృహాలలో 71 శాతం కూడా 1,000 - 2,000 చదరపు అడుగుల పరిమాణంలోనివని పేర్కొంది. రూ.1 కోటి, అంతకంటే ఎక్కువ ధర కలిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో భారీ పెరుగుదల చోటు చేసుకుందని వెల్లడించింది. 2023లో అధిక ధర కలిగిన నివాసాల వాటా 8 శాతంగా ఉండగా.. 2024 జనవరిలో ఈ వాటా 14 శాతానికి చేరినట్లు తెలిపింది.

టోటల్ ఎనర్జీస్‌తో ఎంఐబీఎల్ ఒప్పందం

ముంబయి : వినియోగదారులకు కారు బీమా సేవలను అందించడానికి టోటల్ ఎనర్జీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మహీంద్రా ఇన్స్యూరెన్స్ బ్రోకర్ లిమిటెడ్ (ఎంఐబీఎల్) తెలిపింది. ఈ ఒప్పందం ద్వారా టోటల్ ఎనర్జీస్ క్వార్ట్జ్ ఆటో సర్వీసెస్ వర్క్‌షాప్‌లలో సమగ్ర బీమా సేవలను అందించనున్నట్టు తెలిపింది. దీంతో కారు యాజమానుల బీమా ప్రక్రియను సులభంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది. దేశంలోని 235 టోటల్ ఎనర్జీస్ క్వార్ట్జ్‌ల్లో తమ సేవలు లభించనున్నాయని పేర్కొంది.

హెచ్‌ఎంఎ అగ్రో ఇండస్ట్రీస్‌కు రూ.1252 కోట్ల రెవెన్యూ

హైదరాబాద్ : ఎఫ్ఎంసీజీ కంపెనీ హెచ్ఎంఏ అగ్రో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.1251.72 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసినట్టు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో రూ.768 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. గడిచిన క్యూ3లో సంస్థ నికర లాభాలు 56.36 శాతం పెరిగి రూ.46.11 కోట్లుగా చోటు చేసుకుందని ఆ కంపెనీ పేర్కొంది. 2022-23 ఇదే క్యూలో రూ.29.49 కోట్ల లాభాలు నమోదు చేసింది.

మీషో బ్రాండ్ దుర్వినియోగంపై చర్యలు

హైదరాబాద్ : ఇ-కామర్స్ వేదిక మీషో బ్రాండ్‌ను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోనున్నట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. తమ పేరును ఉపయోగించుకొని కొందరు వినియోగదారులను మోసగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. మీషో బ్రాండు పేరుతో నకిలీ లాటరీ లెటర్లు సృష్టించి ఉచితంగా కారుతో సహా ఆకర్షణీయమైన వాటిని ఆఫర్ చేస్తూ వినియోగదారుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని పేర్కొంది. అలాంటి మోసగాళ్లపై ఇప్పటికే కోల్‌కతా, రాంచీలో కేసులు నమోదు చేసినట్లు తెలిపింది.

టీ-హబ్‌తో ఆల్టోరాండ్ భాగస్వామ్యం

హైదరాబాద్ : టీ-హబ్‌తో తమ భాగస్వామ్యాన్ని విస్తరించినట్టు ఆల్టోరాండ్ ఫౌండేషన్ తెలిపింది. ఇందులో భాగంగా తమ అల్గోభారత్ కార్యక్రమంలో స్టార్టప్ ల్యాబ్ ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రారంభించినట్టు పేర్కొంది. ఇది ఇరవై ఎంపిక చేసిన వెబ్3 స్టార్టప్‌ల ఉత్పత్తి, మార్కెట్, నిధుల సంసిద్ధత దశలో ఉన్నప్పుడు ఇంటెన్సివ్ టెక్నికల్ మరియు బిజినెస్ మెంటార్‌షిప్, ప్రీ-సీడ్ ఫండింగ్‌ను అందజేయనున్నట్టు పేర్కొంది. స్టార్టప్ టీమ్‌ల కోసం 2024 మార్చి 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. కీలకమైన మైలురాళ్లను సాధించిన స్టార్టప్‌లు ఇండియా ఫండ్‌లో భాగంగా అల్గోరాండ్ ఫౌండేషన్ నుండి ప్రీ-సీడ్ ఫండింగ్‌కు అర్హులని తెలిపింది.

ఎస్‌టిఇఎల్ లాభాల్లో 57శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఈపీసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సలాసర్ టెక్నో ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఎస్‌టీఈఎల్) 56 శాతం వృద్ధితో రూ.16.76 కోట్ల నికర లాభాలు సాధించినట్టు ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.10.69 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.204.93 కోట్లుగా ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ3లో రూ.304.35 కోట్ల ఆదాయాన్ని సాధించింది.

యూపీ రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన సమాజ్‌వాది పార్టీ

లక్నో : అఖిలేష్ యాదవ్ నేతత్వంలోని సమాజ్ వాది పార్టీ (ఎస్పీ) మంగళవారం ఉత్తరప్రదేశ్ రాజ్యసభకు తమ అభ్యర్థులను ప్రకటించింది. రామ్‌జీలాల్ సుమన్, జయాబచ్చన్, మాజీ ఐఏయస్ అధికారి అలోక్ రంజన్‌లను నామినేట్ చేసింది. ప్రస్తుతం ఎంపీగా ఉన్న జయాబచ్చన్‌ను మరోసారి నామినేట్ చేయగా, అలోక్ రంజన్‌ను మొదటిసారి ఎంపిక చేసింది. రామ్‌జీ లాల్, జయా బచ్చన్, అలోక్ రంజన్‌లు తమ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులని, వారు నేడు నామినేషన్లు సమర్పించనున్నట్టు ఎస్పీ ప్రతినిధి రాజేంద్ర చౌదరి తెలిపారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 2017లో 47 మంది ఎమ్మెల్యేలుండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 108కి పెరిగింది. దీంతో ఎస్పీ ముగ్గురు సభ్యులను రాజ్యసభకు నామినేట్ చేసే అవకాశం ఉంది. 15 రాష్ట్రాల్లోని 56 రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు ఫిబ్రవరి 15 చివరితేదీ. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

ఈసీ తీర్పుపై సుప్రీంకోర్టుకు శరద్‌పవార్

ముంబయి : ఎలక్షన్ కమిషన్ (ఇసి) తీర్పుని సవాలు చేస్తూ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వ్యవస్థాపకుడు శరద్‌పవార్ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇటీవల శరద్‌పవార్ మేనల్లుడు అజిత్‌పవార్ నేతత్వంలోని ఎమ్మెల్యే వర్గమే నిజమైన ఎన్‌సిపిగా గుర్తిస్తున్నట్లు ఇసి ప్రకటించింది. అలాగే ఎన్నికల గుర్తు 'గోడ గడియారం' ను కూడా వారికే కేటాయిస్తున్నట్లు వెల్లడించింది. అయితే డిప్యూటీ సిఎం అజిత్ పవార్ ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. శరద్ పవార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై ఏవైనా ఉత్తర్వులు జారీ చేసే ముందు విచారణ జరపాలని కోరారు. శరద్ పవార్‌పై తిరుగుబాటు ప్రకటిస్తూ.. అజిత్ పవార్ వర్గం మహారాష్ట్రలో అధికారంలో ఉన్న ఏక్‌నాథ్ షిండే-దేవేంద్రఫడ్నవీస్ (శివసేన -బిజెపి) సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన సంగతి తెలిసిందే.

కోటాలో కొనసాగుతున్న విద్యార్థుల మరణాలు..

- జేఈఈ అభ్యర్థి ఆత్మహత్య

కోటా : రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల మరణాలు కొనసాగుతున్నాయి. 12వ తరగతి చదువుతూనే జేఈఈకి శిక్షణ తీసుకుంటున్న విద్యార్థి తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ప్రతిరోజూ ఉదయాన్నే ఇంటికి ఫోన్ చేసే కుమారుడి నుంచి ఫోన్ కాల్ రాకపోవడంతో అనుమానించి వార్డెన్‌కు ఫోన్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వార్డెన్ వెళ్లి చూస్తే విద్యార్థి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టానికి తరలించారు.ఈ ఏడాది ఇది నాలుగో కేసు కాగా, గతేడాది 29 మంది ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు.

వీసీ పోస్టులకు 1,382 దరఖాస్తులు

- 312 మంది ప్రొఫెసర్లు అప్లై
- అంబేద్కర్ వర్సిటీకి అధికంగా 208 అప్లికేషన్లు
- అత్యల్పంగా ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి 51 దరఖాస్తులు
- ముగిసిన సమర్పణ గడువు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు ఉపకులపతుల (వీసీ) పోస్టులకు భారీగా దరఖాస్తులొచ్చాయి. పది వర్సిటీలకు కలిపి 320 మంది ప్రొఫెసర్లు 1,382 దరఖాస్తులను సమర్పించారు. సోమవారంతో దరఖాస్తు సమర్పణ గడువు ముగిసిన విషయం తెలిసిందే. అత్యధికంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)కు 208, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)కు 193, పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు 159, శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ)కు 158, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ)కు 157, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు 149, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ)కు 135, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్‌కు 106, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ (పీఎస్‌టీయూ) 66 దరఖాస్తులొచ్చాయి. అత్యల్పంగా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ)కు 51 దరఖాస్తులను సమర్పించారు. వీసీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల నియామకానికి అనుసరించిన విధానాన్నే వీసీల నియామకానికి వర్తింపచేసింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఆ పది వర్సిటీలకు 2021, మే 22న వీసీలను నియమించిన విషయం తెలిసిందే. వారి పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగియనుంది. దరఖాస్తులు రావడంతో త్వరలోనే వర్సిటీల వారీగా సెర్చ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. వర్సిటీల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆ కమిటీ పరిశీలిస్తుంది. అర్హులైన వారి జాబితాను రూపొందిస్తుంది. అనంతరం ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. వాటిని గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. ఆ తర్వాత వీసీలను ప్రకటిస్తుంది.

పర్యావరణ పరిరక్షణ కోసం సీఎం క్యాంప్ ఆఫీస్‌కు పాదయాత్ర

- ప్రారంభించిన ఎల్.చంద్రశేఖర్



నవతెలంగాణ-సంగారెడ్డి

పర్యావరణ పరిరక్షణ కోసం పర్యావరణవేత్తలు మంగళవారం సంగారెడ్డి నుంచి సీఎం క్యాంప్ ఆఫీస్ వరకు పాదయాత్ర చేపట్టారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, జీవాయువును పెంచేందుకు చేస్తున్న పాదయాత్రను ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్, బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు లింగంపల్లి చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ సహకరించి కాలుష్య నియంత్రణకు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్రతి సిటీని, గల్లీని, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులను సన్మానించామని తెలిపారు. ఐబీలోని వివేకానంద విగ్రహానికి, డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్, మహాత్మ జ్యోతిరావు పూలేల విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రకు తెలంగాణ జర్నలిస్టు యునియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డి.అశోక్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు యాదయ్య, సభ్యులు రాములు, కొండయ్య, మల్లేష్, రవిరాజు, వేణుగోపాల్ బాలకృష్టారెడ్డి, ఇందూరి క్రిష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.ఆదినారాయణ అంత్యక్రియలు పూర్తి

- చెకుముఖి తాతకు పలువురి నివాళులు..



నవతెలంగాణ-ఓయూ

జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.ఆదినారాయణ అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి. ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతిచెందిన విషయం విదితమే. హైదరాబాద్ తార్నాకలోని కిమితి కాలనీలో ఆయన నివాసం నుంచి ఉదయం 11 గంటల సమయంలో మృతదేహాన్ని మల్లాపూర్ శ్మశాన వాటికకు తరలించారు. ఆదినారాయణ కుమారుడు అశోక్ అంత్యక్రియలు చేశారు. అంతకుముందు పలువురు జేవీవీ నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ఓయూ సైన్స్ కళాశాల ప్రొఫెసర్లు ఆదినారాయణ మృతదేహానికి నివాళ్లర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయనతో ఉన్న గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నివాళ్లర్పించిన వారిలో సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డా. మోహన్‌రావు, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాధ్, కోశాధికారి రావుల వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజా, రాష్ట్ర నాయకులు జితేందర్, చెలిమెల రాజేశ్వర్, జేవీవీ హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖరరావు, లింగస్వామి, ఔటా అధ్యక్షుడు ప్రొ.మనోహర్ తదితరులు ఉన్నారు.

గౌరయపల్లిలో దొంగల బీభత్సం

- ఒక్క రోజే ఆరు ఇండ్లల్లో చోరీ
- నెలల వ్యవధిలో ఒక ఇంట్లో రెండు సార్లు..



నవతెలంగాణ-కొమురవెల్లి

మెదక్ జిల్లా కొమురవెల్లి మండలంలోని గౌరయపల్లి గ్రామంలో ఒకే రోజు ఆరు ఇండ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. సోమవారం అర్ధరాత్రి ఆరు ఇండ్లలో భారీగా నగదు, బంగారం దోచుకెళ్లారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని అర్ధరాత్రి ఇండ్ల తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

గౌరయపల్లి గ్రామానికి చెందిన నీల కనకయ్య ఇంట్లో 10తులాల బంగారం, బొచ్చు లక్ష్మి ఇంట్లో తులం బంగారం, 6 తులాల వెండి, రూ.21 వేలు, బండి మల్లవ్వ ఇంట్లో 25 తులాల వెండి, తులం బంగారం, రూ.4 వేలు ఎత్తుకెళ్లారు. సన్నపురి రాములవ్వ ఇంట్లో 20 తులాల వెండి పట్టాగొలుసులు, రూ.6 వేలు, నరెడ్ల మల్లవ్వ ఇంట్లో సుమారు రూ.20 వేలు, దొంతరబోయిన భిక్షపతి ఇంట్లో రూ.2 లక్షల 80 వేలను ఎత్తుకెళ్లారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఏఎస్ఐ క్రాంతి ఆధారాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

నీల కనకయ్య ఇంట్లో సుమారు 11 నెలల కిందట దొంగలు పడి కిలో వెండి ఆభరణాలు, మూడు తులాల బంగారం దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని వదిలేశారని బాధిత కుటుంబం తెలిపింది. ఆ కేసును ఛేదించక ముందే మరోసారి ఇంట్లో దొంగలు పడి బంగారం ఎత్తుకెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు ఇప్పుడైనా దర్యాప్తు చేసి దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని వాపోయారు.

సాగర్ సురక్షితమా...?

- సందర్శించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం
- వారి వెంట ఆంధ్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు
- మూడ్రోజుల పాటు కొనసాగనున్న పరిశీలన

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యామ్‌ను మంగళవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం పరిశీలించింది. 14, 15వ తేదీల్లో కూడా ఈ పరిశీలన కొనసాగనుంది. బందం సభ్యులు సోమవారం సాగర్ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. వారికి నీటిపారుదల శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లికార్జున్ పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం విజయ విహార్ అతిథి గృహంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సభ్యులు, సీడబ్ల్యూసీ, కృష్ణా రివర్ బోర్డు సభ్యులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇరిగేషన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, ఏపీ, తెలంగాణ ఇరు రాష్ట్రాల నీటిపారుల శాఖ అధికారులతో కలిసి సాగర్ ప్రధాన డ్యాం, గేట్లు, గ్యాలరీ, కుడికాలువ, హెడ్ రెగ్యులేటర్, జలవిద్యుత్ కేంద్రం, క్రస్ట్‌గేట్లను, 220, 420 గ్యాలరీలను వాక్‌వే మీద నుంచి స్పిల్‌వేను పరిశీలించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాశయం కెఆర్ఎంబి పరిధిలోకి తీసుకురానున్న నేపథ్యంలో డ్యాం భద్రత, నీటి నిల్వలు, వినియోగంపై పూర్తిస్థాయిలో నిపుణుల బృందం అధ్యయనం చేసింది. జలాశయం భద్రత, నీటి నిల్వలు, నీటి వినియోగంపై సమగ్రంగా పరిశీలించి సాగర్ డ్యాం జలాశయం వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2009లో వచ్చిన వరదలకు ఎంతమేర నీటి ప్రవాహం వచ్చింది, జలాశయం నుంచి ఎన్ని వేల క్యూసెక్కుల వరదనీరు గేట్ల ద్వారా విడుదల చేశారు.. గేట్ల ద్వారా వరదనీరు విడుదల చేస్తున్న సమయంలో ఏమైనా ఇబ్బంది కలిగిందా అంటూ ఆరా తీశారు. డ్యామ్ జలాశయానికి సంబంధించిన ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. జలాశయానికి సంబంధించిన గేట్స్, గ్యాలరీ, రోప్స్‌ను పరిశీలించారు. గత నెల 9న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలో తెలంగాణ, ఏపీతో సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా.. సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్డీఎస్ఏ, కేఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర నీటుపారుల శాఖకు సంబంధించిన 13 మంది బృందం సభ్యులు జలాశయాన్ని సందర్శించారు. ఎస్‌డిఎస్ఓ చైర్మెన్, సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్ కుమార్, సిఈ ప్రమీల, ఎస్.ఈ శ్రీనివాస్, ఈఈ విజయలక్ష్మి, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు సీఈ విజయ్ కుమార్, ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ మల్లికార్జున, డిఈ శ్రీనివాస్ రావు, పాపారావు, ఏఈ కృష్ణయ్య, సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుల శాఖ అధికారులు సిఈ మురళీధర్ రెడ్డి, ఎస్ఈ వరలక్ష్మి, ఈఈ శ్రీహరి, డిఈ మురళీధర్, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, నాగార్జునసాగర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అసిస్టెంట్ కమాండెంట్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్లకు 'రెరా' షోకాజ్‌లు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు :'రెరా' కార్యదర్శి పీ యాదిరెడ్డి హెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) రిజిస్ట్రేషన్ లేకుండా ఇష్టం వచ్చినట్టు ప్రకటనలు జారీ చేస్తూ, మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆ సంస్థ కార్యదర్శి పీ యాదిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన పలు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామనీ, 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వకుంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ మేరకు హఫీజ్‌పేటలో ప్రీ-లాంచ్ కార్యక్రమాలకు పాల్పడుతున్న బిల్డాక్స్ రియల్ ఎస్టేట్ కంపెనీకి ఇప్పటికే షోకాజ్ నోటీసు జారిచేశామనీ, అయితే వారు ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేదన్నారు. దీనితో తగిన ఆధారాలతో కొనుగోలుదారు నుండి డబ్బు తీసుకుని రశీదు ఇచ్చినట్లు ఆధారాలు లభించాయనీ, అందువల్ల మరోసారి సంజాయిషీ నోటీసు ఇచ్చామని తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం జింకల తండాలో జీఆర్ఆర్ విశ్రాంతి రిసార్ట్స్ కూడా 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపార ప్రకటనలు జారీ చేసి, మార్కెటింగ్ కార్యక్రమాలు నిర్వహించడంతో షోకాజ్ నోటీస్ జారీ చేశామన్నారు. అదే జిల్లా కూసుమంచి మండలం జీలచెరువు గ్రామంలోనూ జీఆర్ఆర్ హై వే కౌంటీ ప్రాజెక్ట్ కూడా ఇదే తరహా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందనీ, వారికి కూడా నోటీసు ఇచ్చామన్నారు. కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామంలో వెంచర్ వేసిన ఇండో ఖతార్ ప్రాజెక్ట్, అబ్దుల్లాపూర్ మండలం అంబం పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలోని అనంత వనస్థలి హిల్స్ ప్రాజెక్ట్, హైదరాబాద్‌లో పలు ప్రాజెక్టులు చేపట్టేందుకు వ్యాపార ప్రకటనలు జారీ చేస్తున్న గో గ్రీన్ గ్రూప్ ప్రాజెక్టుకు కూడా నోటీసులు జారీ చేశామన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎమ్‌డీఏ, డీటీసీపీ, యూడీఏతో పాటు స్థానిక సంస్థల నుండి అన్ని అనుమతులు పొంది, ఆ తర్వాత 'రెరా'లో రిజిస్టర్ కావాలని, ఆయా సంస్థల వ్యాపార ప్రకటనలు, మార్కెటింగ్ సమయంలో తప్పనిసరిగా ఆ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రి పదవికి సెంథిల్ బాలాజీ రాజీనామా..!

చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామ చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆయన ప్రస్తుతం జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ మరో రెండు రోజుల్లో మద్రస్ హైకోర్టు ముందుకు రానున్నది. ఈ నేపథ్యంలో సెంథిల్ మంత్రి పదవికి రాజీనామా చేయడం గమనార్హం. కాగా, న్యాయపరమైన చిక్కుల వల్లే బాలాజీ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చినట్లు తెలుస్తున్నది. గత ఏడాది జూన్ 14న మనీలాండరింగ్ కేసులో బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. జైలులో ఉన్నప్పటికీ బాలాజీని సీఎం స్టాలిన్ తన మంత్రివర్గంలోనే కొనసాగించారు. అయితే ఏ శాఖను కేటాయించలేదు. అయితే దీనిపై హైకోర్టు ఇటీవల అసంతప్తి వ్యక్తంచేసింది. బాలాజీని మంత్రి పదవిలో కొనసాగించే విషయమై మరోసారి ఆలోచించాలని సీఎం స్టాలిన్‌కు కోర్టు సూచించింది. దీంతో బెయిల్ పిటిషన్ రెండోసారి హైకోర్టు ముందు విచారణకు రానున్న నేపథ్యంలో బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు.

ప్రేమా... ఓ ప్రేమా...

ఈరోజు ప్రేమికుల దినోత్సవం. విశ్వాన్ని నడిపించే ప్రేమకు ఒక రోజేంటీ. ప్రతి రోజూ ప్రేమ మయమే. ప్రేమ ఒక నిరంతర ప్రవాహం. ప్రేమంటే ఓ అందమైన అనుభూతి. ఇలా చెప్పకుంటూ పోతే ప్రేమ గురించి ఎంత చెప్పకున్నా తక్కువే అవుతుంది. కానీ నేటి తరం ప్రేమకున్న అర్థాన్ని మార్చేస్తుంది. ఇచ్చిపుచ్చుకునే ఓ వ్యాపారంగా ప్రేమ మారిపోయింది. ఎంత ఖరీదైన బహుహతి ఇస్తే అంత గొప్పగా ప్రేమిస్తున్నట్టు భావిస్తున్నారు. యువత ఆలోచనలు అడ్డుపెట్టుకొని ఈరోజున పెట్టుబడి దారులు కోట్లల్లో వ్యాపారం చేస్తున్నారు. కానీ నిజమైన ప్రేమంటే ఇది కాదు. ప్రేమకు మరణం లేదు. గెలిచి ఓడినా... ఓడి గెలిచినా ప్రేమ... ప్రేమే. కొందరి జీవితాల్లో ప్రేమ ఎంతో మధురంగా ఉంటే మరికొందరి జీవితాల్లో చేదుని మిగుల్చుతుంది. ఈ ప్రేమ ఎక్కడ ఎప్పుడు ఎలా పడుతుందో చెప్పడం కష్టం.

'ప్రేమంటే పరస్పరం చూసుకోవడం కాదు. ఇద్దరూ ఒకే దృష్టికోణంలో బయటి ప్రపంచాన్ని చూడడం' అన్నాడు ఒక ఫ్రెంచి రచయిత. ఆనందానికి ద్వారాలు తీసే ప్రేమను ఎవరైనా ఆహ్వానిస్తారు. అటువంటి ప్రేమ కోసం వేచిచూస్తారు. కానీ నేటి ప్రేమల్లో వేచిచూడటం శుద్ధ దండగనుకుంటున్నారు. ప్రస్తుత బిజీ జీవితంలో ప్రేమ కూడా వేగంగా పరుగులు తీస్తుంది. అప్పటికప్పుడే మారిపోతుంది. ఆ వేగం, మార్పు ఎంతగా అంటే ప్రేమిస్తున్న వారికి కూడా అందనంతగా. దాంతో ప్రేమకంటూ ఒక రోజును సృష్టించేశారు. అందుకే ఈ రోజు ప్రేమికులకు ఓ ప్రత్యేకమైపోయింది. విలువైన బహుమతులు, పార్కులు, సినిమాలు, షికార్లు ఇవే ప్రేమంటే అని చెబుతుంది ఈ రోజు.

నిజమైన ప్రేమలో...

ప్రేమను వర్ణించడం సులువే, కానీ నిర్వచించడమే కష్టం. ప్రేమించటం, ప్రేమించబడటం ఒక గొప్ప అనుభూతి. అది నిజమైన ప్రేమైతే ఇక జీవితమంతా సుఖప్రదమే. నిజమైన ప్రేమలో అనుమానానికి తావుండదు. నమ్మకమే అక్కడ రాజ్యమేలుతుంది. ప్రేమించిన వారు పొరపాటు చేసినా ఆ ప్రేమ ముందు పొరపాటు దూదిపింజలాంటిదే. కష్టాలను, బాధలను నిజమైన ప్రేమ మైమరపింపచేస్తుంది. నీకు నేనున్నాననే నమ్మకాన్ని కలిగిస్తుంది. చిన్న చిన్న గిల్లికజ్జాలు వచ్చినా వారి మధ్య వున్నటువంటి స్వచ్ఛమైన ప్రేమ ముందు అవి ఏపాటివి. అందుకే కాలం పరుగులు తీస్తున్నా ప్రేమ మాత్రం చిరకాలం ఉంటుంది. శతాబ్దాలు గడుస్తున్నా ప్రేమకున్న గొప్పదనం పెరుగుతూనే ఉంది.

అమ్మకాల కోసమే ప్రేమికులు

అయితే నేటి ఆధునిక ప్రపంచంలో స్వచ్ఛమైన ప్రేమ కలుషితమవుతుంది. ప్రేమంటే కేవలం కొంత కాలం సరదాగా గడపడం. ప్రేమించుకున్న వారు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటే అదే నిజమైన ప్రేమ. ఈ భావాన్ని ప్రపంచీకరణ యుగం మరికాస్త పెంచిపోషిస్తోంది. తాము ఉత్పత్తి చేసిన వస్తువుల అమ్మకాల కోసం ప్రేమను, ప్రేమికులను సృష్టిస్తోంది. అలా సృష్టించిన ప్రేమ ఎంతకాలం మనగలుగుతుంది. సరిగ్గా ప్రేమించడం కొందరికే తెలుసు. ఆ ప్రేమను నిలుపుకోవడం చాలా కొద్ది మందికే తెలుసు. అందుకే నేటి ప్రేమలు ఎక్కువకాలం నిలవలేక మధ్యలోనే కనుమరుగవుతున్నాయి. ఫలితంగా నిజమైన ప్రేమకు సైతం ఈ ప్రపంచీకరణ యుగంలో విలువ లేకుండా పోతుంది. ఈ మాయ నుండి ఇప్పటికైనా బయట పడదాం. ఈర్ష్య, ద్వేషం, స్వార్థం లేని స్వచ్ఛమైన ప్రేమను కాపాడుకుందాం.



ప్రేమ పేరుతో దాడులు

ప్రేమ పేరుతో అమ్మాయిలపై దాడులు కూడా బాగా పెరిగిపోతున్నాయి. ఒక అమ్మాయి తనని కాదంటే నేటి తరం భరించలేక పోతుంది. తమకు దక్కని అమ్మాయి ఇంకెవరికీ దక్కకూడదని దాడులకు తెగబడుతున్నారు. అమ్మాయీ ఓ మనిషే అని మర్చిపోతున్నారు. తనకూ ఇష్టాయిష్టాలు ఉంటాయని గుర్తించలేకపోతున్నారు. నేటి మీడియా ప్రభావమే దీనికి ప్రధాన కారణం. ప్రేమ తప్ప మరో లోకం చూపని సినిమాలు యువత ఆలోచనలను పక్కదోవ పట్టిస్తున్నాయి. జీవితం అంటే ప్రేమే అనే ధోరణిలో తయారు చేస్తున్నారు. అలాగే కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుంటున్న జంటలపై దాడులు జరుగుతున్నాయి. ఇలాంటి భావాల నుండి బయట పడి యువతను, నిజమైన ప్రేమను, ప్రేమికులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉంది.

తెలుసుకోవడం లేదు

ప్రేమని ఈ రోజుల్లో చాలా లైట్‌గా తీసుకుంటున్నారు. ప్రేమలో ఆనందం, సంతోషం, ఉద్రేకం, చిలిపితనం, అంగీకరం, తిరస్కారం, బాధ, త్యాగం ఇలా ఎన్నో ఇమిడి ఉంటాయి. ప్రేమ గురించి తెలుసుకోకుండానే నేడు చాలా మంది ప్రేమలో పడిపోతున్నారు.

- నయనతార



సినీ ప్రేమ వేరు

సినిమాల్లో ప్రేమ ఒకప్పుడు 24 రీళ్ల ఉండేది. ఇప్పుడు 14 రీళ్లకు కుదించుకుపోయింది. అదే నిజజీవితంలో అయితే ప్రేమ జీవితాంతం ఉంటుంది. సినిమాల్లో కథానాయికగా ఉండే ప్రేమ వేరు. జీవితంలో ప్రియురాలిగా, జీవిత భాగస్వామిగా అనుభవించే ప్రేమ నిజం.

- అనుష్క



అది ఆకర్షణ మాత్రమే

సినిమా ప్రేమలు తాత్కాలికమైతే, నిజజీవితంలో ప్రేమ యధార్థం. ఇప్పుడు చిన్నతనంలోనే ప్రేమలో పడుతున్నారు. అదంతా ఒట్టి ఆకర్షణ మాత్రమేనని నా ఉద్దేశ్యం. యుక్త వయసులో, మనసులు వికసించాకనే ప్రేమ అంటే ఏమిటో బోధ పడుతుంది. ఒకరిని ఒకరు అర్థం చేసుకోగలుగుతారు. నా దృష్టిలో అదే నిజమైన ప్రేమ.

- త్రిష

వడ్డించేవారు మనవారైతే...

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్టు తెలుస్తోంది.

ముఖం చూసి వడ్డన

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల కొన్ని సంవత్సరాలుగా స్థాన చలనం లేకుండా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్ గడువు ముగిసినా తిరిగి ఆర్డర్స్ తెచ్చుకుని పొడిగించుకుంటూ వస్తున్నారు. వీరిలో చాలా మంది పిల్లల చదువులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, వ్యక్తిగత అనారోగ్యం, దంపతులు ఇద్దరు ఉద్యోగులై ఉండటాన్ని కారణంగా చూపుతున్నారు. అటువంటి వారి డిప్యూటేషన్లు కాకుండా అందరివీ ఏకపక్షంగా రద్దు చేయడం కూడా విమర్శలకు తావిస్తోంది. పైపెచ్చు అటువంటి వారు అధికారులను మేనేజ్ చేసి ఇప్పుడు కూడా ఉన్నచోటే విధులు నిర్వహించేలా.. వ్యూహాత్మకంగా ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలుస్తోంది. పిల్లల పరీక్షల సమయంలో డిప్యూటేషన్లు రద్దు చేయడం వీరికో సాకుగా మారిందనే చర్చ జరుగుతోంది.

డిప్యూటేషన్లు రద్దైనా ఉన్నచోటే..!

గత ప్రభుత్వ హయాంలో అధికారులను మేనేజ్ చేసి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి నచ్చిన చోటికి డిప్యూటేషన్లు వేయించుకున్న కొందరు అధికారుల పేర్లు.. ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటేషన్ల రద్దు జాబితాలో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు అధికారులు, ఆఫీస్ సూపరింటెండెంట్, ఇద్దరు సివిల్ సర్జన్స్ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నా వారిని డిప్యూటేషన్ రద్దు జాబితాలో చేర్చలేదు. ఒకరి ఒరిజనల్ పోస్టు నల్లగొండ అయితే ఖమ్మంలోనే డిప్యూటేషన్‌పై ఉంటున్నారు. ఇక్కడ డీఎల్‌వోగా పని చేస్తున్నారు. మరొకరిది సివిల్ సర్జన్‌గా ఖమ్మం ఒరిజనల్ పోస్టు కాగా, డిప్యూటేషన్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారిగా పనిచేస్తున్నారు. ఖమ్మం జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రి నుంచి లిస్టు తయారీ విషయంలో అనేక అనుమానాలున్నాయి. ఏ అధికారి పోస్టు ఎక్కడ..? డిప్యూటేషన్‌పై ఎక్కడ ఉన్నారు..? అనే విషయాలను స్పష్టంగా పేర్కొనలేదని తెలుస్తోంది. అధికారులను వివరణ కోరినా సమాధానం లేదు. దీనిపై పలువురు ఉద్యోగులు అధికారుల వైఖరిని తప్పుపడుతున్నారు.

కొందరి పేర్లు డిప్యూటేషన్ రద్దు జాబితాలో...!

ప్రమోషన్‌పై బదిలీ అయిన కొందరి పేర్లు డిప్యూటేషన్ రద్దు జాబితాలో ఉండటంపై అనుమానాలున్నాయి. నర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న ఓ నర్స్ ప్రమోషన్‌పై తిరుమలాయపాలెం వెళ్తే ఆమెను కూడా డిప్యూటేషన్‌లో ఉన్నట్టు పేర్కొన్నారని సమాచారం. ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్లో పనిచేసే మరో నర్స్ ప్రమోషన్‌పై కొత్తగూడెం బదిలీ అయితే ఆమె కూడా డిప్యూటేషన్‌లో ఉన్నట్టు అధికారులు జాబితాలో సూచించారు. ఇంకో నర్స్ ఒరిజనల్ పోస్టు ఆదిలాబాద్ రిమ్స్ కాగా, ఆమె డిప్యూటేషన్ మహబూబాబాద్‌కు ఇచ్చారు. ఈ రెండుచోట్ల కాకుండా ఆమె ఏడాది కాలంగా ఖమ్మంలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. డిప్యూటేషన్ రద్దు కావడంతో ఇప్పుడు ఆమె ఆదిలాబాద్ వెళ్లారు. ఇలా అధికారులు డిప్యూటేషన్ రద్దు జాబితాలో గందరగోళం సృష్టించి.. పై అధికారులను సైతం తప్పుదోవ పట్టించినట్టు తెలుస్తోంది.

రాష్ట్రం నుంచి వాళ్లను వెళ్లగొడతాం..

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1961 తర్వాత రాష్ట్రంలోకి వచ్చి జీవనం సాగిస్తున్న వారందరినీ గుర్తించి పంపించి వేస్తామని ప్రకటించారు. ఇంఫాల్‌లో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కులం, మతంతో సంబంధం లేకుండా అలాంటి వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొడతామని పేర్కొన్నారు. మణిపూర్‌కు చెందిన తెగల ఉనికిని కాపాడేందుకే ఈ చర్యలు చేపడుతున్నామని బీరెన్ సింగ్ చెప్పుకున్నారు. కాగా, మణిపూర్‌లో గత ఆరు నెలలు నుంచి కొనసాగుతున్న హింసాకాండకు అక్రమ వలసదారులు ముఖ్యంగా మయన్మార్ నుంచి వచ్చిన శరణార్థులు కారణమని ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ గతంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు ప్రస్తుతం కష్టకాలంలో ఉన్నాం.. ఇక్కడ ఉనికి కోసం పోరాటం జరుగుతోంది అని ప్రకటించారు. ప్రస్తుతతరం అభద్రతాభావంతో ఉందని, ఈ తరం ఎదుర్కొంటున్న అభద్రతాభావం ముందు తరాలకు ఉండకూడదు అని బీరెన్‌సింగ్ అన్నారు.

గాజా యుద్ధంలో అదానీ డ్రోన్లు !

న్యూఢిల్లీ : గాజాలో సాగిస్తున్న మారణహోమంలో అదానీ గ్రూప్ భాగస్వామ్య కంపెనీ తయారు చేసిన డ్రోన్లను ఇజ్రాయిల్ ఉపయోగిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన అదానీ-ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో అదానీ గ్రూపుకు మెజారిటీ వాటాలు ఉన్నాయి. ఈ ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ ఇజ్రాయిల్‌కు 20కి పైగా సైనిక డ్రోన్లను సరఫరా చేసింది. ఇజ్రాయిల్ అమానుష చర్యలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో ప్రస్తుతం విచారణ జరుగుతోంది. గత నాలుగు నెలలుగా గాజాలోని పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సైన్యం యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ తయారు చేస్తున్న డ్రోన్ల తరహాలోనివే హెర్మస్ డ్రోన్లు. వీటిని ఇప్పటికే గాజాలో ఉన్న ఇజ్రాయిల్ రక్షణ దళాలు విస్తృతంగా యుద్ధంలో ఉపయోగిస్తున్నాయి. ఈ మారణకాండలో పది వేల మంది చిన్నారులు సహా 28 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

కాగా ఓ మోస్తరు ఎత్తు ఉండే ఈ మానవ రహిత గగనతల వాహనాల (యూఏవీ) విక్రయం వ్యవహారం ఈ నెల 2న వెలుగులోకి వచ్చింది. నీలం మాథ్యూస్ అనే వ్యక్తి రక్షణ రంగానికి చెందిన షెపర్డ్ మీడియా వెబ్‌సైట్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. అయితే ఈ సమాచారాన్ని ఇప్పటి వరకూ రెండు దేశాలు ధృవీకరించలేదు. కానీ అదానీ గ్రూపులో పేరు చెప్పడానికి ఇష్టపడని కొన్ని వర్గాలు మాత్రం డ్రోన్ల విక్రయం జరిగిందని స్పష్టం చేశాయి. ఈ డ్రోన్లను గాజాలో జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దాడికి ఉపయోగిస్తారని సమాచారం. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని మోడీ ప్రభుత్వం ఓ వైపు అధికారికంగా ఇరు పక్షాలనూ కోరుతుంటే మరోవైపు ప్రధానికి అత్యంత సన్నిహితుడైన అదానీకి చెందిన కంపెనీ ఇజ్రాయిల్‌కు డ్రోన్లు సరఫరా చేయడం గమనార్హం. ఇజ్రాయిల్‌కు ఎఫ్-35 ఫైటర్ జెట్ల విడిభాగాల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని హేగ్ న్యాయస్థానం సోమవారం నెదర్లాండ్స్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ అమ్మకం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోందని స్పష్టం చేసింది. అయినప్పటికీ అదానీ గ్రూపు భాగస్వామ్య కంపెనీ ఇజ్రాయిల్‌కు డ్రోన్ల అమ్మకాన్ని కొనసాగిస్తూనే ఉంది.



2018లో ఇజ్రాయిల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ కంపెనీ అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్‌తో ఉమ్మడి భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఇందులో ఇజ్రాయిల్ కంపెనీకి 49% వాటాలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇజ్రాయిల్ వెలుపల తొలిసారిగా హైదరాబాదులో యూఏవీల ఉత్పత్తి కోసం పదిహేను మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఓ సంస్థ ఏర్పడింది. అయితే డ్రోన్ల అమ్మకం వ్యవహారంపై ఇజ్రాయిల్ రక్షణ సంస్థ సరైన సమాధానం చెప్పడం లేదు. కాంట్రాక్టులు, సరఫరాదారులు, వినియోగదారులకు అందజేసే పరికరాలపై ఎల్బిట్ సిస్టమ్స్ ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని మాత్రం చెబుతోంది. కానీ హైదరాబాదులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని అదానీ సంస్థలో యూఏవీని పూర్తి స్థాయిలో తయారు చేశారని షెపర్డ్ మీడియా తెలిపింది. యూఏవీల తయారీకి అవసరమైన హెర్మస్-900 కిట్లతో పాటు సెన్సార్లు, ఇంజిన్లు వంటి పరికరాలను కూడా భారత్‌కు ఎల్బిట్ అందజేసిందని వివరించింది.

గత సంవత్సరం అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేసిన తర్వాత గాజాలో సైనిక చర్య ప్రారంభమైంది. ఇందులో హెర్మస్-900 డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఈ డ్రోన్లను నిఘా కోసమే కాకుండా గాజాలో చిన్నపాటి బాంబులు వేసేందుకు కూడా ఇజ్రాయిల్ సైనికులు వినియోగిస్తున్నారు

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్‌లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ 2024 సెషన్-1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం విడుదల చేసింది. ఈ పేపర్-1 (బీఈ/బీటెక్) ఫలితాల్లో దేశవ్యాప్తంగా 23మంది విద్యార్థులు 100 శాతం స్కోరు సాధించారు. వీరిలో 10 మంది దాకా తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులే ఉన్నారు. తెలంగాణ నుంచి ఏడుగురు విద్యార్థులు ఈ ఘనత సాధించారు. తెలంగాణకు చెందిన పబ్బ రోహన్ సాయి, ముతవరపు అనూప్, రిషి శేఖర్ శుక్లా, హుందేకర్ విదిత్, మదినేని వెంకట సాయి తేజ, తవ్వ దినేశ్ రెడ్డి, కల్లూరి శ్రియాషస్ మోహన్‌లు జేఈఈ మెయిన్ పేపర్ -1లో 100 శాతం స్కోరు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తిక్, అన్నారెడ్డి తనీశ్ రెడ్డి 100 శాతం స్కోరు సాధించారు. రాజస్థాన్, మహారాష్ట్ర నుంచి ముగ్గురు.. హర్యానా, ఢిల్లీ నుంచి ఇద్దరు.. గుజరాత్, కర్ణాటక, తమిళనాడు నుంచి ఒక్కొక్కరు చొప్పున 100 శాతం స్కోరు సాధించారు. 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జేఈఈ మెయిన్ తొలి విడత పేపర్-1 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 11,70,036 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కాగా, జేఈఈ మెయిన్ 2024 సెషన్-1 ఫలితాలను జేఈఈ అధికారిక వెబ్ సైట్‌లో విద్యార్థులు తమ స్కోర్ కార్డును యాక్సెస్ చేసుకోవచ్చు. అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు. గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలో పర్సంటైళ్లతో పాటు మొత్తం జేఈఈ మెయిన్ పర్సంటైల్ కూడా తెలుసుకోవచ్చు. సెషన్ 1 తుది కీని ఎన్‌టిఎ సోమవారం మధ్యాహ్నం విడుదల చేసిన విషయం తెలిసిందే. చివరి విడత (సెషన్ 2) ఏప్రిల్ 4 నుంచి 15 మధ్య నిర్వహించనున్నట్టు ఎన్‌టీఏ ఇప్పటికే ప్రకటించింది. గతంలో ఒకేసారి రెండు విడతలకు దరఖాస్తు చేసిన వారు మళ్లీ ఇప్పుడు చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. మార్చి 2వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సెషన్ 1 రాసిన విద్యార్థులు సెషన్ 2కు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అప్పుడు రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు.

తక్షణమే బలగాలను ఉపసంహరించుకోవాలి

- రైతులపై అణచివేతకు ఎస్కేఎం ఖండన
- చర్చలు కోరుతూ ప్రధాన మంత్రికి లేఖ
- ఫిబ్రవరి 16న దేశవ్యాప్త నిరసనకు పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతు సంఘాల ఢిల్లీ చలో మార్చ్‌ను నిరోధించడానికి మోడీ ప్రభుత్వం అధికారాన్ని పూర్తిగా వినియోగించుకోవడాన్ని, లాఠీచార్జి, రబ్బరు బుల్లెట్, టియర్ గ్యాస్ షెల్లింగ్, సామూహిక అరెస్టులకు పాల్పడటాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) తీవ్రంగా ఖండించింది. రైతులపై టియర్ గ్యాస్ షెల్స్ వేయడానికి డ్రోన్‌లను ఉపయోగించడం ఆశ్చర్యం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 16న దేశంలోని అన్ని గ్రామాలలో పంజాబ్‌లో రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా నిరసించాలని, దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మెను మరింత భారీగా విజయవంతం చేయాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది. రైతుల శాంతియుత పోరాటంపై దాడి చేసేందుకు పోలీసులను, సాయుధ భద్రతా బలగాలను దింపడం పట్ల మోడీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని పేర్కొంది. ప్రజాస్వామ్య సమాజంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి జీవనోపాధిని కాపాడే డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపింది.

తమ నిజమైన డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చిన ప్రజలను ప్రభుత్వానికి, దేశానికి శత్రువులుగా పరిగణించవద్దని ఎస్కేఎం మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రైతుల ప్రధాన డిమాండ్ ఎంఎస్పీ (సి2+50 శాతం) 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ, ప్రస్తుత ప్రధానమంత్రి వాగ్దానం చేసి పదేండ్లు అయినా అమలు చేయలేదని విమర్శించింది.

తక్షణమే బలగాలను ఉపసంహరించుకోవాలని, ఢిల్లీ చలో నిరసనను నిర్వహించి రైతుల హక్కులను కాపాడాలని, రైతులు, కార్మికుల పోరాటాలను చర్చలతో పరిష్కరించాలని కోరుతూ ఎస్కేఎం ప్రధానికి లేఖ రాసింది. ఉమ్మడి డిమాండ్‌లపై ఐక్య సమస్య ఆధారిత పోరాటాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలని భావసారూప్య సంఘాలకు విజ్ఞప్తి చేసింది.

ప్రధాని మోడీకి ఎస్కేఎం లేఖ

"రైతులు, కార్మికుల 21 పాయింట్ల డిమాండ్ చార్టర్‌కు మద్దతుగా ఫిబ్రవరి 16న పారిశ్రామిక / సెక్టోరల్ సమ్మె, గ్రామీణ భారత్ బంద్ సందర్భంగా తాము మీకు మరోసారి లేఖ రాస్తున్నాము. మీరు 2021 డిసెంబరు 9న ఎస్కేఎంకిచ్చిన వాగ్దానం అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై మీకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొంది.

"అన్ని పంటలకు స్వామినాథన్ ఫార్ములా ప్రకారం ఎంఎస్పీ సి2+50 శాతంతో సేకరణకు చట్టపరమైన హామీ, ఇన్‌పుట్ ఖర్చుల తగ్గింపుతో రుణమాఫీ, కొత్త విద్యుత్ బిల్లు ప్రకారం విద్యుత్ చార్జీల పెంపు లేదు, స్మార్ట్ మీటర్లు లేవు, వ్యవసాయానికి, గృహవసరాలకు, దుకాణాలకు ఉచిత 300 యూనిట్ల విద్యుత్, ప్రతి పంటకు జరిగిన నష్టానికి చెల్లించాల్సిన సమగ్ర పంట బీమా, ప్రధాన నిందితుడు అజయ్ మిశ్రా టెనిని జైలుకు పంపడంతో సహా లఖింపూర్ మారణహోమానికి పాల్పడిన వారికి శిక్ష, పింఛన్లను నెలకు రూ. 10,000కు పెంచడం" వంటి సమస్యలను పరిష్కరించాలి.

"ఈ సమస్యలన్నింటినీ పరిశీలించి, వాటిని సకాలంలో పరిష్కరించేందుకు కమిటీని ఏర్పాటు చేసి నిర్వహించడంలో మీ ప్రభుత్వం విఫలమైంది. రైతులను ఇబ్బంది పెట్టే సమస్యలను పరిష్కరించే మీ రాజ్యాంగ బాధ్యత నుండి తప్పించుకోవడానికి రైతుల ఉద్యమం విభజించడానికి ప్రచారం చేయడానికి ఇతర సంఘాలతో మాట్లాడటానికి ప్రయత్నించిన మీ మంత్రులు ఎస్‌కెఎంతో మాట్లాడటానికి వెనుకడుగు వేశారు. రైతుల శాంతియుత నిరసనలపై మీ ప్రభుత్వం, హర్యానా, యూపీ నేతృత్వంలోని బీజేపీ అణచివేత చర్యలకు వడిగట్టాయి. సాధారణ రైతులపై భయానక వాతావరణాన్ని సృష్టించాయి" అని పేర్కొంది.

"పంజాబ్ సరిహద్దులో లాఠీచార్జి, రబ్బరు బుల్లెట్, బాష్పవాయువులను ప్రయోగించారు. అనేక మంది గాయపడిన రైతులపై జరిగిన అణచివేతను మేము తీవ్రంగా నిరసిస్తున్నాము. దేశంలో కిసాన్ ఉద్యమం ఐక్యంగా, ఏక దృష్టితో ఉందని, అలాంటి నిరంకుశ, మితిమీరిన చర్యలను ప్రతిఘటిస్తుందని స్పష్టం చేయాలనుకుంటున్నాము".

" కేంద్ర బడ్జెట్‌లు, శాఖాపరమైన కేటాయింపులతో వ్యవసాయంలో కార్పొరేట్ జోక్యానికి చురుగ్గా మద్దతిస్తున్న నేపథ్యంలో రైతుల దుస్థితిపై సానుభూతి చూపాలని ప్రధానిగా మేము మిమ్మల్ని కోరుతున్నాం. ఎస్కేఎం లేవనెత్తిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి. దేశంలోని రైతుల డిమాండ్లను పరిష్కరించేందుకు చర్చను ప్రారంభించాలి" అని కోరింది.

"ఢిల్లీ చలో రైతుల నిరసనను అడ్డుకోవడం, అణచివేతకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ చర్యలపై మేము విచారం వ్యక్తం చేస్తాం. పంజాబ్ సరిహద్దులోని హైవేలపై కాంక్రీట్ బారికేడ్లు, ఇనుప మేకులు, ముళ్ల తీగలు ఏర్పాటు చేయడం, ఇంటర్నెట్ నిలిపివేయడం, 144 సెక్షన్ విధించడం. భయానక వాతావరణాన్ని సృష్టించడంతో అడ్మినిస్ట్రేషన్ సరిహద్దులను అడ్డుకుంది. నిరసనకారులను దేశ శత్రువులుగా భావించారు. పంజాబ్, హర్యానా ముఖ్యమంత్రులు హర్యానా-పంజాబ్ సరిహద్దులను భారతదేశం-పాకిస్తాన్ సరిహద్దుల వలె అడ్డుకోవడం. ఢిల్లీ చలో రైతుల నిరసనలో పాల్గొనకుండా భోపాల్ వద్ద కర్ణాటక రైతులను అరెస్టు చేసి దాడులు చేయడంపై దారుణం" అని ఎస్కేఎం పేర్కొంది. "రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన సమస్య ఆధారిత ఐక్య ఉద్యమంగా ఎస్కేఎం ఆవిర్భవించింది. ఈ ప్రక్రియలో రైతులు ఐక్యంగా ఉండి, కార్మికులు, ట్రేడ్ యూనియన్ ఉద్యమం క్రియాశీల మద్దతుతో మేము విజయం సాధించాం" అని తెలిపింది.



రైతులపై టియర్ గ్యాస్



"న్యూ ఇండియాలో టెక్నాలజీ వల్ల అన్నదాతలు ధనవంతులౌతున్నారు"
ఇది బీజేపీ వారి ట్వీట్!
సాక్ష్యం ఇదిగో ప్రధాని పక్కనే ఎగురుతున్న కిసాన్ డ్రోన్ ఫొటో
కాని మంగళవారం దృశ్యం వేరే! రైతులపై భాష్పవాయువు గోళాలు వేస్తున్నది డ్రోన్లతోనే...



- సిద్ధార్థ వరదరాజన్, ది వైర్ పోర్టల్ సంపాదకులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శించారు. ఖన్నౌరీ సరిహద్దు మీదుగా హర్యానాలో ప్రవేశించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నించిన రైతన్నలపై భాష్పవాయు గోళాలు విసిరారు. నీటి ఫిరంగులను ప్రయోగించారు. ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. అనేక చోట్ల వివిధ అంచెల్లో బారికేడ్లను, సిమెంట్ దిమ్మలను, కంటెయినర్ గోడలను ఏర్పాటు చేశారు. రైతులు తిరగకుండా రోడ్లపై ఇనుప మేకులను అమర్చారు. ఎర్రకోట వద్దకు సందర్శకులను అనుమతించడం లేదు. సోమవారం రాత్రి బాగా పొద్దు పోయిన తర్వాత దీనిని మూసివేశారు. ఎర్రకోటను చేరుకునే ఓఆర్ఆర్‌పై బారికేడ్లను అమర్చారు. ఢిల్లీ వైపు వస్తున్న రైతులు షంభూ (హర్యానా-పంజాబ్) సరిహద్దు వద్ద పోలీసులతో ఘర్షణకు దిగారు. మరోవైపు తిక్రి సరిహద్దును ఢిల్లీ పోలీసులు మూసివేశారు. అక్కడ ఐదు మీటర్ల పొడవైన సిమెంటు దిమ్మలతో బహుళ అంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. తిక్రి మెట్రో స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిని కలిపే వీధులు, గ్రామాలకు రాకపోకలను నిషేధించారు. తిక్రి సరిహద్దు వద్ద మూడు మహిళా కంపెనీలు సహా పెద్ద ఎత్తున పోలీసు దళాలను మోహరించారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలతో ఉన్న సరిహద్దుల వద్ద రాజస్థాన్ ప్రభుత్వం భద్రతను కట్టుదిట్టం చేసింది. మూడు జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలిపివేసింది.

కేంద్రం విజ్ఞప్తికి 'నో'

అరెస్ట్ చేసిన రైతులను నిర్బంధించేందుకు బావనా స్టేడియంను తాత్కాలిక జైలుగా మార్చాలంటూ కేంద్రం చేసిన విజ్ఞప్తిని ఢిల్లీ ప్రభుత్వం తోసిపుచ్చింది. రైతుల డిమాండ్లు సమంజసమైనవేనని, వారిని అరెస్ట్ చేయడం సరికాదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మొండి వైఖరి ప్రమాదకరం : బీకేయూ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి ప్రమాదకరంగా ఉన్నదని భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు నరేష్ తికాయత్ విమర్శించారు. 'వేర్వేరు రాష్ట్రాలకు వేర్వేరు డిమాండ్లు ఉన్నాయి. రైతులు నిరంతరం నిరసనలు తెలుపుతారా? వారు ఎప్పుడూ ఢిల్లీ వస్తారా?' అని ప్రశ్నించారు.

హడావిడిగా చట్టం చేయడం కుదరదు : కేంద్రం

కనీస మద్దతు ధరలపై హడావిడిగా చట్టాన్ని చేయడం సాధ్యం కాదని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా అన్నారు. దీనిపై అందరు భాగస్వాములతో చర్చించాల్సిన అవసరం ఉన్నదని, ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రైతులు ముందుకు రావాలని ఆయన చెప్పారు. కొన్ని శక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల ఆందోళనను అప్రదిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రెండు దఫాలుగా జరిపిన చర్చల్లో అనేక డిమాండ్లను అంగీకరించామని, అయితే కొన్ని అంశాలపై అంగీకారం కుదరలేదని తెలిపారు.

అధికారంలోకి వస్తే ఎంఎస్‌పీపై చట్టం : రాహుల్

తాము అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు కనీస మద్దతు ధర అందించేందుకు చట్టాన్ని తీసుకొస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇది న్యాయం దిశగా తాము అందిస్తున్న తొలి గ్యారంటీ అని తెలిపారు. దీని ద్వారా పదిహేను కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వివరించారు. రైతుల న్యాయమైన డిమాండ్‌ను అంగీకరించాల్సింది పోయి బీజేపీ ప్రభుత్వం వారిపై భాష్ప వాయువును ప్రయోగిస్తోం దని, జైళ్లలో కుక్కు తోందని ఆరోపించారు. కాగా ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న రైతు సంఘాల నాయకుల సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేశారని, దీనివల్లే ప్రతిష్టంభన ఏర్పడిందని కాంగ్రెస్ ఆరోపించింది. రైతులతో ప్రధాని మోడీ నేరుగా చర్చలు జరపాలని డిమాండ్ చేసింది.

కూర్పు కుదిరేనా?

• రోహిత్, ద్రవిడ్‌కు సరికొత్త సవాల్ • కొత్త ముఖాలకు చాన్స్!

భారత్, ఇంగ్లాండ్ ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ రసవత్తర దశకు చేరుకుంది. రాజ్‌కోట్ వేదికగా రోహిత్, బెన్‌స్టోక్స్ సేనలు అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమమయ్యాయి. రెండు టెస్టు అనంతరం 1-1తో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలిచాయి. మూడో టెస్టులో విజయంతో సిరీస్‌లో ఆధిక్యంతో పాటు, ప్రత్యర్థిపై మానసికంగా పైచేయి సాధించేందుకు ఇరు జట్లు వ్యూహం రచిస్తున్నాయి. కీలక మూడో టెస్టు ముంగిట ఆతిథ్య భారత్ తుది జట్టు కూర్పుపై కుస్తీ పడుతోంది. తుది జట్టులో కనీసం ముగ్గురు నయా ఆటగాళ్లు చోటు దక్కించుకునే అవకాశం కనిపిస్తుంది.


నవతెలంగాణ-రాజ్‌కోట్

వికెట్ కీపర్ సందిగ్ధత

రిషబ్ పంత్ గాయంతో అందుబాటులో లేడు. ఇషాన్ కిషన్‌ను సెలక్టర్లు పరిగణనలోకి తీసుకోవటం లేదు. దీంతో కె.ఎస్ భరత్ తొలి రెండు టెస్టుల్లో వికెట్ కీపింగ్ గ్లౌవ్స్ దక్కించుకున్నాడు. వికెట్ల వెనకాల ఫర్వాలేదు అనిపించిన భరత్.. బ్యాట్‌తో పూర్తిగా తేలిపోయాడు. రాజ్‌కోట్ టెస్టులో భరత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో జట్టు మేనేజ్‌మెంట్ ఉంది. రాజ్‌కోట్‌లో మంగళవారం స్లిప్స్ కార్డన్‌లో సర్ఫరాజ్, యశస్వి జైస్వాల్ తోడుగా జురెల్ వికెట్ కీపింగ్ సాధన చేశాడు. నెట్స్‌లో రెండు భిన్న సెషన్లలో బ్యాటింగ్ సాధన చేశాడు. భరత్ సైతం ఎక్కువసేపు బ్యాటింగ్ సాధన చేసినా.. ధ్రువ్ జురెల్ అరంగ్రేటం చేసే అవకాశం ఎక్కువగా ఉంది.

సర్ఫరాజ్‌కు అవకాశం!

శ్రేయస్ అయ్యర్‌పై సెలక్టర్లు వేటు వేశారు. కెఎల్ రాహుల్ మోకాలి నొప్పితో దూరమయ్యాడు. బ్యాటింగ్ లైనప్‌లో నం.4, నం.5 స్థానాలు ఖాళీ అయ్యాయి. రాహుల్ స్థానంలో విశాఖ టెస్టులో రజత్ పటీదార్ అరంగ్రేటం చేశాడు. ఇప్పుడు అయ్యర్ సైతం దూరం కావటంతో నం.4 స్థానంలో మరో ఆటగాడు అవసరం అయ్యాడు. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం టెస్టు జట్టులో చోటు సాధించిన సర్ఫరాజ్ ఖాన్.. తుది జట్టులో చోటును త్వరగానే దక్కించుకోనున్నాడు!. మంగళవారం బ్యాటింగ్ సెషన్లో కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు సర్ఫరాజ్ ఖాన్ సుదీర్ఘంగా సాధన చేశాడు. మరో యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ సైతం సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నాడు. కానీ, సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. మిడిల్ ఆర్డర్‌లో కీలక నం.4, నం.5 స్థానాల్లో ఇద్దరు కొత్త ఆటగాళ్లతో బరిలోకి దిగే సాహసం ద్రవిడ్, రోహిత్ చేయగలరా?ఆసక్తికరం.





మూడో స్పిన్నర్ ఎవరు?

ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా గాయం నుంచి కోలుకున్నాడు. సొంత మైదానం రాజ్‌కోట్‌లో మంగళవారం ప్రాక్టీస్ సెషన్లో పాల్గొన్నాడు. బంతితో తక్కువ సమయమే సాధన చేసిన జడేజా.. ఎక్కువ సమయం బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు కేటాయించాడు. రవీంద్ర జడేజా మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించినట్టు తెలుస్తోంది. దీంతో జడేజా, అశ్విన్‌లు స్పిన్ కోటాలో తుది జట్టులో నిలువనున్నారు. మూడో స్పిన్నర్ స్థానం కోసం అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ పోటీపడుతున్నారు. హైదరాబాద్ టెస్టులో అక్షర్ పటేల్ అవకాశం దక్కించుకున్నాడు. విశాఖలో జడేజా లేని వేళ పోటీ లేదు. మళ్లీ రాజ్‌కోట్‌లో అక్షర్, కుల్దీప్ రేసు మొదలైంది. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్పిన్‌కు అనుకూలించని పిచ్‌పై సైతం ప్రభావం చూపగలడు. జట్టుకు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలువగలడు. సంప్రదాయ స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు భారత పిచ్‌లపై తిరుగులేని రికార్డుంది. అక్షర్ పటేల్ బ్యాటింగ్ నైపుణ్యం అతడికి అదనపు బలం.

బ్యాటింగ్ లైనప్‌లో మిడిల్ ఆర్డర్‌లో రెండు కీలక స్థానాలు, వికెట్ కీపర్ సహా మూడో స్పిన్నర్ అంశంలో జట్టు మేనేజ్‌మెంట్ కసరత్తు చేస్తోంది. రాజ్‌కోట్ పిచ్ హైదరాబాద్ తరహాలో ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. పిచ్, పరిస్థితులు, ప్రత్యర్థి బలాబలాలు సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది జట్టు కూర్పును ద్రవిడ్, రోహిత్ ద్వయం సిద్ధం చేయనున్నారు.

ముమ్మర సాధన

రాజ్‌కోట్ టెస్టుకు భారత్, ఇంగ్లాండ్ మంగళవారం ముమ్మర సాధన చేశాయి. శుభ్‌మన్ గిల్, దేవదత్ పడిక్కల్, జశ్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ మినహా జట్టులోని 13 మంది ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. ఇంగ్లాండ్ క్రికెటర్లు సైతం రాజ్‌కోట్‌లో కఠోర సాధన చేశారు. రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్‌లు నెట్స్‌లో ఎక్కువ సమయం గడిపారు.

డబ్ల్యూఎఫ్‌ఐపై సస్పెన్షన్ ఎత్తివేత

యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ప్రకటన

న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్‌కు శుభవార్త. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై గత ఏడాది ఆగస్టు 23న విధించిన తాత్కాలిక సస్పెన్షన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ) మంగళవారం ఎత్తి వేసింది. ఈ మేరకు ఫిబ్రవరి 9న సమావేశమైన యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ బ్యూరో సస్పెన్షన్‌పై కీలకం నిర్ణయం తీసుకుంది.

జులై 1, 2024 లోపు భారత రెజ్లింగ్ సమాఖ్య అథ్లెట్స్ కమిషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని, మాజీ అధ్యక్షుడి లైంగిక వేధింపులపై నిరసన గళం ఎత్తిన రెజ్లర్లపై సెలక్షన్ ట్రయల్స్‌లో ఎటువంటి వివక్ష చూపించకూడదని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ బ్యూరో ఆదేశించింది. సస్పెన్షన్ ఎత్తివేతతో భారత కుస్తీ క్రీడాకారులు ఇక నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో మువ్వెన్నల జెండాతో బరిలోకి దిగనున్నారు.

మెస్మరైజ్ చేసే ఫాంటసీ థ్రిల్లర్


సందీప్ కిషన్ నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. విఐ ఆనంద్ దర్శకుడు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత రాజేష్ దండా మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..



రాజేష్ దండా

- విఐ ఆనంద్ చెప్పిన కథ చాలా డిఫరెంట్‌గా అనిపించింది. కొత్త కంటెంట్‌తో కొత్త జోనర్‌లో సినిమా చేస్తే ఆ సినిమా సక్సెస్ అవుతుంది, క్రేజ్ వస్తుందని నమ్మి చేశాం. ఈ రోజు మా నమ్మకం నిజమైంది. సందీప్ కిషన్ కెరీర్‌లో హయ్యస్ట్ బడ్జెట్ సినిమా ఇది. అలాగే హయ్యస్ట్ బిజినెస్ సినిమా కూడా ఇదే. విడుదలకు ముందు చాలా హ్యాపీగా ఉన్నాం. ఆనంద్ చెప్పిన దానికి రెండింతలు అద్భుతంగా తీశారు.
- ఈ సినిమాతో సక్సెస్ ట్రాక్‌ని కొనసాగించి హ్యాట్రిక్ కొడతామనే నమ్మకం ఉంది ప్రీమియర్ షోలు అన్నీ ఫుల్ అయ్యాయి. హైదరాబాద్‌లో ప్రముఖ సింగిల్ స్క్రీన్స్‌లో ప్రీమియర్స్ అన్నీ ఫుల్ కావడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కి అద్దం పడుతున్నాయి.
- ఇదొక ఫాంటసీ థ్రిల్లర్. మన ఊర్లో ఏం జరుగుతుందో మనికి తెలుసు. కానీ 'భైరవకోన' అనే ఊరులో కొత్తగా వెరైటీగా ఎవరూ ఊహించని సంఘటనలు జరుగుతుంటాయి. అది నాకు చాలా ఆసక్తిని కలిగించింది. అలాగే గరుడపురాణంలో మిస్ అయిన పేజీలకి ఈ కథకి ఉన్న లింక్ ఏమిటనేది కూడా చాలా ఆసక్తిగా ఉంటుంది. సినిమాలో 47 నిమిషాలు పాటు అద్భుతమైన సిజీ వర్క్ ఉంది. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. ప్రేక్షకులకు చాలా గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే చిత్రమిది.
- నేను, అనిల్ కలసి చేసిన సినిమాల కథలు ముందు నేను విని నచ్చితే అనిల్ వింటారు. విని ఆయన సలహాలు, సూచనలు చేస్తారు. ఇందులో కూడా ఆయన ఓ విలువైన సూచన చేశారు. అది చాలా హెల్ప్ అయ్యింది. కథాపరంగా ఈ కథకు సీక్వెల్, ప్రీక్వెల్ చేయొచ్చు. రెండు ఆలోచనలు ఉన్నాయి. శేఖర్ చంద్ర తన ప్రతి సినిమాలో చాలా మంచి పాటలు ఇస్తారు. ఇందులో 'నిజమేనా చెబుతున్న..' పాట చాలా వైరల్ అయ్యింది. ఇందులో నేపథ్య సంగీతం కూడా అద్భుతంగా ఉంటుంది.
- ఇందులో ప్రీ ఇంటర్వెల్, ఇంటర్వెల్ ట్విస్ట్ అద్భుతంగా ఉంటాయి. 'భైరవకోన'లోకి ఎంటరైన తర్వాత జర్నీ అంతా థ్రిల్లింగ్‌గా ఫీల్ అవుతారు. ఈ సినిమా కోసం సందీప్ కిషన్ చాలా హార్డ్ వర్క్ చేశారు. తన కెరీర్‌కి, మా బ్యానర్‌కి ఇది నెంబర్ 1 సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం అల్లరి నరేష్‌తో 'బచ్చల మల్లి' సినిమా చేస్తున్నాం. కిరణ్ అబ్బవరంతో ఓ సినిమా చేయబోతున్నాం. త్వరలోనే వాటి వివరాలను తెలియజేస్తాం.

ప్రేమికుల రోజు కానుకగా సెకండ్ సాంగ్ రిలీజ్



అభిషేక్ పచ్చిపాల


అభిషేక్ పచ్చిపాల, నజియా ఖాన్, జబర్దస్త్ ఫణి, సతీష్ సారిపల్లి ముఖ్య పాత్రల్లో నటించిన సినిమా 'జస్ట్ ఎ మినిట్'. రెడ్ స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్, కార్తీక్ ధర్మపురి ప్రెజెంట్స్ బ్యానర్లపై అర్షద్ తన్వీర్, డా. ప్రకాష్ ధర్మపురి ఈ చిత్రాన్ని పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి రెండోవ సాంగ్‌ని ప్రేమికుల రోజు కానుకగా మేకర్స్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు పూర్ణస్ యశ్వంత్ మాట్లాడుతూ, 'గతంలో మేం రిలీజ్ చేసిన ఫస్ట్-లుక్‌కి చాలా మంచి స్పందన లభించింది. తర్వాత టీజర్‌కి కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్ చూసిన ప్రతి ఒక్కరూ పాజిటివ్ కామెంట్స్ ఇస్తూ, డిఫరెంట్‌గా ఉంది కాన్సెప్ట్ అని మెచ్చుకోవడం మాకు మంచి ధైర్యాన్నిచ్చింది. అతి త్వరలో ట్రైలర్‌ని కూడా రిలీజ్ చేయబోతున్నాం. ట్రైలర్‌లో మరిన్ని ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ రివీల్ అవుతాయి. గతంలో ఎన్నో అద్భుతమైన పాటలు పాడిన హైమత్ ఈ సాంగ్ పాడడం సాంగ్‌కి చాలా ప్లస్ అయ్యింది. రాంబాబు గోశాల సాహిత్యం యువతని ఎంతగానో అలరిస్తుంది' అని చెప్పారు.

'మా చిత్ర ఫస్ట్-లుక్, టీజర్‌కి వస్తున్న ఆదరణ మాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. ఇలాగే ప్రేక్షకుల ఆదరణ మా సినిమా పైన ఉండాలని, సినిమాను మంచి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఇషిత, వినీషా, కుషి భట్, నాగిరెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన - దర్శకత్వం : అర్షద్ తన్వీర్, డిఓపి : అమీర్, ఆర్ట్ డైరెక్టర్ : శేఖర్ ఇప్పకాయల, ఎడిటర్ : దుర్గ నరసింహ, మ్యూజిక్ : యస్. కె భాజీ.

నవచిత్రం

ట్రైలర్‌తో భ్రమయుగం సంచలనం



మమ్ముట్టి

వైవిధ్యమైన చిత్రాలతో అలరించే మమ్ముట్టి తెలుగు ప్రేక్షకులకు కూడా ఎంతగానో చేరువయ్యారు. ఇప్పుడు ఆయన మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో 'భూతకాలం' ఫేమ్ రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్‌పై చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మించిన మలయాళ చిత్రం 'భ్రమయుగం'. హారర్-థ్రిల్లర్ జోనర్ చిత్రాలను నిర్మించడం కోసం ప్రత్యేకంగా ఏర్పడిన నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్.. వైనాట్ స్టూడియోస్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించింది.

ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకోవడంతో 'భ్రమయుగం' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఇటీవల విడుదలైన ట్రైలర్ కట్టిపడేసింది. ఈనెల 10న అబుదాబిలో జరిగిన వేడుకలో మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. చాలా కాలం తర్వాత బ్లాక్ అండ్ వైట్‌లో రూపొందిన ఈ చిత్ర ట్రైలర్ కొత్త అనుభూతినిచ్చింది. పాచికల ఆట నేపథ్యంలో తర్వాత ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠను రేకెత్తిస్తూ సాగిన ట్రైలర్.. సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది.

ఈ కథ కేరళలో మాయ/తంత్రంతో నిండిన యుగంలో నడుస్తుంది. ఒక గాయకుడి జీవితంలో జరిగిన అనూహ్య ఘటనల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఈ సినిమా 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఒకేసారి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మొదట మేకర్స్ భావించారు. అయితే మాతృక భాషలో చూస్తే ఆ అనుభూతి బాగుంటుండటంతో పాటు, మరింత థ్రిల్ చేస్తుందన్న ఉద్దేశంతో ముందుగా మలయాళం భాషలో మాత్రమే విడుదల చేయాలని తాజాగా మేకర్స్ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

500 థియేటర్లలో..



దాసరి కిరణ్‌కుమార్, రామ్‌గోపాల్ వర్మ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను నేపథ్యంగా తీసుకుని దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రూపొందించిన సినిమాలు 'వ్యూహం', 'శపథం'. ఈ సినిమాలను రామదూత క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీస్‌లో వైఎస్ జగన్ పాత్రలో అజ్మల్, వైఎస్ భారతి పాత్రలో మానస కనిపించనుంది. సెన్సార్ అడ్డంకులు దాటుకున్న 'వ్యూహం' ఈ నెల 23న, 'శపథం' మార్చి 1న థియేటర్స్‌లోకి రాబోతున్నాయి. ఈ సినిమాల ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, 'ఈ సినిమాల రిలీజ్ విషయంలో నేను థ్యాంక్స్ చెప్పాల్సిన ఒకే ఒక వ్యక్తి నారా లోకేష్. నేను, దాసరి కిరణ్ కుమార్ ఈ సినిమాలను డిసెంబర్‌లో రిలీజ్ చేయాలని అనుకున్నాం. లోకేష్ కోర్టుకు వెళ్లి మా సినిమా రిలీజ్‌ను అడ్డుకున్నారు. ఇప్పుడు సరిగ్గా ఎలక్షన్స్‌కు ముందు మా రెండు సినిమాలు రిలీజ్ అయ్యేలా పరోక్షంగా హెల్ప్ చేసింది ఆయనే. ప్రజా జీవితంలో ఉన్న కొందరి మీద మనకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. అలా నాకు ఉన్న అభిప్రాయాలతో, వాస్తవ ఘటనల నేపథ్యంగా నేను వ్యక్తీకరించిన సినిమాలే ఇవి. వైఎస్ మృతి నుంచి వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసేవరకు వ్యూహం కథ ఉంటుంది. జగన్ సీఎం ప్రమాణ స్వీకారం నుంచి చంద్రబాబు జైలుకు వెళ్లేవరకు శపథం కథ చూపిస్తున్నాం. నేను ఈ సినిమాను జగన్ కోసం కాదు పవన్, చంద్రబాబు కోసం తీశాను' అని తెలిపారు.

'ఈ రెండు సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 500 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం. ఆ టైమ్‌లో పెద్ద సినిమాల రిలీజ్ లేవు. రెండు సినిమాలు గ్యారెంటీగా సక్సెస్ అవుతాయి. ఈ రెండు సినిమాలు మొదలుపెట్టినప్పుడే రిలీజ్‌కు అడ్డంకులు వస్తాయని తెలుసు. తెలిసే ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాం. మా సినిమాలను ఆపడం కోసం నారా లోకేష్ విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ చివరికి న్యాయమే గెలిచింది. భావ ప్రకటన స్వేచ్ఛకు గౌరవం ఇస్తూ కోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ఆనందంగా ఉంది' అని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ చెప్పారు.

రైతుల కన్నీళ్ళకు అద్దం పట్టే సినిమా



వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. హిమ బిందు సమర్పణలో తెలుగువన్ ప్రొడక్షన్స్ పతాకంపై భాను దర్శకత్వంలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. అఖిలన్, వీణ, వినోద్ కుమార్, వాణీ విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈనెల 15న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ, రైతులు స్వచ్ఛందంగా ఇన్ని వేల ఎకరాల భూములు ఇస్తే దానిని హేళన చేస్తూ, వాళ్ళని క్షోభకిగురి చేసిన పరిణామాలు చోటు చేసుకున్నాయి. దానిని స్ఫూర్తిగా తీసుకొని రైతుల పక్షాన ఒక సినిమా తీయాలని అనుకున్నాం. ఈ సినిమా ఏ పార్టీకి వ్యతిరేకం కాదు. మాకు కనిపించిందల్లా రైతుల కళ్ళలో కన్నీళ్లు. ఆ కన్నీళ్లకు సమాధానంగా, కన్నీళ్లు తుడిచే విధంగా సమాజాన్ని చైతన్య పరుస్తూ ఒక సామాజిక బాధ్యతగా ఈ సినిమా చేశాం. భాను చాలా అద్భుతంగా తీశాడు. మణిశర్మ చాలా అద్భుతమైన సంగీతం అందించారు. ప్రతి కుటుంబంలో ఏదో ఒక తరంలో ఒక రైతు ఉంటాడు. అందరూ ఒక బాధ్యతగా భావించి ఈ చిత్రాన్ని ఆదరించి రైతు కుటుంబాలని ఆదరించాలని కోరుతున్నాను' అని తెలిపారు.

'ఇది పొలిటికల్ సినిమా కాదు. రైతుల అవేదని తెలియజేసే కథ. నేను రైతు పాత్రని పోషించాను. ఇందులో ప్రధాన పాత్రధారులు అమరావతి రైతులు.వారికి స్పెషల్ థ్యాంక్స్ చెప్పాలి. చాలా హార్డ్ వర్క్ చేశారు. ఇది కంటెంట్ బేస్డ్ స్టోరీ. చాలా మంచి సినిమా అవుతుంది' అని వినోద్ కుమార్ చెప్పారు.

దర్శకుడు భాను మాట్లాడుతూ,'రవిశంకర్ చాలా అద్భుతంగా ప్రోత్సహించారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని చూపించే ఈ కథలో నటించడానికి ముందుకు వచ్చిన వినోద్ కుమార్‌కి థ్యాంక్స్. అలాగే వాణీ విశ్వనాథ్. దాదాపు ఏడు వందల రైతుల మధ్య ఈ సినిమా తీశాం. మాది జాతీయ జెండాలాంటి సినిమా. అందరికీ ఉపయోగపడే సినిమా ఇది. ఇది పొలిటికల్ సినిమా కాదు, పబ్లిక్ ఫిల్మ్. రాజధాని రైతుల ఆవేదనని తెలియజేసే ప్రజల సినిమా ఇది. ప్రజల ప్రయోజనం కోసం తీసిన సినిమా ఇది' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886